శ్రీరామ శ్రీరామ శ్రీరామ

# అనుగీత

(మహాభారతము అశ్వమేధ పర్వము నుండి సేకరణ)

సంస్కృత మూలము

భగవాన్ శ్రీ వేదవ్యాసులవారు

తెలుగు అనువాదము

కవిత్రయము

సులభ శైలిలో మీకు అందించినది


యం.వి.సుబ్రహ్మణ్యం

చిరునామా

2-31 చైతన్యపురి, హైదరాబాదు

9866140619

040-24048104

# అను గీత

(మహాభారతము అశ్వమేధపర్వఅంతర్గతము)

శంతన మహారాజు హస్తినాపురమును పరిపాలిస్తున్నప్పుడు, ఆయనకు గంగాదేవి వలన ఒక కుమారుడు కలిగాడు. ఆయన పేరు దేవవ్రతుడు. శంతన మహారాజు మరొక వివాహం చేసుకున్నాడు. ఆయన రెండవ భార్య పేరు సత్యవతి. సత్యవతి వివాహ సందర్భంలో దేవ వ్రతుడు తాను వివాహం చేసుకోననీ, రాజ్యమును అభిలషించననీ భీష్మమైన ప్రతిజ్ఞ చేసాడు. ఆ కారణంగా దేవవ్రతుడు భీష్ముడు అని సార్థకనామధేయుడు అయ్యాడు.

శంతనుడికి సత్యవతి వలన ఇద్దరు కుమారులు కలిగారు. వారు విచిత్రవీర్యుడు చిత్రాంగదుడు. చిత్రాంగదుడు ఒక గంధర్వుని చేతిలో మరణించాడు. విచిత్రవీర్యుడు వ్యసనపరుడు. భీష్ముడు కాశీరాజు కుమార్తెలు అయిన అంబిక, అంబాలిక అనే కన్యలతో విచిత్రవీర్యుని వివాహం జరిపించాడు. అంబికకు ధృతరాష్ట్రుడు, అంబాలికకు పాండురాజు అనే కుమారులు జన్మించారు. ధృతరాష్ట్రుడు పుట్టుగుడ్డివాడు. ధృతరాష్ట్రునికి గాంధార రాజకుమారి గాంధారితో వివాహం జరిగింది. గాంధార రాజకుమారితో పాటు ఆమె తమ్ముడు శకుని కూడా హస్తినాపురం చేరుకొని తిష్ఠవేసాడు. పాండురాజు కుంతల రాజకుమారి కుంతీదేవిని, మద్రదేశ రాజకుమారి అయిన మాద్రిని వివాహం చేసుకున్నాడు.

శంతనుని మరణానంతరము, భీష్ముడు, పాండురాజును హస్తినాపురానికి రాజును చేసాడు. పాండురాజు తన అవిక్రపరాక్రమాలతో కురు సామ్రాజ్యాన్ని అభివృద్ధిచేసాడు. కారణాంతరాల వలన పాండురాజు రాజ్యాన్ని వదిలి పెట్టితన ఇద్దరు భార్యలతో వనవాసం వెళ్లిపోయాడు. అక్కడ పాండురాజుకు కుంతీదేవివలన ముగ్గురు, మాద్రి వలన ఇద్దరు కుమారులు కలిగారు. హస్తినాపురంలో ధృతరాష్ట్రునికి గాంధారివలన నూర్గురు కుమారులు కలిగారు. పాండురాజు పుత్రులు పాండవులనీ, గాంధారి పుత్రులు కౌరవులనీ ప్రశిద్ధిచెందారు. పాండురాజు అకాల మరణానంతరము మాద్రి తన ఇద్దరు కుమారులను కుంతికి అప్పగించి పాండురాజుతో సహగమనం చేసింది. కుంతీదేవి తన ఐదుగురు కుమారులతో హస్తినాపురం చేరుకుంది.

దాయాదుల మధ్య రాజ్యసింహాసనము కొరకు స్పర్థలు మొదలయ్యాయి. పాండవులను చంపించాలని దుర్యోధనుడు వివిధ ప్రయత్నాలు చేసాడు. పాండవులు తెలివిగా తప్పించుకొంటూ వచ్చారు. ఆఖరుకు వారణావతంలో లక్కఇంట్లో పెట్టి దహించ చూచాడు దుర్యోధనుడు. పాండవులు తమ తల్లి కుంతితో సహా తప్పించుకొని పాంచాల దేశం చేరుకున్నారు.

అక్కడ పాంచాల రాజకుమారి ద్రౌపదిని వివాహం చేసుకున్నారు. ధృతరాష్ట్రుడి ఆహ్వానం మేరకు భార్యాసహితంగా హస్తినకు చేరుకున్నారు పాండవులు.

దాయాదుల మధ్య వైరం భరించలేక భీష్ముడు రాజ్యవిభజన చేయమన్నాడు. ధృతరాష్ట్రుడు పక్షపాత వైఖరి అవలంబించి తన కుమారులకు సుభిక్షము, అభివృద్ధిచెందినది అయిన హస్తినాపురమును తన కుమారులకు, ఎందుకూ పనికిరాని అరణ్యప్రాంతము, కొండలు గుట్టలతో కూడిన ఖాండవ ప్రస్థమును పాండవులకు పంచి ఇచ్చాడు. పాండవులు తమ బావ అయిన శ్రీకృష్ణుని సాయంతో ఖాండవ ప్రస్థాన్ని ఇంద్రప్రస్థంగా మార్చుకున్నారు. నేల నలు చెరుగులా తమ రాజ్యాన్ని విస్తరింపచేసి రాజసూయయాగం చేసారు. పాండవులలో పెద్దవాడైన ధర్మరాజు చక్రవర్తి అయ్యాడు. ఆయన తమ్ములు అయిన భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు అన్నగారి అడుగుజాడలలో నడుస్తున్నారు.

ఇది చూచిన కౌరవులలో పెద్దవాడైన దుర్యోధనుడికి, ఆయన పెద్ద తమ్ముడు దుశ్శాసనుడికి, ఆయన మేన మామ శకునికి, ఆయన అనుంగు మిత్రుడు కర్ణుడికి కన్నుకుట్టింది. ఏదో ఒక విధంగా పాండవుల రాజ్యం కాజేయాలనుకున్నారు. ఏదో ఒక మిష మీద పాండవులను హస్తినకు పిలిపించారు. వినోదంగా జూదం ఆడాలని సంకల్పించారు. వినోదం కాస్తా విపరీతమైన పట్టుదలలకు దారి తీసింది. ధర్మరాజు తన సామ్రాజ్యం, ధన,కనక,వస్తువాహనాలు, తన తమ్ములు నలుగురు, తన భార్య ద్రౌపదిని జూదంలో పణంగా పెట్టి ఓడిపోయాడు. తన తమ్ములు, భార్యతో సహా ధర్మరాజు, పన్నెండేళ్లు వనవాసం, ఒక ఏడు అజ్ఞాతవాసము అనుభవించాడు. తిరిగి వచ్చిన తరువాత తమ రాజ్యం తమకు ఇమ్మని అడిగాడు. యుద్ధంలో కానీ, జూదంలో కానీ పోగొట్టుకున్న రాజ్యం తిరిగి దానంగా తీసుకోకూడదనీ, వీరులైతే యుద్ధం చేసి తీసుకోమనీ దుర్యోధనుడు బదులు చెప్పాడు. దానితో యుద్ధం అనివార్యం అయింది.

యుద్ధం మొదటి రోజున అర్జునుడు తీవ్రమైన విషాదానికి లోనయ్యాడు. ఆ విషాదం లో నుండి అర్జునునిని బయట పడెయ్యడానికి శ్రీకృష్ణుడు అర్జునుడికి గీతాబోధ చేసాడు. తరువాత మహాభారత యుద్ధం 18 రోజులు జరిగింది. 18 అక్షౌహిణీల సైన్యం హతమయింది. పాండవులు మిగిలారు. తాత భీష్ముడు, గురువు ద్రోణుడు, సుయోధనుడు, దుశ్శాసనుడుతో సహా నూరుగురు తమ్ములు, శకుని, కర్ణుడు, అందరూ మరణించారు. ధర్మరాజు హస్తినాపురానికి పట్టాభిషిక్తుడు అయ్యాడు. అందరూ సంతోషంగా ఉన్నారు.

తను వచ్చి చాలా రోజులు అయినందున, శ్రీకృష్ణుడు ద్వారకకు వెళ్లడానికి ధర్మరాజు అనుమతి కోరగా, ధర్మరాజు ప్రేమతో తిరస్కరిస్తూ వచ్చాడు. ఇంకొన్ని రోజులు తమ వద్ద ఉండి తమకు సంతోషం కలిగించమని వేడుకున్నాడు. భగవద్గీత అనే కృష్ణార్జున సంవాదము

మహాభారతము భీష్మపర్వములో ఉంది. ఆతరువాత జరిగిన అనుగీత అనే మహత్తరమైన మరొక కృష్ణార్జున సంవాదము అశ్వమేథపర్వములో ఉంది. .

అర్జునుని మనుమడు, పరీక్షిత్తు మహారాజు కుమారుడు అయిన జనమేజయుడు తన తండ్రిని చంపిన తక్షకుడు అనే సర్పరాజు మీదా, ఇతర సర్పముల మీదా పగ తీర్చుకోడానికి సర్పయాగం చేసాడు. ఆ యాగము పూర్తి కాకుండానే ఆస్తీకుడు అనే ముని బాలకుని కారణంగా ఆగి పోయింది. ఆ సందర్భంలో జనమేజయుడు, ఇతర మునుల కోరిక మేరకు, వ్యాసుల వారి శిష్యుడు అయిన వైశంపాయనుడు, వ్యాసుల వారు రచించిన జయ అనే కావ్యమును విపులీకరించి భారతము అనే ఇతిహాసము పేరిట, జనమేజయునికి, సర్పయాగమునకు విచ్చేసిన ఇతర సదస్యులకు చెప్పనారంభించాడు. ఇంక చదవండి

జనమేజయుడు వైశంపాయన మహర్షిని ఇలా అడిగాడు. "మహాత్మా! మహాభారత యుద్ధం ముగిసిన తరువాత, శ్రీకృష్ణుడు, అర్జునుడు హస్తినాపురం చేరుకున్నారు కదా! తరువాత ధర్మరాజుకు పట్టాభిషేకం జరిగింది అని చెప్పారు. తరువాత ఏం జరిగింది? విపులంగా చెప్పండి!" అని అడిగాడు. దానికి వైశంపాయనుడు ఇలా చెప్పసాగాడు.

"ఓ జనమేజయ మహారాజా! అర్జునుడు చాలా తీరికగా ఉన్నాడు. అన్నగారు ధర్మజుడు రాజ్యం చేస్తున్నాడు. భీముడు అన్నగారికి సాయం చేస్తున్నాడు. ధర్మజుడు అజాత శత్రువు. ఆయనకు శత్రువులు అంటూ ఎవరూ లేరు. అందువలన అర్జునుడికి చేయవలసిన పనేం లేదు. అందుకని బావ శ్రీకృష్ణుల వారితో హస్తినాపుర రాజసౌధంలో సకల భోగాలు అనుభవిస్తూ కాలం గడుపుతున్నాడు.

ఒక రోజు కృష్ణార్జునులు రాజసౌధంలో ఉన్న ఉద్యాన వనములో విహరిస్తున్నారు. ఆ ఉద్యాన వనము స్వర్గమును తలపిస్తూ ఉంది. చుట్టు పరిచారికలు సేవలు చేస్తున్నారు. అక్కడ ఉన్న వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. కృష్ణార్జునుల మనసులు ఆనందంతో నిండిపోయాయి. ఆ సమయంలో అర్జునుడు తన బావ కృష్ణునితో ఇలా అన్నాడు.

"బావా శ్రీకృష్ణా! నీ సహాయ సహకారముల వలననే నేను మహాభారత యుద్ధం గెలిచి విజయాన్ని సాధించగలిగాను. నీ వలననే అది నాకు సాధ్యం అయింది. ఇదంతా నీ గొప్పదనమే కాని నాది కాదు. కాని యుద్ధం జరగక ముందు నేను విషాదంలో మునిగి ఉన్నప్పుడు, నీకు నా మీద ఉన్న ప్రేమ వాత్సల్యముల చేత, నా మేలుకోరి, నీవు నాకు కర్తవ్య బోధ చేసావు. నేను విన్నాను. ఆచరించాను. యుద్ధంలో విజయం సాధించాను. కాని కృష్ణా! నాకు ఉన్న మనోచాచంల్యం వలన, కార్యభారం అధికం కావడం చేతా, నీవు చెప్పినదంతా నేను మరిచిపోయాను. నీవు ద్వారకకు

పోయే సన్నాహాలలో ఉన్నావు.మరలా మనం ఎప్పుడు కలుస్తామో ఏమిటో! యుద్ధసమయంలో నీవు నాకు చేసిన బోధ మరలా మరలా వినాలని కుతూహలంగా ఉంది. అందుకని, దానిని అంతా మరలా ఒక సారి చెప్పవా!" అని అడిగాడు.

ఆ మాటలు విన్న కృష్ణుడు అదిరి పడ్డాడు. అర్జునుడి మాటలకు నివ్వెరపోయాడు. అంతలోనే తేరుకున్నాడు. అర్జునుడిని వాత్సల్యపూరితంగా కౌగలించుకున్నాడు. వీపు తట్టాడు.

"అర్జునా! నీకు మరీ శ్రద్ధలేకుండా పోయిందయ్యా! చెప్పింది అలా మరిచిపోతే ఎలాగా! నేను ఆ రోజు ఆ సందర్భంలో చెప్పిన మాటలు పరమ పదాన్ని చేరుకోడానికి ఉపకరించే వాక్యాలు. వాటిని నీవు మనసులో నిలుపుకోలేక పోయావు. నేను చెప్పిన వాటి మీద నీకు శ్రద్ధ, నమ్మకం ఉన్నట్టు లేదు. అందుకే చెప్పినది అంతా మరిచిపోయావు. ఆ వాక్యాలను నేను మరలా గుర్తు తెచ్చుకొని నీకు చెప్పాలంటే సాధ్యంకాదు. ఆ రోజు నేను నీకు ఆ సందర్భానికి కావాల్సిన దాని కంటే ఎక్కువే చెప్పాను. పరబ్రహ్మమును గురించి తెలుసుకోడానికి నేను చెప్పిన వాక్యాలు చాలును. అవన్నీ మరలా చెప్పడం నాకు సాధ్యం కాదు. ఎందుకంటే ఆరోజు నేను నీకు చెప్పినది అంతా నేను యోగసాధనలో ఉండి చెప్పిన వాక్యాలు. ఆ యోగ సాధన ఇప్పుడు సాధ్యంకాదు. కాకపోతే నేను ఒక పాత కథ ఒకటి చెబుతాను. నేను ఇప్పుడు చెప్పబోయేది శ్రద్ధగా విని పరమ పదాన్ని చేరుకోడానికి ప్రయత్నించు.

ఒకసారి నావద్దకు ఒక బ్రాహ్మణోత్తముడు వచ్చాడు. ఆయనకు అతిథి సత్కారాలు చేసాను. "బ్రాహ్మణోత్తమా! నాకు తత్త్వజ్ఞానమును బోధించండి" అని అడిగాను. అప్పుడు ఆ బ్రాహ్మణుడు నాతో ఇలా అన్నాడు.

"కృష్ణా! మనలో ఉన్న అజ్ఞానాన్ని తొలగించి, మోక్షమును ప్రసాదించే మార్గమును గురించి అడిగావు. దాని గురించి నేను చెబుతాను ఏకాగ్రమైన మనసుతో శ్రద్ధగా విను.

ఒక సారి నాకు కాశ్యపుడు అనే బ్రాహ్మణోత్తముడు తారస పడ్డాడు. ఆ కాశ్యపునకు ఒక సిద్ధుడు జ్ఞాన బోధ చేసాడట. ఆ సిద్ధుడు తన ఇంద్రియములను, మనసును జయించిన వాడు. మంచి జ్ఞాని. ఆయన ఒక సన్యాసి. మహా యోగి. యోగవిద్యలను బాగా తెలిసిన వాడు. ప్రాపంచిక విషయములను గూర్చి బాగా తెలిసినవాడు. కష్టసుఖముల గూర్చి, జనన మరణముల గురించిన అసలు రహస్యము తెలిసిన వాడు. ప్రవృత్తిమార్గమును వదిలి నివృత్తి మార్గములో పయనిస్తున్న జ్ఞాని. ఆ సిద్ధుడు, ప్రత్యక్షం కావడం, అంతర్ధానం కావడం, మొదలగు విద్యలు తెలిసినవాడు. ఆ సిద్ధుడు ఎల్లప్పుడూ తాను సూక్ష్మశరీరము ధరించి, సూక్ష్మశరీరంతో తిరిగే సిద్ధుల సాంగత్యములో తిరుగుతుంటాడు. ఆ సిద్ధుడు మహాజ్ఞాని అవడం వలన తామరాకు మీద నీటి

బొట్టు మాదిరి దేనికీ అంటుకోకుండా సంచరిస్తుంటాడు. అటువంటి సిద్ధుని చూచి ఆ సిద్ధుని లోని మానవాతీత శక్తులను ప్రత్యక్షంగా దర్శించి ఆశ్చర్యచకితుడు అయ్యాడు. కాశ్యపుడు ఆయనకు సాష్టాంగ నమస్కారం చేసాడు. ఆ సిద్ధుని పక్కన చేతులు కట్టుకొని నిలబడి ఆయన అనుగ్రహం కోసం ఎదురు చూస్తున్నాడు. ఆ సిద్ధుడు ఒక రోజు కాశ్యపునికి ప్రసన్నుడై, సిద్ధుడు కాశ్యపునకు బోధించిన విష యాలను, కాశ్యపుడు నాకు చెప్పాడు. ఆ విషయాలను నేను నీకు చెబుతాను శ్రద్ధగా విను. ఈ విషయాలు అన్నీ సిద్ధుడు కాశ్యపునకు చెప్పిన విధంగానే చెబుతాను" అని ఆ బ్రాహ్మణుడు ఇలా చెప్పసాగాడు.

సిద్ధుడు కాశ్యపుని చూచి "కాశ్యపా! మానవులు తాము చేసిన వివిధములైన కర్మల ఫలితముగా స్వర్గలోకములో లభించే సుఖములను, నరక లోకములో లభించే దు:ఖములను, మర్త్య లోకములో లభించే సుఖదు:ఖముల సమ్మేళణములను పొందుతున్నారు. స్వర్గలోకమునకు పోయిన వారు శాశ్వతంగా అక్కడ ఉండటం లేదు. పుణ్యం అయిపోగానే మరలా కామ,క్రోధ,లోభపూరితమైన మర్త్యలోకమునకు వస్తున్నారు. మరలా జన్మ ఎత్తుతున్నారు. జనన మరణ చక్రంలో తిరుగుతున్నారు.

నేను కూడా పాపకార్యాలు చేయడం వలన జనన మరణ చక్రంలో పడిపోయాను. ఎన్నో జన్మలు ఎత్తాను. నానావిధములైన ఆహారములను రుచిచూసాను. ఎందరో తల్లుల చనుబాలు తాగాను. ఈ జన్మలలో నాకు నానావిధములైన, ఒకరితో ఒకరికి పోలిక లేని, తల్లులు, తండ్రులు లభించారు. వారి ఆలనా పాలనలో పెరిగాను. ఈ జన్మలలో ఎన్నో మంచి కార్యాలు చేసాను. అలాగే ఎన్నో చేయకూడని పనులు చేసాను. వాటి ఫలితంగా, నానావిధములైన సుఖములను, దు:ఖములను అనుభవించాను. ఎంతో కష్టపడి ఎంతో ధనం సంపాదించాను. ఆ ధనం ఎలా వచ్చిందో అలాగే పోయింది. చివరికి బికారిగా మిగిలాను. శారీరకంగా, మానసికంగా ఎన్నో బాధలు అనుభవించాను. సన్మానాలు పొందాను. అలాగే ఎన్నో అవమానాలు భరించాను. చాలా సార్లు నరకానికి వెళ్లాను. అక్కడ యమభటులు పెట్టే బాధలు అన్నీ అనుభవించాను. ఈ మానవ లోకంలో కూడా సుఖదు:ఖాలు, లాభ నష్టాలు, జయాపజయాలు మొదలగు ద్వంద్వాల వలన కలిగే అన్ని రకములైన అనుభవాలు రుచి చూపాను.

ఇది ఇలా ఉండగా ఒక రోజు నాకు అపరిమితమైన దు:ఖం కలిగి, ఆ దు:ఖం లో నుండి ఒక విధమైన నిర్వేదం పుట్టింది. ఆ నిర్వేదంలో జ్ఞానోదయం అయింది. నిరాకారుడు, నిర్గుణుడు అయిన పరమాత్మను శరణుజొచ్చాను. ఈ బాహ్యప్రపంచంలో లభించే సుఖదు:ఖాలకు స్పందించడం మానుకున్నాను. అన్నిటినీ సమంగా చూడటం అలవాటు చేసుకున్నాను. తామరాకు మీద నీటిబొట్టులాగా దేనికీ అంటుకోకుండా, ఈ ప్రపంచంలో సంచరించడం మొదలుపెట్టాను. ఇప్పుడు నా మనస్సు ప్రశాంతంగా ఉంది. అదే ఇప్పుడు నీవు చూస్తున్న స్థితి. ఈ సారి మరణిస్తే

మరలా పుట్టాలని అనుకోవడం లేదు. అందుకని ఆ జనన మరణములు లేని స్థితి కొరకు నిరంతర సాధన చేస్తున్నాను. ఆ స్థితి చేరుకునేవరకు నేను ఈ లోకంలో కేవలం సాక్షీభూతంగా సంచరిస్తుంటాను. దేనికీ వశుడను కాను. నాకు ఎల్లప్పుడూ మంచే జరుగుతుంటుంది. నేను ఊర్ధ్వలోకాలను పొందుతాను. చివరకు ఆ పరమాత్మలో ఐక్యం అవుతాను. అదే నా చరమ లక్ష్యం. ఈ విషయంలో నాకు ఎటువంటి సందేహము లేదు. మరలా ఈ లోకంలో జన్మించే పరిస్థితే లేదు.

నా గురించి నీకు అన్ని విషయాలు చెప్పాను. నీవు నా దగ్గరకు ఎందుకు వచ్చావో, నా వలన నీ ఏమి కావాలో నాకు తెలుసు. నేను త్వరలో ఈ లోకాన్ని విడిచిపెట్టబోతున్నాను. నీ నడత, ప్రవర్తన నాకు ఎంతగానో నచ్చాయి. నీకు ఏం కావాలో, నానుంచి నీవు ఏమేమి తెలుసుకోదలచుకున్నావో అన్నీ అడుగు. నేను నాకు తెలిసిన అన్ని విషయాలు నీకు బోధిస్తాను. నీకు అపారమైన తెలివితేటలు, గ్రహణ శక్తి ఉన్నాయి. నేను చెప్పిన విషయాలను ఇట్టే గ్రహించగలవు. నీవు ఏం తెలుసుకోదలచుకున్నావో అవన్నీ అడుగు" అని పలికాడు ఆ సిద్ధుడు.

ఆ సిద్ధుని మాటలకు పరమానంద భరితుడైన కాశ్యపుడు, ఆ సిద్ధుని చాలా కఠినమైన, జవాబు చెప్పడానికి వీలుకాని ప్రశ్నలు  అడిగాడు. వారిద్దరి మధ్య సంవాదము ఇలా జరిగింది అని ఆ బ్రాహ్మణుడు శ్రీకృష్ణుడితో, సిద్ధునికి, కాశ్యపునికి జరిగిన సంవాదమును ఈ విధంగా చెప్పాడు.

కాశ్యపుడు సిద్ధునితో ఇలా అన్నాడు. "మహాత్మా! ఈ శరీరం ఎలా మరణిస్తుంది? మరొక శరీరం ఎలా ధరిస్తుంది? జీవుడు ఈ జనన మరణ చక్రము నుండి ఏ విధంగా విడివడి, ముక్తిని పొందుతాడు? ఏదో ఒక శరీరం ధరించి ఈ ప్రకృతిలో జీవిస్తూ, అనుభవిస్తున్న జీవుడు, ఆ ప్రకృతి తనకు ఇచ్చిన శరీరం నుండి జీవుడు ఎలా విడివడతాడు? ఈ శరీరం నుండి విడివడిన జీవుడు, ఈ శరీరము కంటే, ప్రకృతి కంటే భిన్నమైన పరమాత్మను ఎలా పొందుతాడు? జీవుడు తాను ఈ ప్రాకృతిక శరీరం లో ఉన్నప్పుడు చేసిన కర్మల ఫలములను ఏ విధంగా అనుభవిస్తాడు? ఈ శరీరం వదిలిపెట్టిన తరువాత ఆ శరీరంలో చేసిన కర్మఫలములు జీవుని వెంట వస్తాయా?" అని కాశ్యపుడు గుక్కతిప్పుకోకుండా ప్రశ్న వెంట ప్రశ్నను సంధించాడు. ఆ ప్రశ్నల కన్నింటికీ సిద్ధుడు ఒకటి వెంట సమాధానాలు ఇచ్చాడు.

"కాశ్యపా! మానవుడు తన జీవితం సుఖంగా గడపడానికి అనువైన మార్గాలను, తాను కలకాలం జీవించడానికి ఉపయోగపడే మార్గాలను వదిలిపెట్టి, తనకు అకాల మరణం సంభవించే మార్గాలను, తన ఆరోగ్యం నాశనం అయ్యేమార్గాలను అవలంబిస్తుంటాడు. అటువంటి సమయాలలో అతడి వివేచనా శక్తి నశిస్తుంది. ఏది తినాలి ఏది తినకూడదు, ఏది తాగాలి ఏది తాగకూడదు, ఏ వేళకు తినాలి. ఎప్పుడు తినకూడదు అనే నియమాలను గాలికి వదిలేస్తాడు. ఇష్టం వచ్చినప్పుడు, ఇష్టం వచ్చిన దానిని, ఇష్టం వచ్చిన చోట అతిగా తినడం, తాగడం చేస్తాడు.

ఆహార,నిద్ర,మైథున నియమాలను పాటించడు. విచ్చలవిడిగా సంచరిస్తుంటాడు.

తన శరీరానికి ఏవేవి హానికరమో వాటినే చేస్తుంటాడు. ఒక్కోసారి అతిగా తింటాడు. ఒక్కోసారి కఠినమైన ఉపవాసాలు ఉంటాడు. శరీరం అరిగించుకోలేని మాంసాహారాలను, మత్తుపదార్థాలను అతిగా సేవిస్తాడు. అంతకు ముందు తిన్న ఆహారం జీర్ణం కాకముందే, మరలా ఆహారం తింటాడు. సగం జీర్ణమైన ఆహారంతో, జీర్ణం కావాల్సిన ఆహారం కలిసిపోయి, రోగకారకమౌతుందని గ్రహించలేడు. అధికమైన, తన శక్తికి మించిన, శారీరక శ్రమ చేస్తాడు. తన శక్తికి మించి మైథున సుఖం అనుభవిస్తాడు. తన శక్తికి మించి శారీరక కష్టం చేసేటప్పుడు, మైథున సుఖాలను అనుభవించేటప్పుడు, విపరీతంగా ఆయాసపడుతుంటాడు. కొంత మంది రాత్రిళ్లు విపరీతంగా మేల్కొని పగలంతా నిద్రపోతుంటారు.

ఈ విధంగా అధిక శ్రమ చేయడం, అధికంగా తినడం, తినకూడనివి తినడం, తాగడం వలన, విచ్చలవిడి మైథున క్రియల వలన, శరీరం అదుపు తప్పుతుంది. దాని వలన రోగాలు సంభవిస్తాయి. ఆ రోగాలు ప్రాణాంత వ్యాధులుగా పరిణమిస్తాయి. ఈ విధంగా చేయడం వలన మనస్సు కూడా అదుపు తప్పి, ఆత్మహత్యలకు కూడా దారితీస్తుంది. ఈ కారణాల వలన ప్రకృతి సిద్ధంగా లభించిన ఈ శరీరం అకాల మరణం చెందుతుంది. జీవాత్మ శిథిలమైన ఈ శరీరాన్ని వదిలిపెట్టి వెళ్లిపోతుంది. ఈ విధంగా మానవుడు తన జీవిత కాలంలో తన ఇష్టం వచ్చినట్టు తినడం, తాగడం, మైథున క్రియ జరపడం, నిద్రించే సమయంలో మేల్కొనడం చేయడం వలన ఇటు ఈ లోకంలో కానీ, అటు పరలోకంలో కానీ శాశ్వతమైన సుఖ శాంతులను పొందలేకపోతున్నాడు. రెండింటికి చెడ్డ రేవడ లాగా తయారవుతున్నాడు. ఈ జనన మరణ చక్రంలో నిరంతరం తిరుగుతున్నాడు. ఈ విషయంలో నేను కూడా ఏమీ తక్కువ కాదు. ఎన్నోజన్మలు ఎత్తాను. ఎందరో తల్లుల చనుబాలు తాగాను. ఎన్నోపాపాలు చేసాను. ఆ పాపాలకు తగిన శిక్షలు అనుభవించాను. తుదకు ఈ స్థితికి చేరుకున్నాను.

కాశ్యపా! ఇంక అసలు విషయానికి వస్తాను. మానవ శరీరంలో వాయువులు, ఉష్ణము ఉన్నాయి. మరణ సమయంలో అవి అన్నీ ప్రకోపిస్తాయి. శరీరం అంతా వ్యాపిస్తాయి. శరీరాన్ని అతలాకుతలం చేస్తాయి. అంతులేని బాధ కలుగుతుంది. దానినే మరణ యాతన అని అంటారు. ఆ మరణ బాధలకు తట్టుకోలేక జీవుడు ఈ శరీరాన్ని విడిచిపెట్టి వెళ్లుతాడు. దీనినే మరణము అని అంటారు. ఈ మరణము కొందరికి అనాయాసంగా వస్తుంది. మరి కొందరికి అత్యధిక బాధాకరంగా ఉంటుంది. శరీరంలో ఉన్న పంచ ప్రాణాలు ఒకటొకటిగా దేహాన్ని విడిచిపెట్టి పోతూ ఉంటే పడే బాధ వర్ణనాతీతము. ఊపిరి ఆడదు. ఊపిరి తీసుకోవడానికి ఎంతో అవస్థపడుతుంటాడు. ఎగశ్వాసతో బాధపడుతుంటాడు. శరీరంలో ఉష్ణం తగ్గిపోతూ ఉంటుంది. చివరకు జీవుడు ఈ

శరీరాన్ని వదిలిపెట్టగానే, శరీరం మరణిస్తుంది. మరణం తరువాత శరీరంలో అన్ని అవయవాలు ఉన్నా అవి బాహ్యప్రపంచంలో ఉన్న విషయాలను గ్రహించలేవు. ఆ శరీరం దహన యోగ్యం అవుతుంది.

ఇదే మరణయాతన జీవుడు మరొక జన్మ ఎత్తినపుడు కూడా అనుభవిస్తాడు. దానినే గర్భంలో ఉండగా అనుభవిస్తాడు. తల్లి గర్భంలో ఉన్న ఉమ్మనీటిలో పడి ఊపిరి ఆడకుండా కొట్టుకుంటుంటాడు. ప్రాణ అపాన వ్యాన ఉదాన సమాన ప్రాణాలు కూడా గర్భస్థశిశువులో ప్రవేశించేటప్పుడు కూడా విపరీతమైన బాధను అనుభవిస్తాడు. తల్లి గర్భంలో నుండి బయటకు వచ్చేటప్పుడు కూడా అనుభవిస్తాడు. కాబట్టి మరణంలో మాదిరి జననంలో  కూడా ఈ యాతన తప్పదు.

జీవుడు ఈ శరీరంలో ఉన్నప్పుడు, ఆహారం తీసుకుంటూ ఆ ఆహారాన్ని జీర్ణంచేసి, ఆ శక్తిని శరీరంలో ఉన్న అన్నిభాగాలకు సమానంగా పంచిపెడుతుంటాడు. ఈ శరీరంలో ఉన్న అన్ని అవయవాలు కలిసి పనిచేసినపుడే శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. ఈ విషయాలన్నీ మన శాస్త్రములలో చెప్పబడ్డాయి.

(ఈ సందర్భంలో ప్రఖ్యాత వ్యాఖ్యాన కారులు ఈ విధంగా నిర్వచించారు. వాటిని కూడా మనం వివరంగా తెలుసుకుందాము. కాశ్యపుడు సిద్ధుడిని అడిగిన ప్రశ్నలు ఏడు. అవి ఏవంటే...1.ఈ భౌతిక శరీరానికి మరణం ఎలా సంభవిస్తుంది. 2. మరణించిన తరువాత మరొక దేహాన్ని ఎలా పొందుతుంది. 3.ఆ విధంగా మరలా పుట్టకుండా నివారించవచ్చునా? 4.జీవుడు మరలా పుట్టడానికి, మరొక దేహం ధరించడానికి కారణాలు ఏమిటి? 5.ముక్తి అంటే ఏమిటి? మరలా జన్మలేకపోతే జీవుడు ఎక్కడకు వెళతాడు? పరమాత్మలో ఐక్యం కావడం అంటే ఏమిటి? 6.జీవుడు తాను దేహంలో ఉన్నప్పుడు చేసిన కర్మఫలములను ఎలా అనుభవిస్తాడు? 7.జీవుడు దేహం వదిలిన తరువాత కూడా కర్మఫలములు జీవుని వెంట వస్తాయా?. ఈ ప్రశ్నలకు సమాధానాలే ఈ అనుగీత.

ఈ విషయములన్నీ శాస్త్రములలో చెప్పబడ్డాయి అని అన్నారు. ఆ శాస్త్రములు ఏమిటి అంటే ప్రఖ్యాత వ్యాఖ్యాన కారులు చరకుని ఆయుర్వేద శాస్త్రము గురించి చెప్పారు. కాలమును రెండు విధములుగా నిర్వచించారు. ఒకటి భూమి తన చుట్టు తాను తిరుగుతూ, సూర్యుని చుట్టు తిరగడం వలన పట్టే సమయాన్ని నిమిషములు, గంటలు, రోజులు, మాసములు, సంవత్సరములుగా విభజించి నిర్ణయించినది. అదే విధంగా ఒక ప్రాణి పుట్టినది మొదలు మరణించే దాకా పట్టే సమయం. దీనిని కూడా కాలము అని అంటారు. ఇంక ఆహారము అంటే ఏ కాలమునకు తగ్గట్టు ఆయా కాలములలో తన శరీర తత్వానికి అనుగుణంగా తీసుకునే ఘన ద్రవ పదార్థములను ఆహారము అని అంటారు.

ప్రతి మానవుని శరీరంలో మూడు దోషములు ఉంటాయి. వాటిని వాత,పిత్త,కఫములు అని అంటారు. ఈ మూడు సరి సమానంగా తగు విధంగా ఉంటే శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. వాటిని తగు పాళ్లలో ఉంచుకోవలసిన బాధ్యత ప్రతి మానవునికీ ఉంటుంది. వీటిలో ఏ ఒకటి కానీ రెండు కానీ ప్రకోపిస్తే, అప్పుడు శరీరం అనారోగ్యం పాలవుతుంది. వాటిని మరలా తగుపాళ్లలోకి తీసుకురావడమే ఆయుర్వేద వైద్యము. శరీరంలో వాతం ప్రకోపించినపుడు, అది శరీరం అంతా విపరీతంగా వ్యాపిస్తుంది. శరీర అవయవాలను నిస్తేజపరుస్తుంది. దానినే పక్షవాతము అని అంటారు. అది మెదడు, గుండె, కాళ్లు చేతులు నోటికి మొదలైన ముఖ్యఅవయవాలను నిస్తేజపరుస్తుంది. అలాగే కఫము ప్రకోపించినపుడు కఫము గొంతుకు అడ్డుపడుతుంది. ఊపిరి ఆడదు. ఎగశ్వాస వస్తుంది. ఇంత బాధను భరిస్తూ ఈ శరీరంలో ఉండలేక జీవుడు ఈ శరీరాన్ని వదిలిపెట్టి వెళ్లిపోతాడు. దీనినే మరణము అని అంటారు.

మన దేహంలో ఐదు వాయువులు ఉన్నాయి. వాటినే ప్రాణ వాయువు, అపాన వాయువు, వ్యాన, ఉదాన, సమాన వాయువులు అని పిలుస్తారు. ఈ శరీరం నుండి జీవుడు వెళ్లిపోయేటప్పుడు ఈ ప్రాణ వాయువు నోటి నుండా గానీ, ముక్కుగుండా కానీ వెళ్లి పోతుంది. అపాన వాయువు విసర్జకావయవము గుండా ఒక్కసారిగా బయటకు వెళ్తుంది. దీనినే ఊపిరి ఆడక పోవడం, ఎగశ్వాస రావడం అని అంటుంటారు. అప్పుడు శరీరానికి ప్రాణవాయువు అందదు. దానితో శరీర ఉష్ణోగ్రత తగ్గిపోతుంది. శరీరం చల్లపడుతుంది. శరీరానికి సహజమైన తేజస్సు తగ్గిపోతుంది. శరీరం నిర్జీవం అవుతుంది. జీవుడు శరీరంలో నుండి బయటకు వెళ్లిపోగానే, శరీరం పడిపోతుంది. అదే మరణావస్థ.

శరీరానికి మరణం సంభవించిన తరువాత, శరీరంలో కళ్లు, ముక్కు, చెవులు, నోరు, కాళ్లుచేతులు మొదలగు అన్ని అవయవాలు ఉన్నా, అవి పనిచేయవు. వాటి వాటి విధులు నిర్వర్తించలేవు. ఎందుకంటే వాటికి చైతన్యశక్తి లోపల నుండి అందడం లేదు. ఈ శరీరంలో జీవుడు ఉన్నంత కాలమే అవి పని చేస్తాయి. శరీర అవయవాలు పనిచేయాలంటే వాటికి గాలి, నీరు, ఆహారము కావాలి. అవి నోరు, ముక్కు ద్వారా లోపలకు తీసుకుంటాడు జీవుడు. వాటి ద్వారా శరీర పోషణ జరుగుతుంది. శరీరంలో ఉన్న అన్ని అవయవాలు కలిసి ఉన్నంత వరకు శరీరం సమర్థవంతంగా పనిచేస్తుంది. మరణానంతరము జీవుడు ఈ శరీరం నుండి బయటకు వెళ్లేటప్పుడు ఈ శరీరంలో ఉన్నప్పుడు చేసిన కర్మల యొక్క వాసనలను, తాను చేసిన పుణ్యకార్యముల యొక్క, పాపకార్యముల యొక్క ఫలములను తన వెంట తీసుకొని వెళతాడు.

ఈ విషయం తెలుసుకోవాలంటే శాస్త్ర పరిజ్ఞానం కావాలి. అప్పుడు తాను జీవిత కాలంలో పుణ్యకార్యాలు చేస్తున్నానా, లేక పాప కార్యాలు చేస్తున్నానా, చేయతగిన పనులు చేస్తున్నానా

లేక చేయకూడని పనులు చేస్తున్నానా అని తెలుసుకునే విచక్షణా శక్తిని కలిగి ఉంటాడు. మానవుడు ఎలాగైతే తన కళ్లతో, కటిక చీకటిలో మిణుగురు పురుగు ప్రకాశంతంగా కనిపించడం, మరలా ఆరిపోవడం, మరలా కనిపించడం, ఎలా చూస్తుంటాడో, అలాగే శాస్త్ర పరిజ్ఞానం కలిగిన జ్ఞాని, తన జ్ఞాన నేత్రంతో, ఈ శరీరానికి సంభవించే జనన మరణాలు మిణుగురు పురుగు మాదిరి వెలుగుతూ ఆరిపోతుంటాయి, వస్తూ పోతుంటాయి, అని భావిస్తాడు.

జీవుడు మానవునిగా జన్మించి ఎన్నోకర్మలు చేస్తుంటాడు. కాబట్టి మానవ జన్మలో కానీ, ఇతర జన్మలలో కానీ కర్మలు చేయడం ఆ ఫలాలు అనుభవించడం దీనికే పరిమితం అయింది. కాకపోతే మానవుడికి తన ఇష్టం వచ్చిన కర్మలు చేయడంలో స్వేచ్ఛ ఉంటుంది. ఇతర జాతులకు తమ తమ స్వాభావిక కర్మలు చేయడానికి మాత్రమే స్వేచ్ఛ ఉంటుంది. జీవులు తాను చేసిన మంచి కర్మలకు, చెడు కర్మలకు లభించే ఫలితములను తప్పకుండా అనుభవించాలి. అది ఈ జన్మలో కావచ్చు మరుజన్మలో కావచ్చు. కాని ఫలితం అనుభవించడం అనివార్యం. అందుకే ఈ భూమిని కర్మభూమి అని అన్నారు. మంచి కర్మలు చేస్తే స్వర్గసుఖాలు లభిస్తాయి. చెడు కర్మలు చేస్తే నరకలోక అనుభవం లభిస్తుంది. ఈ నరకంలో సూక్ష్మశరీరాలను తలకిందులుగా వేలాడదీసి, చిత్రహింసలు పెడతారు. దానిని మించిన బాధ మరొకటి ఉండదు. ఈ నరక బాధల నుండి తప్పించుకోవడం చాలా కష్టం. అందుకని ప్రతిజీవి మంచి కర్మలు చేసి ఈ నరక బాధలనుండి తప్పించుకునే ప్రయత్నం చేయాలి.

జీవులు ఈ దేహాన్ని వదిలిపెట్టిన తరువాత ఏయే లోకాలకు వెళతారో నీకు సమగ్రంగా వివరిస్తాను. వాటిని నీవు శ్రద్ధగా విను. అప్పుడు నీవు ఈ కర్మల గురించి, వాటి ఫలితముల గురించి, సరి అయిన అవగాహన కలుగుతుంది. ధర్మం తప్పకుండా, నీతి నిజాయితీగా జీవించే వ్యక్తులు చంద్ర మండలం, సూర్య మండలం, నక్షత్రమండలాలకు వెళతారు. కాని ఆ లోకాలలో కూడా మానవలోకంలో మాదిరి హెచ్చు తగ్గుల తారతమ్యాలు ఉండటం వలన ఆ లోకాలు కూడా అంత పొంద తగినవి కావు అని శాస్త్రములు చెబుతున్నాయి. ఎందుకంటే స్వర్గలోకం కూడా శాశ్వతం కాదు. స్వర్గలోకంలో కూడా ఈర్ష్య ద్వేషాలు, చిన్న పెద్ద మధ్య అనే తారతమ్యాలు, కామక్రోధము మొదలగు గుణాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ స్వర్గ సుఖాలు చాలవు, ఇంకా ఇంకా స్వర్గసుఖాలు అనుభవించాలి అనే అసంతృప్తి జీవులను వెంటాడుతూ ఉంటుంది. (అమెరాకాకు, పారిస్ కు వెళ్లడం, అక్కడ అంతులేని ధనం, ఆస్తులు సంపాదించడం, అంతులేని సుఖాలు అనుభవించడమే స్వర్గం లోకం అనుకుంటే, అక్కడి వారు కూడా ఉన్నది చాలదనీ, ఇంకా తమకు ఏవేవో కావాలని అసంతృప్తితో ఉండటం మనం గమనిస్తున్నాము.) ఈ విధంగా, జీవులు తాము ఆర్జించిన పుణ్యఫలం అయిపోగానే, తిరిగి మానవలోకంలో జన్మించాలి. (క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి. భ.గీ.) కాబట్టి ప్రతి ఒక్కడూ శాశ్వత ఆనందాన్ని ఇచ్చే పరమపదం గురించి ప్రయత్నం చేయాలి. అని చెప్పిన

తరువాత సిద్ధుడు కాశ్యపునితో ఇంకా ఇలా అన్నాడు.

"ఓ కాశ్యపా! ఇప్పుడు నీకు జీవుడు తల్లి గర్భంలోకి ఎలా ప్రవేశిస్తాడు, అక్కడ ఎలా ఉంటాడు అనే విషయాన్ని వివరిస్తాను. సావధానంగా విను. పుట్టిన ప్రతి జీవీ కర్మలు చేయక తప్పదు. ఏదో ఒక కర్మ చేయకుండా ఏ జీవీ మనుగడ సాగించలేదు. చేసిన ప్రతి కర్మకు ఏదో ఒక ఫలితం ఉంటుంది. అది మంచి ఫలితం కావచ్చు. చెడు ఫలితం కావచ్చు. ఆ ఫలితం వలన పుణ్యం కానీ పాపం కానీ వస్తుంది. ఆ పుణ్యపాపాలను ప్రతి జీవి ఈ జన్మలో కానీ మరు జన్మలో కానీ అనుభవించక తప్పదు. జీవుడు చేసిన పాపాలు వాడి వెంటనే ఉంటాయి. ఎక్కడికీ పోవు. పుణ్యం చేస్తే పాపాలు నశిస్తాయి అనడం తప్పు. పుణ్యం పాపం దేనికదే అనుభవించాలి. జీవుడు జన్మ వెంట జన్మ ఎత్తుతూ, కర్మలు చేస్తూ, వాటికి పుణ్య పాపాలు ఆర్జిస్తూ, అది వరకు చేసిన పుణ్య పాపాలు అనుభవిస్తుంటాడు. ఇది జీవిత చక్రం.

మంచి మధురమైన ఫలాలను ఇచ్చే చెట్టు పుష్పించి, కాయలు కాసి, చక్కని ఫలాలను ఇస్తుంది. అలాగే సత్పురుషుడు కూడా తన జీవిత కాలంలో మంచి కర్మలు చేసి వాటికి తగిన పుణ్యఫలములను పొందుతుంటాడు. అలాగు పాపాత్ముడు కూడా తన జీవిత కాలంలో ఎన్నో దుర్మార్గాలు, పాపకృత్యాలు చేసి, అమితమైన దు:ఖమును పొందుతుంటారు. అంతులేని బాధలు అనుభవిస్తుంటాడు. ఏ జీవికైనా, కర్మ చేయడానికి ముందు మనసులో సంకల్పించాలి. మనసులో మొలకెత్తిన సంకల్పం, బాహ్య ఇంద్రియములతో కలిసి కార్యరూపం దాలుస్తుంది. తన జీవిత కాలంలో ఆర్జించిన పుణ్య, పాప ఫలములను తన వెంట తీసుకొని, ఆ పుణ్య, పాపఫలములను అనుభవించడానికి ఒక దేహం కావాలి కాబట్టి, ఆ దేహం పొందడానికిగాను, జీవుడు మరొక తల్లి గర్భంలో ప్రవేస్తాడు. అది ఎలాగంటే, పురుషుడి వీర్యంలో నుండి విడుదల అయిన బీజము, స్త్రీలో విడుదల అయిన శోణితముతో కలిసి, అండముగా మారుతుంది. ఆ అండములోనికి జీవుడు ప్రవేశిస్తాడు. ఆ సమయంలో జీవుడు అవ్యక్త రూపంలో ఉంటాడు కాబట్టి, అతని వెంట ఉన్న పాపపుణ్యాలు అతనికి అంటవు. ఆ జీవుడు పరబ్రహ్మస్వరూపంగా (ఆత్మస్వరూపంగా) అండంలో ప్రవేశిస్తాడు. దానినే ప్రాణశక్తి అని అంటారు. ప్రతి జీవికి కూడా జీవించడానికి ఈ ప్రాణశక్తే ఆధారము. రోజులు నెలలు గడిచేకొద్దీ ఆ అండం పిండంగా మారి, క్రమక్రమంగా అవయవాలను సంతరించుకుంటుంది. మనో బుద్ధి అహంకారాలు వాటంతట అవే ప్రవేశిస్తాయి. మనో బుద్ధి అహంకారాల ప్రోద్బలంతో శరీరం లోని అవయవాలు కదలడం మొదలుపెడతాయి.

ఎలాగైతే బాగా కరిగిన ఇనుము ఏ మూసలో పోస్తే ఆ ఆకృతి సంతరించుకుంటుందో, అలాగే జీవుడు కూడా ఏ దేహంలో ప్రవేశిస్తే, ఆ రూపం సంతరించుకుంటాడు. ఎలాగైతే అగ్నితో చేరిన ఇనుము, తాను కూడా అగ్ని మాదిరి ప్రకాశిస్తుందో, అలాగే జీవుడితో కూడిన పిండము కూడా చైతన్యవంతమౌతుంది. ఒక గదిలో ఉన్న దీపము ఆ గదిలో ఉన్న వస్తువులను ఎలా

ప్రకాశింపచేస్తుందో, అలాగే పిండములో చేరిన చైతన్యము, ఆ పిండమునకు ఏర్పడిన అవయవములను చైతన్యవంతం చేస్తుంది. ఆ పిండ ము శరీరంగా మారి ఈ ప్రపంచములోని వచ్చిన తరువాత, ఇంతకు ముందు జన్మలలో చేసిన పుణ్యపాపములను అనుభవించడం మొదలుపెడతాడు. అంతకు ముందుజన్మలలో చేసిన పుణ్య పాపాలు అనుభవిస్తూనే, కొత్త కొత్త కర్మలు చేస్తూ, వాటికి తగిన పుణ్యపాపములను మూటగట్టు కుంటూ ఉంటాడు. వాటిని అనుభవించడానికి మరోజన్మ ఎత్తుతాడు. ఈ విధంగా జన్మవెంట జన్మ ఎత్తుతుంటాడు. ఆ పాపపుణ్యములు పూర్తిగా నశించి పోతేగానీ, అతడికి మోక్షం లభించదు.

ఈ విధంగా జనన మరణ చక్రంలో తిరుగుతున్న జీవుడు ఈ క్రింది లక్షణాలు సంతరించుకుంటే, తిరిగి తిరిగి జన్మ వెంట జన్మ ఎత్తకుండా మోక్షం పొందే అవకాశం ఉంది. అవి ఏవంటే....

తనకు ఉన్నదాంట్లో ఇతరులకు దానం చేయడం,

ఏ పని చేసినా దానిని ఒక తపస్సులాగా నియమ నిష్ఠలతో చేయడం,

బ్రహ్మచర్యం అంటే ఎల్లప్పుడు ఆ పరమాత్మను తలుచుకుంటూ ఆయనకు పూర్తిగా తనను తాను అర్పించుకోవడం,

ఇంద్రియములను, మనస్సును నిగ్రహించడం,

మనసును ఎల్లప్పుడూ ప్రశాంతంగా ఉంచుకోవడం,

ఇతర ప్రాణుల యందు దయకలిగి ఉండటం,

కోరికలను, ప్రాపంచిక సుఖముల యందు వ్యామోహమును అదుపులో ఉంచుకోవడం,

ఇతరుల ఎడల క్రూరత్వమును విడిచిపెట్టడం,

ఇతరుల ధనమునకు ఆశించకపోవడం,

ఉన్నదానితో తృప్తిపడటం,

వ్యర్థమైన ఆలోచనలు చేయకపోవడం,

కనీసం మనసులో కూడా ఇతరులకు,

ఇతర ప్రాణులకు హాని తలపెట్టకపోవడం,

జన్మ ఇచ్చిన తల్లితండ్రులకు సేవచేయడం,

వారిని గౌరవించడం, అతిథులను సత్కరించడం, దేవతా మూర్తులను పూజించడం,

భగవంతుని యందు భక్తి కలిగి ఉండటం,

గురువుల యందు భక్తి, గౌరవము కలిగి ఉండటం,

దయ, శౌచము, ఇంద్రియనిగ్రహము కలిగి ఉండటం,

ఎల్లప్పుడూ మంచి పనులు చేయడం,

ఇతరులకు అపకారం చేయక పోవడం... వీటిని పాటిస్తే మంచి ప్రవర్తన అలవడుతుంది. తద్వారా ఈ జనన మరణ చక్రం నుండి విముక్తి పొందే అవకాశం ఉంది.

ఇటువంటి ప్రవర్తనను మనం సత్వగుణ సంపన్నులలో గమనిస్తాము. పైన చెప్పబడిన గుణములు సత్పురుషులలో విరివిగా ఉంటాయి. శాంతి కాముకులైన వారు పైన చెప్పబడిన లక్షణములతో మంచి ప్రవర్తన కలిగి ఉంటారు. అలాగే మంచి ప్రవర్తన కలిగిన వారిలో, సత్సాంగత్యము కలిగిన వారిలో పైన చెప్పబడిన లక్షణములు వాటంతట అవే సంక్రమిస్తాయి. పైన చెప్పబడిన లక్షణములు కలిగి ఉన్న వారికి దు:ఖము, కష్టములు వారి చెంతకు రావు. వారు ఎల్లప్పుడు ఆనందంగా, తృప్తిగా ఉంటారు. ఈ విధమైన ప్రవర్తన కలిగిన యోగులు త్వరలోనే మోక్షమును పొందగలరు. వారికి పతనము అంటూ ఉండదు. అలా కాకుండా, తన ఇష్టం వచ్చిన కర్మలు చేస్తూ, జన్మ తరువాత జన్మ ఎత్తుతూ ఉన్న వారికి మోక్షము ఎప్పటికో కానీ సిద్ధించదు.

కాబట్టి కాశ్యపా! ఏ జీవుడు అయినా తన పూర్వజన్మకర్మఫలములను బట్టి, వాసనలను బట్టి మరుజన్మను పొందుతూ ఉంటాడు. వివిధములైన యోనుల నుండి, వివిధములైన శరీరములతో జన్మలు పొందుతూ ఉంటాడు.

ఓ కాశ్యపా! ఈ సందర్భంలో ప్రతి వాడికీ ఒక సందేహము కలుగుతుంది. అదేమిటంటే......మొట్ట మొదట ఈ సృష్టి ఎలా ప్రారంభం అయింది. మొట్ట మొదట ఎవరు ఉద్భవించారు. ఈ ప్రశ్నలకు ఒకటే సమాధానము. మొట్ట మొదట బ్రహ్మ తనకు తానుగా ఉద్భవించాడు. తనకు తానుగా ఒక శరీరం ఏర్పరచుకున్నాడు. తరువాత మూడు విధములుగా సృష్టిని కొనసాగించాడు. ఈ సృష్టిలో ముఖ్యంగా కదిలేవి, కదలనివి అని రెండు రకాల జీవులు ఉన్నాయి. ఆ విధంగా తనకు తానుగా సృష్టించుకున్న బ్రహ్మ ఆ తరువాత ప్రధానము అనే ప్రకృతిని సృష్టించాడు.

చరాచర జీవులకు మూలకారణము ఈ ప్రకృతి. ఈ ప్రకృతిలో నుండి అన్ని జీవరాసులు ఉద్భవించాయి. ఏదైతే చూడబడుతూ ఉంటుందో అది మార్పుచెందుతూ ఉంటుంది. నాశనము, లేక మార్పుచెందే దానిని క్షరము అని అంటారు. మార్పుచెందుతున్న ప్రకృతిని క్షరము అని అపరా ప్రకృతి అని అంటారు. క్షరమునకు భిన్నంగా ఉండే ప్రకృతి అంటే మూలప్రకృతి మార్పు చెందదు. దానికి నాశనము గానీ, మార్పు గానీ లేదు. దానిని అక్షరము, పరాప్రకృతి అని అంటారు. ఈ రెండింటి కంటే మించినది బ్రహ్మము. సృష్టి ఈ విధంగా మూడు రకాలుగా విభజింపబడింది.

(పరబ్రహ్మ తత్వము అంటూ పురుషుడు అనే తత్వము రెండు రకాలుగా విడిపోయింది. వాటినే అపరా ప్రకృతి, పరా ప్రకృతి అని అంటారు. అపరాప్రకృతి అంటే మనకు కనిపించే చరాచర జీవరాసులతో కూడిన స్థూల ప్రపంచము. ఇది క్షరము. పరా ప్రకృతి అంటే సకల జీవరాసులలో అంతర్లీనంగా ఉండే ఆత్మస్వరూపము. చైతన్యము. ఇది అక్షరము. పరబ్రహ్మము అంటే శుద్ధచైతన్యము. ఆ శుద్ధచైతన్యమే అన్ని జీవరాసులలో పరిమిత చైతన్యంగా ఉండి వాటికి చేతనత్వాన్ని ప్రసాదిస్తుంది. )

ఈ ప్రకృతి లో నుండి పంచభూతములు మూలతత్వములుగా ఆవిర్భవించాయి. ఆ పంచభూతములు స్థూల రూపం దాల్చి చరాచర జగత్తు అంటే కదిలేవి, కదలనివి అనే వాటితో కూడిన జగత్తు ఏర్పడింది. అదే మన కంటికి కనపడే జగత్తు. ఈ కదిలే జీవులు పరిమిత కాలము మాత్రమే జీవించి తరువాత అంతరించి పోతాయి. మరలా పుడుతుంటాయి. ఈ విషయాల గురించి అంటే జీవుల పునర్జన్మ సిద్ధాంతము గురించి, ఆత్మజ్ఞానము కలవారు, పరమాత్మ తత్వము గురించి తెలిసిన వారు మాత్రమే అర్థం చేసుకోగలరు. అటువంటి వారు సుఖ దు:ఖములను సమానంగా అనుభవిస్తారు. ఈ శరీరము అనిత్యము అశాశ్వతము, ఏదో ఒక నాటికి నశించి పోతుంది అని భావిస్తారు. మనకు కలిగే అన్నిసుఖములు స్వల్పములు అనీ, ఆ స్వల్ప సుఖములు తుదకు దు:ఖముతో అంతము అవుతాయి అనే నిజాన్ని గ్రహిస్తారు. అటువంటి వారు దు:ఖపూరితమైన ఈ సంసారము అనే సాగరమును సులభంగా దాటగలరు.

సకల జీవరాసులలో పరమాత్మ ఆత్మస్వరూపంగా ఉన్నాడు, దానికి నాశము లేదు కేవలము ఈ స్థూల శరీరమే మార్పుచెందుతూ బాల్య,యౌవన,వృద్ధాప్యములు అనే స్థితులు దాటి మరణము అనే మార్పుచెంది, తిరిగి మరొక దేహములో ప్రవేశిస్తుంది అనే నిజాన్ని తెలుసుకుంటారు. పరమాత్మ దృష్టిలో అందరూ సమానమే, ఈ తరతమభేదములు శరీరానికే అన్న సత్యం అవగతం చేసుకుంటారు. ఈ విధంగా పరమాత్మ తత్వము గురించి చక్కగా తెలుసుకున్న వారు బాహ్యప్రపంచములో లభించే విషయ వాంఛలపట్ల ఆకర్షితులు కారు.

ఓ కాశ్యపా! ఎవరైతే అన్ని ప్రాణులలో అంతర్లీనంగా పరమాత్మ ఆత్మస్వరూపుడుగా, చైతన్యస్వరూపుడుగా ఉన్నాడు అని తెలుసుకుంటాడో, ఎవరైతే తాను ఈ శరీరం కాదు, తాను ఆత్మస్వరూపుడను అని తెలుసుకుంటాడో, ఈ భౌతిక శరీరము అశాశ్వతము, మరణము ఈ శరీరానికి సంభవించే మార్పుమాత్రమే అని తెలుసుకుంటాడో, అటువంటి వాడు క్రమక్రమంగా ఈ భౌతిక సుఖములను, ద్వంద్వములను విడిచిపెట్టి, నివృత్తి మార్గంలో ప్రయాణం చేసి, సంసారము అనే సాగరాన్ని దాటడంలో సఫలీకృతుడు అవుతాడు. అటువంటి వాడు ఏయే లక్షణములు కలిగి ఉంటాడో చెబుతాను విను.

(వీటినే స్థితప్రజ్ఞుని లక్షణములు అని గీతలో పరమాత్మ చెప్పాడు.)
అందరి ప్రాణుల ఎడల మిత్రత్వము తో ఉంటాడు.
అందరిపట్ల సహనం కలిగి ఉంటాడు.
ఎల్లప్పుడు ప్రశాంత చిత్తంతో ఉంటాడు.
ఇంద్రియ నిగ్రహం కలిగి ఉంటాడు.
క్రోధము, భయము అనేవి అతనిలో మచ్చుకైనా కనిపించవు.
మనోనిగ్రహం కలిగి ఉంటాడు.

సకల ప్రాణుల ఎడల దయ కలిగి ఉంటాడు.

మంచి ప్రవర్తన కలిగి ఉంటాడు.

అతనిలో అహంకారము, అభిమానము కనిపించవు.

జనన మరణాలను, లాభ నష్టాలను, జయాపజయాలను, సుఖదు:ఖాలను సమంగా చూస్తాడు.

తనకు ఉన్న దానితో తృప్తి పడతాడు. ఇతరుల ధనము, ఆస్తి కొరకు ఆశించడు. అతనిలో లోభత్వము ఉండదు.

అతడు ఎవరినీ అవమానించడు, దూషించడు.

అతనికి ప్రాపంచిక విషయములలో ఆసక్తి, అనురక్తి ఉండదు.

అతడికి ఇతరుల పట్ల, తనవాడు, పరాయివాడు, పెద్ద, చిన్న, ధనవంతుడు, పేదవాడు అనే భేదభావము ఉండదు. అతనిలో కులము, వర్ణము, అనే భేదము ఉండదు. అందరినీ సమానంగా చూస్తాడు.

అతడిలో రాగద్వేషములు ఉండవు.

అతడు పూర్వజన్మలలో చేసిన పాప పుణ్యములను అనుభవిస్తాడు కానీ కొత్తగా పాప పుణ్యములను సంపాదించడు. అంతకు ముందు జన్మలలో చేసిన పాపపుణ్యముల నుండి విముక్తి కొరకు మాత్రమే ప్రయత్నిస్తాడు.

మనసును, ఇంద్రియములను ఎటువంటి అలజడికి లోను కానీయకుండా ఎల్లప్పుడూ నిర్వికారంగా, ప్రశాంతంగా ఉంటాడు. ద్వంద్వములకు అతీతంగా ఉంటాడు.

శారీరకంగా వచ్చే సహజమైన మార్పులైన యవ్వన, వృద్ధాప్య, మరణముల పట్ల ఆసక్తి కలిగి ఉండడు.

అటువంటి వాడు తనలో ఉన్న లోపాలను పసిగట్టి వాటి నుండి బయట పడడానికి ఎల్లప్పుడూ ప్రయత్నిస్తూ ఉంటాడు.

పై లక్షణములు కలిగిన సాధకుడు శబ్దమునకు, ఇంద్రియములకు, మనసుకు అందనిది అయిన పరమాత్మ తత్వమును గురించి తెలుసుకోడానికి నిరంతరం ప్రయత్నిస్తుంటాడు. అటువంటి వాడు సకల సంకల్పములను వదిలిపెట్టి, పరమ శాంతిస్థితిలో మనసును నిలిపి, పరమాత్మ గురించి సాధన చేస్తాడు. అటువంటి సాధకుడు, ఏ ఉపకరణము (కర్రలు, తైలము) లేకుండా మండే అగ్ని మాదిరి నిరంతరం జ్వలిస్తూ, మోక్షము కొరకు ప్రయత్నం చేస్తాడు.

పరబ్రహ్మ తత్వము ప్రశాంతము, శాశ్వతము, అనంతము, అవ్యయము. దానికి మించినది మరొకటి లేదు. సాధకులు, యోగులు అందరూ ఆ పరబ్రహ్మతత్వము కొరకు సాధన చేస్తారు. ఆ పరబ్రహ్మ తత్వము ఎలా పొందాలో, ఓ కాశ్యపా! నేను నీకు వివరిస్తాను. శ్రద్ధగా విను.

ఇంద్రియములను మనసును ప్రాపంచిక విషయముల నుండి వెనకకు లాగి, అంటే మనసును, బుద్ధిని ప్రవృత్తి మార్గములో నుండి నివృత్తి మార్గములోనికి తిప్పి, మనసును ఆత్మయందు

ఉంచాలి.

ఈ స్థితికి రావడానికి సాధకునికి శాస్త్ర పరిజ్ఞానము కావాలి. అష్టాంగయోగములను, అంటే ధ్యానము, ధారణ, సమాధి మొదలగువాటిని అభ్యసించాలి. అప్పుడే మనస్సు నిశ్చలంగా ఉంటుంది. పరమాత్మ యందు లగ్నం అవుతుంది. తపస్సు, ధ్యానము, యోగము అభ్యసించి నందువలన మనస్సు ప్రశాంతత పొందుతుంది. అప్పుడు సాధకుడు తన మనో నేత్రంతో ఆత్మను దర్శించగలడు. ఎప్పుడైతే సాధకుడు తన మనసును ఆత్మయందు లగ్నం చేయగలిగాడో, అప్పుడు అతడు ఇతరములైన వ్యాపకముల వైపు వెళ్లడు. ఎల్లప్పుడూ ధ్యానంలో ఉంటూ ఆత్మను దర్శిస్తూ ఉంటాడు. అతనిలో ఉన్న ఇతర అలవాట్లు అదృశ్యం అయి, నిరంతరం ఆత్మదర్శనానికి అలవాటు పడతాడు. అప్పుడు తనలో ఉన్న ఆత్మలో అంతటా నిండి ఉన్న పరమాత్మను దర్శించగలుగుతాడు.

ఈ విధంగా, ఇంద్రియ నిగ్రహము, మనో నిగ్రహము సాధించిన సాధకుడు, ఆత్మ దర్శనం చేసిన సాధకుడు, అందరిలో ఉన్న ఆత్మలలో తన ఆత్మను దర్శించగలుగుతాడు. ఎలాగైతే సాధకుడు, తాను కలలో చూసిన వ్యక్తిని, నిద్రనుండి లేచిన తరువాత ఎలా గుర్తుపడతాడో, అలాగే, తాను ధ్యానయోగములో ఉన్నప్పుడు దర్శించిన పరమాత్మ స్వరూపమును, ధ్యానములో నుండి బయటకు వచ్చిన తరువాత కూడా నిరంతరము తన ఆత్మలో దర్శిస్తూ ఉంటాడు. అంతేకాదు, ఈ అనంత విశ్వంలో కూడా పరమాత్మను దర్శించగలడు.
(అంతా రామమయం, జగమంతా రామమయం, ఇందుకలడందులేడని సందేహము వలదు, చక్రి సర్వోపగతుండు. ఇవన్నీ కూడా ఈ సిద్ధాంతం అనుసరించి చెప్పబడ్డాయి.).

ఆ స్థితికి చేరుకున్న యోగి, అత్యంత చిన్నదైన, సన్నదైన, ముంజ గడ్డి నుండి దాని మధ్య ఉన్న ఈనెను విడదీసి చూచినట్టు, తన ఆత్మను శరీరం నుండి విడదీసి చూడగలడు. అంటే ముంజగడ్డి శరీరం అయితే దాని మధ్యలో ఉన్న ఈనె ఆత్మస్వరూపము. యోగులైన వారు ఇటువంటి ఉదాహరణలతోనే శరీరమును, అందులో ఉన్న ఆత్మను నిర్వచించగలరు. ఆ విధంగా తన శరీరం నుండి ఆత్మను విడదీసి చూడగలిగిన యోగికి మూడు లోకములలో ఎదురు ఉండదు. అటువంటి యోగి స్థూల శరీరము నుండి విడివడిన తరువాత (మరణించిన తరువాత) తన సూక్ష్మశరీరమును తన ఇష్టం వచ్చిన శరీరములో ప్రవేశ పెట్టగలడు. (జనన మరణములను తానే శాసించగలడు.)

అటువంటి వాడు తన మరణమునకు కానీ, తన కళ్లముందు జరుగుతున్న ఇతరుల మరణములకు కానీ బాధపడడు, శోకించడు. అదిఒక పరిణామము అని తెలుసుకుంటాడు. తాను మరణించిన తరువాత మరొక జన్మఎత్తకుండా జన్మరాహిత్యమును పొందగలడు. అటువంటి స్థితిని పొందిన యోగి యొక్క జీవిత కాలంలో దు:ఖము అనేది ఉండదు. ఇతరులు బాధపడుతున్నా,

ఇతరులు తనను బాధ పెడుతున్నా, దేనికీ చలించడు. నిశ్చలంగా, నిర్మలంగా ప్రశాంతంగా ఉంటాడు. అటువంటి యోగికి కోరికలు ఉండవు. మనసు ప్రశాంతంగా ఉంటుంది. భయము, సుఖము దు:ఖము ఆందోళన అతని దగ్గరకు కూడా రావు. అతనిలో రాగద్వేషములు కనపడవు. అతనికి మృత్యుభయం ఉండదు. అతని కంటే ఆనందస్వరూపుడు ఈ ముల్లోకములలో మరొకడు ఉండడు. అతనికి సుఖదు:ఖములగురించిన ఆలోచనలు లేవు కాబట్టి సుఖంగా నిద్రించగలడు. ఈ లక్షణములు సంతరించుకున్న యోగి ఎన్నటికీ తన యోగసాధన నుండి పతనం చెందడు. పైపైకి పోతూ చివరకు పరమాత్మను చేరుకుంటాడు.

అటువంటి యోగి స్వర్గసుఖములను, అణిమాది అష్టసిద్ధులను, చివరకు స్వర్గాధిపతి అయిన ఇంద్రుడిని కూడా లెక్కచేయడు. అతడి పరమావధి కేవలం పరమాత్మను చేరుకోవడమే. ఈ విధంగా నిరంతరంగా యోగ సాధన చేస్తున్న యోగి తన యోగసాధనలో పరిణతి పొందుతాడు. ఆ స్థితిని పొందిన యోగి, ఇంద్రియ నిగ్రహము, మనో నిగ్రహమును సాధించిన యోగి, ప్రశాంత స్థితిలో ఉన్న యోగి, తన హృదయములో దాగి ఉన్న ఆత్మస్వరూపమును దర్శించగలడు. ఆ విధంగా సమాధి స్థితిలో ఉన్న యోగి, తనలో ఉన్న ఆత్మకు, బయట అంతటా నిండి ఉన్న పరమాత్మకు భేదం లేదని తెలుసుకుంటాడు. పరమాత్మకన్నా వేరు పదార్థము ఏదీ లేదని గ్రహిస్తాడు.

ఈ స్థితికి రావాలంటే పరిసరాలు ప్రశాంతంగా ఉండాలి. అందుకనే యోగులు అడవులకు వెళ్లి తపోనిష్ఠలో ఉంటారు. అక్కడ మానవ సంచారము ఉండదు. ఎటువంటి శబ్దములు వినిపించవు. వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. అటువంటి చోట ధ్యానము చేయడానికి శరీరము బయట నుండి కానీ, శరీరము లోపల నుండి కానీ ఎటువంటి అవరోధములు కలుగవు. ఆ స్థితిలోనే మనసు ఆత్మలో లగ్నం అవుతుంది. అని ఆ సిద్ధుడు కాశ్యపుడు అనే బ్రాహ్మణునికి వివరించాడు.

అప్పుడు కాశ్యపుడు ఆ సిద్ధునితో ఇలా అన్నాడు. "ఓ మహాత్మా! మోక్షము అంటే ఏమిటి? దీని గురించి వివరించండి అని అడిగాడు. దానికి ఆ సిద్ధుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు.

"కాశ్యపా! ఒక విలువైన వస్తువును ఒక చోట పెట్టిన తరువాత, తాను ఏ పని చేస్తున్నా, అతని మనసు, దృష్టి నిరంతరం ఆ విలువైన వస్తువు మీదనే ఎలా లగ్నం అయి ఉంటుందో, అలాగే, తన మనసును ఆత్మయందు లగ్నం చేసినవాడు, తాను శరీరములోని అవయవములతో ఏ పని చేస్తున్నా, తనలో ఉన్న ఆత్మతత్త్వము మీదనే దృష్టి కలిగి ఉంటాడు. ఈ శరీరము వేరు, ఆత్మ వేరు అనే భావన కలిగి ఉంటాడు. ఆత్మతత్త్వమును గురించి తెలుసుకోవడానికి అత్యంత శ్రద్ధ భక్తి కలిగి ఉంటాడు. అటువంటి వాడు అనతి కాలంలోనే పరబ్రహ్మను చేరుకోగలడు.

అటువంటి సాధకునికి కళ్లు, ముక్కు, చర్మము మొదలగు వాటి వలన కలిగే సుఖముల మీద ఆసక్తి ఉండదు. ఇంద్రియసుఖములకు అతీతంగా ఉంటాడు. అటువంటి సాధకుడు, తన మనసును ప్రాపంచిక విషయముల నుండి మళ్లించి ఆత్మయందు లగ్నం చేస్తాడు. ఆత్మ దర్శనం చేస్తాడు.

అటువంటి సాధకుడు తనలో ఉన్న ఆత్మ ఈ అనంత విశ్వం అంతటా విస్తరించి ఉందని తెలుసుకుంటాడు. తానే పరమాత్మ అనే భావన పొందుతాడు. ముంజగడ్డినుండి కంటికి కనపడని ఈనెను వేరుచేసి చూచినట్టు, సాధకుడు తన శరీరం నుండి సూక్ష్మాతి సూక్ష్మమైన ఆత్మను వేరుగా చూడగలడు. ఈ స్థితి శాస్త్రజ్ఞానమును, దాని వలన కలిగే ఆత్మజ్ఞానమును, ఆర్జించి నందువలన మాత్రమే కలుగుతుంది. అప్పటి వరకు శరీరము, శరీరములో ఉన్న మనసుతో బాహ్య ప్రపంచములో సాకారంగా దర్శించిన పరమాత్మను, బాహ్యప్రపంచ జ్ఞానమును వదిలిపెట్టి, అంతర్ముఖుడై, నిరాకారుడు, నిర్వికారుడు అయిన ఆత్మస్వరూపునిగా దర్శిస్తాడు. అప్పటి వరకు బాహ్య ప్రపంచములో విహరించిన మనసు అంతర్ముఖమై, ఆత్మలో లీనం అవుతుంది. ఈ స్థితికి చేరుకున్న జీవుడు తుదకు పరమాత్మలో ఐక్యం అవుతాడు. దానినే మోక్షం అని అంటారు.

ఓ కాశ్యపా! అతి గుహ్యమైన ఈ రహస్యాన్ని నీకు చెప్పాను. ఇంక నేను వెళతాను అని అన్నాడు. తరువాత ఆ సిద్ధుడు యధేచ్ఛగా వెళ్లిపోయాడు.

అర్జునా! ఆ సిద్ధుడు కాశ్యపుడు అనే బ్రాహ్మణునికి చేసిన ఆత్మబోధ, మోక్ష సాధన గురించి నేను నీకు వివరించాను. యుద్ధం చేయడానికి ముందు నీవు విషాదంతో బాధపడుతుంటే, నేను నీకు చేసిన బోధనలను మరలా నీకు ఈ రోజు క్లుప్తంగా వివరించాను. నేను నీకు ఈ రోజు చెప్పినవే యుద్ధానికి ముందు నేను నీకు చెప్పాను. ఈ బోధనలను నీవు మనసు పెట్టి శ్రద్ధగా భక్తితో విన్నావా? అర్థం చేసుకున్నావా? ఎవరి గ్రహణ శక్తి బలహీనంగా ఉంటుందో, ఎవరికి శాస్త్రజ్ఞానం ఉండదో, ఎవరైతే తిన కూడని నిషిద్ధమైన ఆహారమును తింటుంటారో, ఎవరి మనస్సు నిర్మలంగా, ప్రశాంతంగా ఉండదో, అటువంటి వారికి ఈ ఆత్మబోధ అర్థంకాదు. ఎవని మనసులో పరమాత్మ గురించి శాస్త్రజ్ఞానము గురించి సందేహాలు మొలకెత్తుతాయో వారికి కూడా ఈ ఆత్మబోధ అర్థం కాదు. ఎందుకంటే, దేవతలకు కూడా ఈ ఆత్మబోధ అర్థంకాక, వారు స్వర్గసుఖముల మీద మాత్రమే ఆసక్తి కలిగి ఉంటారు.

ఇంత వరకు ఏ మానవుడు కూడా ఈ ఆత్మబోధను విని ఉండలేదు. నీవు ఈ ఆత్మబోధను వినడానికి అర్హుడవు కాబట్టి, నేను నీకు యుద్ధమునకు ముందు బోధించాను, మరలా ఈ రోజు నేను నీకు ఆత్మబోధ గురించి క్లుప్తంగా చెప్పాను. స్వర్గలోకమంతా పుణ్య కర్మలు చేసి పుణ్యము ఆర్జించి, ఆ పుణ్యఫలములను స్వర్గలోక సుఖముల రూపంలో అనుభవించడానికి వచ్చినవారితో నిండిపోయి ఉంది. దేవతలకు ఎల్లప్పుడూ కర్మసిద్ధాంతము, యజ్ఞయాగములు

మొదలగు కర్మల మీదనే వారికి ఆసక్తి ఎక్కువ. వారికి కర్మసన్యాసము మీద, కర్మఫల త్యాగము మీద ఆసక్తి లేదు. ఎందుకంటే కర్మఫలత్యాగము మోక్షమార్గమునకు సోపానము వంటిది. మధ్యలో ఉన్న ఈ స్వర్గసుఖముల మీద దానికి ఆసక్తి ఉండదు. నిరాకార స్వరూపుడు, శాశ్వతుడు అయి. ఆ పరమాత్మను చేరుకోవడమే ప్రతి జీవి లక్ష్యము కావాలి కానీ, అశాశ్వతములు అయిన స్వర్గసుఖములు కాదు. మోక్షమార్గమే అన్నింటి కంటే అత్యుత్తమమైనది. ఆ మార్గము అనుసరించి శాశ్వతుడు అవ్యయుడు నిరాకారుడు అయిన పరబ్రహ్మను పొందగలము. ఈ పాంచభౌతిక శరీరమును వదిలిన తరువాత, గతజన్మవాసనలను, ఈ జన్మవాసనలను నాశనము చేసుకొని మనసును ఆత్మయందు లగ్నం చేసి, పరమాత్మను చేసుకోవాలి. అదే ప్రతి జీవి లక్ష్యము. అదే అమృతత్వము, శాశ్వతానందము.

ఈ మోక్షమార్గమును అనుసరించిన వారు స్త్రీలు కానీ, వైశ్య శూద్రవర్ణముల వారు కానీ మోక్షమును పొందగలరు. వారే మోక్షమునకు అర్హులైనపుడు, నిరంతరము వేదాధ్యయనము చేస్తూ, జ్ఞానమును సంపాదించి, ఇంద్రియ నిగ్రహము, మనోనిగ్రహము, నిష్కామ కర్మలను ఆచరించే బ్రాహ్మణ క్షత్రియుల మాట చెప్పేదేముంది. ఇదే విషయము సహేతుకంగా వేదములు, ఉపనిషత్తులు, శాస్త్రములలో చెప్పబడింది. దానిని ఆచరించడమే మానవుల కర్తవ్యము. మోక్షము పొందడం కన్నా శాశ్వతానందము, పరమశాంతి, దు:ఖకారణమైన జనన మరణముల నుండి విముక్తి, పొందే మార్గము మరొకటి లేదు. శాస్త్రములను అధ్యయనము చేసి జ్ఞానమును సంపాదించిన సాధకుడు, ఈ ప్రాపంచిక సుఖములు అన్నీ అశాశ్వతములు, మొదట్లో సుఖాలను ఇచ్చినా, తుదకు దు:ఖమునే మిగుల్చుతాయి అని నమ్మిన సాధకుడు, నిరాకారుడు, అవ్యయుడు, శాశ్వతుడు అయిన పరమాత్మ మీద నిర్మల మైన, అచంచలమైన, శ్రద్ధ, భక్తి కలిగి ఉంటాడు. పరమాత్మను పొందడానికి సాధకుడు యోగమార్గాన్ని అవలంబించి, క్రమ క్రమంగా గతజన్మవాసనల నుండి విముక్తిని పొందుతాడు. అటువంటి సాధకుడు అచిరకాలములోనే పరమాత్మను చేరుకుంటాడు. మానవుడు తన జీవిత కాలంలో తెలుసుకోదగినది ఇదే. దీనిని మించినది మరొకటి లేదు.

అర్జునా! ఈ సందర్భంలో, పురాతన కాలంలో ఒక దంపతుల మధ్య జరిగిన సంవాదమును వినిపిస్తాను. శ్రద్ధగా విను. ఒక రోజు ఒక బ్రాహ్మణ వనిత తన భర్తను చూచి ఇలా అంది. "ఏమండీ! తమరు మహాజ్ఞానులు కదా! వేదములు, ఉపనిషత్తులు, శాస్త్రములు చదివి ఎంతో జ్ఞానము సంపాదించారు కదా! ఎల్లప్పుడూ ఇతరులతో ఎటువంటి సంపర్కము పెట్టుకోకుండా, నిరంతరం దైవధ్యానం చేస్తుంటారు కదా! మీరు పుణ్యలోకాలకు పోతారు. అందుకు సందేహము లేదు. కాని, మీ భార్యను, మీ సహధర్మచారిణి అయినందుకు నా పరిస్థితి ఏమిటి? నేను మీకు సేవచేయడం తప్ప ఎటువంటి పుణ్యకార్యాలు చేయడం లేదు. అటువంటి నాకు ఎటువంటి లోకాలు లభిస్తాయి. కాని నేను వినడంలో, భర్తకు ఎటువంటి పుణ్యలోకాలు లభిస్తాయో, భార్యకు కూడా అటువంటి పుణ్యలోకాలు లభిస్తాయి అని తెలుసుకున్నాను. మీ వంటి వారిని భర్తగా పొందినందుకు,

నాకు ఎటువంటి లోకాలు లభిస్తాయో దయచేసి చెప్పండి" అని అడిగింది.

దానికి ప్రశాంత మనస్కుడు, జ్ఞాని అయిన ఆ బ్రాహ్మణుడు భార్యతో ఇలా అన్నాడు. "ఓ వనితా! నీవు స్వతంత్రించి, నన్ను అడిగిన మాటలకు నాకు ఎటువంటి కోపం రావడం లేదు. నీవు అడిగిన ప్రశ్నలకు నాకు తెలిసినంత వరకు సమాధానం చెబుతాను. విను.

పురుషులు తమ ఇంద్రియములతో ఎన్నో విధములైన కర్మలు చేస్తుంటారు. అవి మంచి కర్మలు కావచ్చు, చెడు కర్మలు కావచ్చు. ఎటువంటి శాస్త్ర పరిజ్ఞానము, వివేచనా శక్తి లేని వాడు, ఆ కర్మల వలన అజ్ఞానాన్ని పెంచుకుంటాడు. మరొక విషయం ఏమిటంటే, ఈ ప్రపంచంలో పుట్టిన ప్రతి ప్రాణీ కర్మచేయకుండా ఒక్క క్షణం కూడా ఉండలేదు. మానవుడు అయితే ఎప్పుడూ ఏదో ఒక కర్మచేస్తూనే ఉంటాడు. కాబట్టి కర్మచేయకుండా ఉండటం ఎవరికీ సాధ్యం కాదు. మానవుడు జన్మఎత్తినప్పటి నుండి మరణించే వరకు, ఇంద్రియములతో కానీ, నోటితో కానీ, మనస్సుతో కానీ, ఏదో ఒక కర్మ, అది మంచి కర్మ కావచ్చు, చెడు కర్మ కావచ్చు, నిషిద్ధ కర్మ కావచ్చు, ఏదో ఒక కర్మ ఆచరిస్తూనే ఉంటాడు. అటువంటివే యజ్ఞయాగాదులు. హోమ కుండంలో అగ్నిని వేల్చడం, అందులో వేద మంత్రాలు చదువుతూ నెయ్యి, సమిధలు వేయడం, స్వర్గసుఖాల కొరకు దేవతలను ప్రార్థించడం, వారికి హవిస్సులు అర్పించడం, ఈ యజ్ఞయాగాదులు పాడు చేయడానికి రాక్షసులు ప్రయత్నించడం, ఇవన్నీ కర్మలే.

ఈ కర్మలు, కర్మఫలములు అన్నీ అశాశ్వతములు అని భావించిన నేను, ఈ కర్మకాండల జోలికి పోకుండా, మనసును ఆత్మలో నిలిపి, అవ్యయుడు, నిరాకారుడు, నిర్గుణుడు అయిన పరమాత్మకొరకు సాధనచేసాను. ఆ పరమాత్మ ద్వంద్వములకు అంటే సుఖ దు:ఖములు, జయాపజయాలు మొదలగు ద్వంద్వములకు అతీతుడు. త్రిగుణాతీతుడు. ఆ పరమాత్మ అన్నిజీవులలో ఆత్మస్వరూపుడుగా, చైతన్యస్వరూపుడుగా ఉన్నాడు. బ్రహ్మాదులు కూడా ఆ పరబ్రహ్మను పొందడానికి ధ్యానయోగము ద్వారా ఆ పరమాత్మను ఆరాధిస్తున్నారు. జ్ఞానులు, సాధకులు అందరూ నివృత్తి మార్గం అవలంబించి, మనసును నిగ్రహించి, మనసును ఆత్మలో నిలిపి, ప్రశాంతమైన మనస్సుతో, నిరంతర ధ్యానయోగములో నిమగ్నులై ఆ పరమాత్మను పొందడానికి ప్రయత్నిస్తున్నారు.

ఆ పరమాత్మ తత్త్వము కళ్లతో చూచి కానీ, చెవులతో విని కానీ, చేతులతో తాకి కానీ, తెలుసుకోలేము. ఆ పరమాత్మ తత్త్వము ఇంద్రియములకు అతీతమైనది. కేవలం ఇంద్రియములను నిగ్రహించి, నిర్మలమైన మనసును ఆత్మలో లగ్నం చేయడం ద్వారా మాత్రమే తెలుసుకోగలము. ఈ ప్రకృతి ఆ పరమాత్మలో నుండి ఆవిర్భవించింది. తిరిగి ఆయనలోనే లీనమైపోతుంది. కాబట్టి పరమాత్మలోనుండి వచ్చిన పదార్థముల ద్వారా పరమాత్మను తెలుసుకోలేము.

ప్రాణుల శరీరములలో ఐదు వాయువులు నిరంతరం ప్రసరిస్తుంటాయి. ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన వాయువులు. ఇవి శరీరములో ప్రవేశించగానే శరీరం చైతన్యవంతమౌతుంది. ప్రాణ అపాన వాయువులు శరీరములో పైకి కిందికి నిరంతరం ప్రసరిస్తుంటాయి. దాని వలననే శ్వాస ఆడుతుంది. ప్రాణులు జీవిస్తుంటాయి. వీటి మధ్యలో వ్యాన, సమాన వాయువులు ఉంటాయి. ప్రాణులు నిద్రించి నపుడు ఈ వ్యాన, సమాన వాయువులు కలిసి పోతాయి. కాని ఉదాన వాయువు మాత్రము శరీరం అంతా నిరంతరం ప్రసరిస్తూనే ఉంటుంది. కాబట్టి, ప్రాణ అపాన వాయువులు మానవుడు ఏ స్థితిలో ఉన్నా, అంటే జాగ్రదావస్థలో కానీ, స్వప్నావస్థలో కానీ, సుషుప్తావస్థలోకానీ ఉన్నా, వాటి పని అవి చేస్తూనే ఉంటాయి. ఆగిపోవు.
(ఊపిరి పీల్చడం వదలడం నిరంతరం సాగుతూ ఉండే ప్రక్రియ).

ఉదాన వాయువు శరీరములో ఉన్న ఇతర ప్రాణ వాయువులను అన్నింటినీ నియంత్రిస్తూ ఉంటుంది. అంతే కాకుండా ప్రాణుల శరీరములో వైశ్వానర అగ్ని అనే అగ్ని నిరంతరం ప్రజ్వరిల్లుతూ ఉంటుంది. కళ్లతో చూడటం, చెవులతో వినడం, ముక్కుతో వాసన చూడటం, చర్మముతో స్పర్శ, నాలుకతో రుచి చూడటం, మనసుతో ఆలోచించడం, బుద్ధితో విశ్లేషించడం ఈ ఏడునాలుకలతో వైశ్వానర అగ్ని బయట ప్రపంచములో ఉన్న వాటిని లోపలకు తీసుకుంటూ ఉంటుంది. పైన చెప్పిన విధంగా ప్రపంచంలో ఉన్న వస్తువులను చూడటం, బయట శబ్దములను వినడం, ఆహార పదార్థములను రుచి చూచి ఇష్టమైనవి తినడం, ఇష్టమైనవి తాకడం అనుభవించడం, ఇష్టమైన వాటిని వాసన చూచి ఆనందించడం, పైవాటిని ఎలా పొందాలా అని ఆలోచించడం, ఆ ఆలోచనలను విశ్లేషించడం, ఇవి శరీరములో ఉన్న వైశ్వానరుడు అనే అగ్నికి ఏడు విధములైన ఆహుతులుగా చెప్పబడ్డాయి.

శరీరములో జరిగే మహాయజ్ఞమునకు ఏడుగురు ఋత్విక్కులు, ఏడు ఆహుతులు. ఎలాగంటే చూచేవాడు, వినేవాడు, వాసన చూచేవాడు, రుచి చూచేవాడు, స్పర్శ సుఖం అనుభవించేవాడు, ఆలోచించేవాడు, విశ్లేషించేవాడు వీరు ఏడుగురు ఋత్విక్కులు. వీరందరూ వారు చూచేవి, వినేవి మొదలగు ఏడింటిని వైశ్వానరాగ్నిలో హెూమం చేస్తుంటారు. ఈ యజ్ఞం ప్రతి శరీరంలో నిరంతరం జరుగుతూ ఉంటుంది. అగ్ని, వాయువు, నీరు, భూమి, ఆకాశము, మనస్సు, బుద్ధి ఈ ఏడు మహాయోనులు అని చెప్పబడ్డాయి. ఏ పదార్థము అయినా, వస్తువు అయినా, సంకల్పము అయినా ఈ ఏడింటినుండి పుడుతుంది. తుదకు ఆ ఏడింటిలోనే లీనం అవుతుంది. ఎలాగంటే, అగ్ని కట్టెలో నిక్షిప్తంగా ఉంటుంది. ఆ కట్టెలు రాసుకున్నప్పుడు నిప్పుపుడుతుంది. (అరణి అంటారు). ఆ నిప్పుహెూమగుండంలో హవ్యవాహనుడుగా వెలుగుతాడు. ఆ అగ్నిలో వేసిన హవిస్సులు హుతం అయి రూపాంతరం చెంది ఇతర యోనుల నుండి వివిధములుగా ఆవిర్భవిస్తాయి. (వాయువు నుండి పొగ, భూమి నుండి బూడిద, మొదలైనవి). ఆ విధంగానే ఈ అనంత విశ్వం అందులోని పదార్థాలు, ఆలోచనలు, ఆవిష్కరణలు అన్నీ ఆవిర్భవించి, కొంత కాలం ఉండి, తుదకు ఆ ఏడింటిలోనే

లయం అవుతుంటాయి.

(ఉదాహరణకు పంచభూతములు, మనో,బుద్ధి వీటితో కూడిన శరీరం అత్యంత సూక్ష్మమైన వీర్యకణము నుండి ఆవిర్భవించి, మాతృగర్భం నుండి బయట పడి పెరిగి పెద్దదై, తుదకు పంచభూతములలో కలిసిపోతుంది. ఈ ప్రక్రియ నిరంతరం సాగుతూనే ఉంటుంది.)

ఈ అనంత విశ్వం అంతా పైన చెప్పబడిన పంచభూతాలు, (వాటి తన్మాత్రలు), మనసు, బుద్ధితో ఏర్పడింది. అందుకే ఈ విశ్వంలో ఉన్న అన్ని జీవరాసులు, పదార్థాలు రంగు, రుచి, వాసన, శబ్దము, ఆకారము, ఆలోచన, విశ్లేషణ తో కూడి ఉన్నాయి. దీనినే మన పూర్వీకులు సప్తవిధహోత్ర విధానము అని అన్నారు.

అర్జునా! ఈ సప్తవిధహోత్రవిధానమే కాకుండా దశవిధహోత్రవిధానము అని కూడా మరొకటి ఉంది. దాని గురించి కూడా వివరిస్తాను. సావధానంగా విను. ఈ దశవిధహోత్ర విధానంలో పది విధములైన ఋత్విక్కులు, ఆహుతులు ఉంటాయి. రెండు కళ్లు, రెండు చెవులు, ముక్కు, నాలుక, చర్మము, రెండు కాళ్లు, రెండు చేతులు, జననాంగము, విసర్జక అవయవము, వాక్కు. ఈ పది అవయవములు కూడా, పది విధములైన ఋత్విక్కులుగా మారి, బయట ఉన్న ప్రాపంచిక సుఖములను, వస్తువులను లోపల ఉన్న అగ్నిలో ఆహుతులుగా సమర్పిస్తుంటాయి. ఈ ఆహుతులు ఏవంటే శబ్దము, స్పర్శ, వివిధములైన దృశ్యములు, వివిధ రుచులు, సువాసనలు, మాటలు, చేతులతో చేసే రకరకాల పనులు, కాళ్లతో తిరిగే వివిధ ప్రదేశములలో కలిగే అనుభవములు, జననాంగమునుండి విడుదలఅయ్యే వీర్యము, మూత్ర పురీషములు, ఇవి పది ఆహుతులు.

శరీరములో ఉండే పంచభూతములే పంచాగ్నులు. ఇంకా విష్ణువు, సూర్యుడు, ఇంద్రుడు, ప్రజాపతి, మిత్రుడు. మొత్తం పది అగ్నులు. పైన చెప్పబడిన శరీర అవయములు అనే ఋత్తిక్కులు బయట ప్రపంచంలో దొరికే అన్ని సుఖములను, పదార్థములను లోపలకు తీసుకొని, (ప్రాణులు పది ఇంద్రియములతో చేసే మంచి పనులు, చెడ్డ పనులు, వాటికి కలిగే ఆయా ఫలితములు), వాటిని సమిధలుగా చేసి, శరీరములో ఉన్న పది అగ్నులలో హోమం చేస్తారు. మనసు ఈ ప్రక్రియలు అన్నింటికీ సాయం చేస్తుంటుంది.

ఇంక మిగిలింది ఆత్మ. అంటే పరిశుద్ధమైన జ్ఞాన స్వరూపమే ఆత్మ. ఈ ఆత్మస్వరూపము బయట కనిపించే ప్రకృతి కంటే భిన్నమైనది. మనసుతో చేసే ఆలోచనలతో కానీ, మనసు ప్రేరేపించే పనులతో కానీ, ఇంద్రియములు చేసే పనులతో కానీ, వాటి ఫలితములతో కానీ ఆత్మకు సంబంధము లేదు. వీర్యకణములో నుండి ఉద్భవించిన ఈ భౌతిక శరీరములో ఆత్మ

సూక్ష్మరూపంలో ఉంటుంది.

(కళ్లకు కనిపించే సిపియు, మానిటర్, కీ బోర్డు, మౌస్ ఇవి కళ్లకు కనిపించే శరీరము అవయవములు అయితే ఆపరేటింగ్ సిస్టమ్, వివిధ ప్రోగ్రాములు సూక్ష్మరూపంలో ఉంటాయి. ఇది సరిఅయిన ఉదాహరణ కాదు కానీ మీకు అర్థం కావడానికి రాసాను.)

ఈ శరీరములో గార్హపత్య అగ్ని అనే అగ్ని, శరీర ఉష్ణోగ్రత రూపంలో శరీరం అంతటా విస్తరించి ఉంటుంది. ఈ గార్హపత్య అగ్ని ఆధారంగానే ఒక ప్రాణి నుండి మరొక ప్రాణి పుడుతూ ఉంటుంది. ఇంక మనసు చేసే ఆలోచనలకు, సంకల్పములకు దోహదం చేసేది ఆహవనీయ అగ్ని. ఆహవనీయ అగ్ని నుండి వాక్కు ఉద్భవించింది. వాక్కును మనసు అనుసరించింది. మనసు సృష్టి చేయ సంకల్పించింది. మనసులో పుట్టిన ఆలోచనలు దృశ్య రూపం దాల్చాయి. ఆదృశ్యరూపములను అవయవములతో తెలుసుకోగలుగుతున్నాము." అని ఆ బ్రాహ్మణుడు వివరించగానే, బ్రాహ్మణ పత్ని మరొక ప్రశ్నవేసింది.

"నాథా! ముందు వాక్కుపుట్టి, తరువాత మనసు పుట్టింది అన్నారు. మనస్సు లో ఏం మాట్లాడాలో సంకల్పించి, ప్రేరేపిస్తేనే కదా నోటి నుండి మాట వస్తుంది. అటువంటప్పుడు వాక్కును అనుసరించి మనసు ప్రవర్తించడం ఎలా సాధ్యం. ప్రాణము, మనసు ఏది దేని మీద ఆధారపడి ఉంది. మనసు ప్రాణం మీద ఆధారపడి ఉంటే, మంచి దీర్ఘనిద్రలో ఉన్నప్పుడు, ఇంద్రియములు, మనసు అచేతనావస్థలో ఉన్నప్పుడు కూడా, ప్రాణం ఉంటుంది కదా! ఆ స్థితిలో ప్రాణము ప్రపంచములో ఉన్న వస్తువులను ఎందుకు తెలుసుకోలేదు? అలా తెలుసుకోకుండా ఏది అడ్డుకుంటూ ఉంది? దయచేసి ఈ సందేహములను నివృత్తి చేయండి." అని అడిగింది. దానికి ఆ బ్రాహ్మణుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు.

"ఓ వనితా! ప్రాణము, అపానము నిరంతరము ఈ శరీరంలో సంచరిస్తుంటాయి అని చెప్పాను కదా! అపానము ప్రాణము మీద తన ఆధిక్యాన్ని చూపుతూ ఉంటుంది. తానే ప్రాణముగా మారుతుంది. అంటే ప్రాణ అపానములు ఒకదానితో ఒకటి కలిసి పోతాయి. ఈ రెండూ కలిసి మనసును ప్రేరేపిస్తాయి. ఆ కారణం చేత మనసు ప్రాణం మీద ఆధారపడి ఉంది. అంతేకాని, ప్రాణం మనసు మీద ఆధారపడి లేదు. (ప్రాణం పోగానే మనసు దానంతట అదేపని చేయడం మానేస్తుంది.) ఆ కారణం చేత సుషుప్తావస్థలో, ఇంద్రియములు, మనసు ఏ పనీ చేయకుండా ప్రశాంత స్థితిలో ఉన్నప్పుడు కూడా ప్రాణ అపానములు ఆగిపోవు. అవి తమ పని తాము చేస్తుంటాయి.

నువ్వు వాక్కు, మనసు వీటి గురించి అడిగావు కాబట్టి, ఒక సందర్భంలో వాక్కుకు, మనసుకు మధ్యజరిగిన సంవాదమును వినిపిస్తాను. శ్రద్ధగా విను. ఒక సారి మనస్సు, వాక్కు

(వాగ్దేవి, సరస్వతి) సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడిని ఇలా అడిగాయి.

"స్వామీ! మా ఇద్దరిలో ఎవరు గొప్ప? అనే సందేహము వచ్చింది. ఆ సందేహము మీరే తీర్చాలి" అని అడిగాయి.

బ్రహ్మదేవుడు తడుముకోకుండా "నిస్సందేహంగా మనసే గొప్పది" అని చెప్పాడు.

అప్పుడు వాక్కుకు అధిష్ఠాన దేవత అయిన సరస్వతి ఇలా అంది. " అదేమిటి స్వామీ! అలా అంటారు. నేను మీ సరసనే ఉండి మీ కోరికలు అన్నీ తీరుస్తున్నాను కదా! మరి నా కంటే మనసు గొప్పది అని ఎలా అంటున్నారు?" అని అడిగింది.

దానికి బ్రహ్మదేవుడు ఇలా అన్నాడు. "ఓ వాగ్దేవీ! నాకు రెండు మనసులు ఉన్నాయి. ఒకటి స్థిరమైన మనసు. రెండవది చంచలమైన మనసు. స్థిరమైన మనసు నా దగ్గర ఉంటే, చంచల మైన మనసు నీ అధీనంలో ఉంది. చంచలమైన మనసు అంటే అక్షరము, మంత్రములు, వాక్కు(మాటలు). ఇవన్నీ నీ అధీనంలో ఉన్నాయి. ఇవన్నీ బయట ప్రపంచానికి సంబంధించినవి. వీటన్నిటి కంటే నీవే గొప్ప దానివి. కానీ, నీ కంటే నాలో ఉన్న స్థిర చిత్తము గొప్పది. అందుకని అలా అన్నాను." అని అన్నాడు బ్రహ్మదేవుడు.

వాక్కు ఎల్లప్పుడు ప్రాణము అపానము మధ్య ఉంటుంది. (గొంతులో నుండి గాలి బయటకు రావడం, లోపలకు పోవడం ద్వారా స్వరపేటిక స్పందించి వాక్కు రూపంలో నోటి నుండి బయటకు వస్తుంది). వాక్కుకు రూపం అంటూ లేదు. కాని వాక్ చాలా శక్తివంతమైనది. ఆ వాక్కు ద్వారానే శబ్దబ్రహ్మ స్వరూపాలైన వేదములు అవ్యయంగా నిలిచి ఉన్నాయి. కాబట్టి వాక్కుకు ముఖ్యం ప్రాణము. కాని ఎటువంటి వాక్కు నోటి నుండి బయటకు రావాలో నిర్ణయించేది మనస్సు. ఆ నిర్ణయములను విశ్లేషించేది బుద్ధి. ఈ వాక్కు రెండు రకాలు. వాయువు బయటకు వచ్చేటప్పుడు స్వరపేటిక స్పందించి బయటకు వినిపించే శబ్దము ఒకటి. ప్రాణ వాయువు లోపలకు తీసుకున్నప్పుడు మనసులో ఏర్పడే సంకల్పము కూడా వాక్కుతో సమానమే. కాకపోతే ఆ వాక్కుకు శబ్దం ఉండదు. నిశ్శబ్దంగా ఉంటుంది. మనసులో ఉంటుంది. అదే వాక్కు బయటకు వచ్చినపుడు శబ్దం సంతరించుకుంటుంది. ఈ రెండింటిలో నిశ్శబ్దంగా ఉండే వాక్కు శ్రేష్టమైనది.

(అందుకే ధ్యానంలో కూర్చుని మనసులోనే ఏదో ఒక మంత్రమును (అది గాయత్రికానీ, పంచాక్షరి, అష్టాక్షరి, ద్వాదశాక్షరి మంత్రములలో ఏదైనా ఒక మంత్రమును) జపించడం శ్రేష్టము అని అంటారు.)

గోవు ఎలాగైతే అమృతముతో సమానమైన పాలను ఇస్తుందో అలాగే ఈ నిశ్శబ్దమైన వాక్కు అంతులేని ఫలితములను ఇస్తుంది. సాధకులు ఈ నిశ్శబ్దమైన వాక్ శక్తితో (ధ్యాన సమాధిలో) పరమాత్మను తెలుసుకోగలరు. కాబట్టి ఈ రెండింటికి ఉన్న భేదమును తెలుసుకో గలిగితే వాటి విశిష్ఠత గురించి బాగా తెలుస్తుంది." అని పలికాడు ఆ బ్రాహ్మణుడు.

అప్పుడు ఆ బ్రాహ్మణ పత్ని తన భర్తతో ఇలా అంది. "నాథా! వాక్కుకన్నా మనస్సు గొప్పది అన్న బ్రహ్మ వాక్కులకు వాగ్దేవి ఎలా స్పందించింది. వివరంగా చెప్పండి" అని అడిగింది. అప్పుడు బ్రహ్మ వాగ్దేవితో ఇలా అన్నాడు.

"దేవీ! శరీరంలో ఉన్న ప్రాణ శక్తి ద్వారా వాక్కుపుడుతుంది. ఆ వాక్కు ఉచ్ఛ్వాస నిశ్వాసల రూపంలో ఉదానముగా మారి వ్యానముగా శరీరం అంతా నిండి ఉంటుంది. తరువాత సమాన వాయువు లో కలిసిపోతుంది. ఆ తరువాత వాక్కు శబ్దరూపంలో బయటకు వస్తుంది. కాబట్టి వాక్కు సంకల్పరూపంలో మనసులో స్థిరంగా ఉంటే, అది శబ్ద రూపంలో బయటకు వచ్చి అస్థిరంగా ఉంటుంది. కాని వేటికవే శ్రేష్టమైనవి."అని పలికాడు బ్రహ్మ.

తరువాత ఆ బ్రాహ్మణుడు తన భార్యకు పురాతనమైన కథ ఒకటి చెప్పాడు. "దేవీ! శరీరంలో ఉన్న ఐదు జ్ఞానేంద్రియములు అంటే కళ్లు, ముక్కు, నాలుక, చర్మము, చెవులు, ఇంకా మనసు, బుద్ధి ఇవి అన్నీ ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా వాటి వాటి సహజ లక్షణములను బట్టి వేటికవే పనిచేస్తుంటాయి. ఎలాగంటే ముక్కుపని చెవి చేయలేదు. కళ్లు చేసే చూచే పని చర్మము చేయలేదు. అలాగా ఏ ఇంద్రియమునకు ఆ ఇంద్రియము తన సహజ లక్షణమును బట్టి పనిచేస్తుంటుంది. ఎట్టి పరిస్థితులలోనూ ఒక దాని పని మరొకటి చేయదు, చేయడానికి ప్రయత్నించదు.

ఉదాహరణకు బయట కనపడే రంగులను గుర్తించి, కళ్లతో చూచి, వివిధములైన రంగుల గురించి తెలుసుకోవడం కంటి లక్షణం. అలాగే వివిధములైన వాసనలను ఆఘ్రాణించి తెలుసుకోవడం ముక్కుపని. అలాగే వివిధ రుచులను ఆస్వాదించడం నాలుక పని. చర్మం మీద పెడితే రుచి తెలయదు. కంటితో చూస్తే వాసన తెలియదు. అది శరీర నియమము. అలాగే ఒక విషయం గురించి తెలుసుకోవడం, ఆ విషయం గురించి సందేహించడం, ఆ సందేహము నివృత్తి చేసుకోవడం, ఇంద్రియములు తెలుసుకున్న విషయములను అంటే రంగు, రుచి, వాసన, శబ్దములను గ్రహించి వాటికి తగు సూచనలు ఇవ్వడం మనసు పని. అలాగే మనసు చేసే ఆలోచలను, సంకల్పములు అన్నింటినీ విశ్లేషించి, అంతకు ముందు తనలో భద్రపరచుకొన్న జ్ఞానముతో పోల్చి, తగు సూచనలు మనసు ఇవ్వడం బుద్ధి పని.

ఇంద్రియములు, మనసు, బుద్ధి వేటి కవి విడివిడిగా పనులు చేస్తున్నా, ఈ ఏడు ఒకదానితో ఒకటి సహకరించుకుంటూ పనిచేయకపోతే శరీర యాత్ర సక్రమంగా సాగదు. ఎలాగంటే ముక్కు మంచి వాసనను, చెడు వాసనలను సమానంగా గ్రహిస్తుంది. కాని అది మంచి వాసన ఆఘ్రాణించు, లేక చెడు వాసన ముక్కు మూసుకో లేకపోతే అక్కడి నుండి వెళ్లి పో అని సూచనలను ఇచ్చేది మనసు. అటాగే కంటికి ఇంపుగా ఉంటే వాటిని కళ్లు విప్పార్చి చూచి ఆనందించు, అలాగే ఎదురుగా మర్డర్ జరుగుతుంటే, నీకెందుకు పారిపో అని సూచనలు ఇచ్చేది మనసు. ఈ శరీర లోని ఇంద్రియముల యొక్కనియమముల గురించి ఆ ఇంద్రియములు చేయతగిన నిర్దిష్టమైన పనుల గురించి తెలుసుకొని ప్రవర్తించడం జ్ఞానము, అలా కాకుండా ఒక దాని పని మరొకటి ఎందుకు చేయదు అని వాదించడం అజ్ఞానము.

ఈ విధంగా జీవన యాత్ర జరగాల్సి ఉంటే, ఒక సారి మనసుకు, ఇంద్రియములకు మధ్య ఒక వివాదము వచ్చింది. మనసు ఇతర ఇంద్రియములతో ఇలా అంది. "మీరంతా నా ఆజ్ఞకు లోబడి పనిచేస్తున్నారు. నా ఆజ్ఞలేనిదే ముక్కు వాసన చూడలేదు. నాలుక రుచి చూడలేదు. కళ్లు వివిధ రూపములను, రంగులను తెలుసుకోలేవు. చర్మము దేనినీ తాక లేదు. స్పర్శసుఖమును అనుభవించలేదు. చెవులు ఏ శబ్దమూ వినలేవు. కాబట్టి మీ అందరికీ అధినేతను నేనే. నన్ను అతిక్రమించి మీరు ఏ పనీ చేయలేరు. నేను లేని శరీరము ప్రజలు లేని ఊరు లాంటిది. మంటలు లేని హోమగుండం లాంటిది. ప్రాణులకు అన్ని అవయవములు ఉన్నప్పటికినీ, మనసు లేనిదే ఆ అవయవములు ఏవీ పనిచేయవు. అవి ఉండి కూడా వృథానే!" అని గర్వంగా పలికింది మనసు.

ఈ మాటలు విన్న జ్ఞానేంద్రియములు మనసుతో ఇలా అన్నాయి. "ఓ మనసా! నీ ఆలోచనా విధానమును బట్టి, ఒక విధంగా నీవు చెప్పినది సరి అయినదే. కాని ఒక విషయం మరిచిపోతున్నావు. మేము చూడటం, వినడం, తాకడం, వాసన చూడటం, వినడం ఇవి చేసిన తరువాతనే నీవు వాటిని అనుభవించగలుగుతున్నావు. మేము ఆ పనులు చేయక పోతే నీవు వాటిని అనుభవించలేవు. కేవలము నీ సంకల్పములతో, ఆలోచనలతో చూడటం, వినడం, వాసన చూడటం మొదలగు బయట విషయములను గ్రహించలేవు. ఇంతెందుకు. మాలో ఏ ఒక్క ఇంద్రియము పనిచేయకపోయినా, నీవు ఆ ఇంద్రియము చేసే పనిని నీవు చేయలేవు, బయట ఉన్న పదార్థములను అనుభవించలేవు. నీ ఆధిపత్యముతో ఒక ఇంద్రియము చేసే పని మరొక ఇంద్రియముతో చేయించలేవు. (కళ్లు కనపడకపోతే, ఇతర ఇంద్రియములు అయిన ముక్కు, నాలుక, చర్మము, చెవి ఏవీ కళ్లు చేసే పని చేయలేవు. అలాగే కళ్లు చూడగలవే కానీ వినలేవు.) కాబట్టి మేము ముందు చూడటం, వినడం, తాకడం, వాసన చూడటం మొదలగు పనులు చేస్తేనే వాటిని నీవు అనుభవించగలుగుతున్నావు. నీవు మా ద్వారా అన్నింటినీ గ్రహించగలుగుతున్నావు. మేము లేకపోతే నీవు ఉండి కూడా ప్రయోజనము లేదు. నీవు మాకు బుద్ధి చెప్పడం ఎలా ఉందంటే, ఒక గురువు గారు, తన శిష్యుల దగ్గరకు పోయి అలా కాదు ఇలా చేయండి అని

చెప్పబోతే, ఆ శిష్యులు గురువుగారికి ధర్మబోధ చేస్తే, ఆ గురువుగారు నివ్వెరపోయాడట. అలా ఉంది నీ పరిస్థితి.

అంతే కాదు, నీవు లేకపోయినా, చూడటం, వినడం మొదలగు పనులు మేము చేయగలము. మా పనులతో నిన్ను ప్రేరేపించగలము. (మనసు తీవ్రమైన ఆందోళనకు గురయి నిస్తేజమైనపుడు, చక్కని సంగీతము వింటే, కంటికింపైన దృశ్యములు చూస్తే మనసు తిరిగి తన స్వస్థతను పొందడం మనకు అనుభవైకవేద్యము.). అంతేకాదు, మనసు లేకపోయినా ప్రాణులు బతక గలవు కానీ, ఇంద్రియములు అనగా కళ్లు, ముక్కు,చెవులు,చర్మము,నాలుక లేనిది ఏ ప్రాణీ బతకలేదు. కాబట్టి నీవు ఎందులోనూ గొప్ప కాదు. మేము చూపిస్తేనే, వింటేనే, తాకితేనే,వాసన చూస్తేనే, రుచి చూస్తేనే, వాటిని నీవు ఆస్వాదించగలవు. అంతే కానీ మేము లేకుండా నీవు ఏ పని చేయలేవు. అంతెందుకు, ముక్కుతో శ్వాస ఆడకపోతే, ఆ వ్యక్తి మరణిస్తాడు. మనసు లోపల పనిచేస్తున్నా, ఆ ప్రాణి మరణాన్ని ఆపలేదు. కాబట్టి ఏరకంగా చూచినా మనసు గొప్పకాదు " అని ఇంద్రియములు బదులు చెప్పాయి. అని ఆ బ్రాహ్మణుడు తన భార్యతో చెప్పాడు. ఇంకా ఇలా అన్నాడు.

"భార్యామణీ! ఈ సందర్భంలో నీకు మరొక కథ కూడా చెబుతాను సావధానంగా విను. ప్రతి ప్రాణి దేహంలో ఐదు వాయువులు లేక ప్రాణములు ఉన్నాయి. వాటి పేర్లు ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన. ఈ ఐదు ప్రాణములు ఒకదానితో ఒకటి సమన్వయపరచుకుంటూ తమ తమ కార్యకలాపాలు సాగిస్తుంటాయి. బయట ఉన్న గాలి ప్రాణవాయువుగా శరీరంలోపలికి ప్రవేశిస్తుంది. తరువాత అది అపాన వాయువుగా మారుతుంది. ప్రాణవాయువులోని ప్రాణ శక్తి వ్యానముగా మారుతుంది. ఆ వ్యానము ఉదానముగా మారి అన్ని అవయవములకు చేరుకుంటుంది. తరువాత ఆ ఉదానమే సమానముగా శరీరం అంతటా విస్తరించి శరీరమునకు శక్తిని కలుగజేస్తుంది. ఈ ప్రక్రియ అంతా పూర్తి అయిన తరువాత మిగిలిన మలినములు అపానముగా బయటకు విసర్జింపబడతాయి. ఇది నిరంతర ప్రక్రియ.

ఒక సారి ఈ ఐదు ప్రాణములు బ్రహ్మదేవుని వద్దకు పోయి మా ఐదుగురిలో ఎవరు గొప్ప. మాలో ఎవరు అధికుడు, మా నాయకుడు ఎవరు? అని అడిగారు. దానికి బ్రహ్మదేవుడు, మీలో ఏ ప్రాణము పని చేయడం ఆగిపోతే, మిగిలిన నాలుగు ప్రాణములు పనిచేయవో, ఏ ప్రాణము కదిలితే, మిగిలిన నాలుగు ప్రాణములు చైతన్యవంతమౌతాయో, ఆ ప్రాణమే గొప్ప అని అన్నాడు.

వెంటనే ప్రాణవాయువు లేచి "అది నేనే. నేనే గొప్ప. ఎందుకంటే నేను శ్వాస పీల్చడం ఆపితే ప్రాణవాయువును లోపలకు తీసుకోకుంటే, మిగిలిన ప్రాణములు పనిచేయలేవు. నేనే కదిలితేనే గానీ మిగిలిన వాయువులు కదలలేవు. కాబట్టి నేనే అందరికన్నా గొప్ప. ఇప్పుడు చూడండి. నేను పనిచేయడం మానేస్తున్నాను" అని ప్రకటించింది.

ప్రాణ వాయువు పని చేయడం ఆగి పోయింది. అప్పుడు ఉదాన, సమాన వాయువులు ఇలా అన్నాయి. "ఓ ప్రాణవాయువా! అపాన వాయువు మాత్రమే నీ అధీనంలో ఉంటుంది. మేము శరీరం అంతటా వ్యాపించి ఉంటాము. నీకూ మాకు సంబంధములేదు. నీ గొప్పదనాన్ని మేము అంగీకరించము. ఎందుకంటే మేము వ్యాపించినట్టు, నీవు శరీరం అంతటా వ్యాపించలేవు." అనిపలికాయి.

అప్పుడు అపాన వాయువు ఇలా అంది. "ఇదిగో చూడండి. నేను అందరి కంటే గొప్ప. నేను పనిచేయకపోతే మీరు మీమీ పనులు సక్రమంగా చేయలేరు. నేను పనిచేయకపోతే జీవన ప్రక్రియ ఆగిపోతుంది. నేను బయటకు పోతే మిగిలిన ప్రాణములు అన్నీ శరీరాన్ని విడిచిపెట్టవలసిందే. ఆ కారణంగా నేనే గొప్ప" అని పలికింది. ఆ మాటలు విన్న వ్యాన, ఉదాన వాయువులు "అదేం కాదు. నీవు, ప్రాణ వాయువు ఒకే పరిధిలో ఉన్నాయి. మాకూ మీకు సంబంధము లేదు. మీ గొప్పదనాన్ని మేము అంగీకరించము." అని అన్నాయి. వ్యాన ము ఇంకా ఇలా అంది. "నేనే అందరికంటే గొప్ప. మీ నలుగురు లేకపోయినా నేను ఒక్కదాన్నే జీవన ప్రక్రియ నడపగలను. నేనే శరీరంలో లేకపోతే నేను శరీరం విడిచిపెడితే, ప్రాణుల జీవనప్రక్రియ ఒక్క క్షణం కూడా నడవదు." అని వ్యానము పలికింది.

వీళ్ల వాద సంవాదములు ప్రతి వాదములు విన్న బ్రహ్మగారు, "మీరంతా ఊరుకోండి. మీలో ఎవరూ గొప్ప కాదు, ఎవరూ అధములు కాదు. మీరంతా సమానమే. మీరు ప్రాణవాయువులు. మీలో ప్రతి ఒక్కరు ఒక్కొక్క విశిష్టమైన శక్తి కలిగి ఉన్నారు. మీరందరూ కలిసి పనిచేస్తేనే శరీరం నడుస్తుంది. మీలో ఏ ఒక్కరు పనిచేయకపోయినా జీవన క్రియ నడవదు. కాబట్టి మీరు ఐదుగురూ సమన్వయంతో, సంఘీభావంతో, స్నేహ భావంతో కలిసి పనిచేయండి." అని పలికాడు బ్రహ్మ. అని చెప్పిన బ్రాహ్మణుడు తన భార్యతో ఇంకా ఇలా అన్నాడు.

"భార్యామణీ! ఈ సందర్భంలో నీకు, నారద మహర్షికి, దేవమతుడు అనే ఋషికి జరిగిన సంవాదము వివరిస్తాను. శ్రద్ధగా విను. దేవమతుడు నారదుని ఇలా అడిగాడు. "ఓ దేవ ఋషీ! శరీరములో ఐదు ప్రాణములు అంటే ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన ప్రాణములు ఉన్నాయని అంటారు కదా! ప్రాణి పుట్టగానే అన్నింటికంటే ముందు ఏ ప్రాణము శరీరములో ప్రవేశిస్తుంది." అని అడిగాడు. ఆ ప్రశ్నకు నారదుడు ఈ విధంగా సమాధానం ఇచ్చాడు.

"ప్రాణి పుట్టగానే బయట నుండి ప్రాణము లోపల ప్రవేశిస్తుంది. ప్రాణ వాయువులు జంటలుగా ఉంటాయి. అవి శరీరములో పైకి కిందికి ఆడుతుంటాయి. అంటే ఒకదానికి ఒకటి వ్యతిరేక దిశలో సంచరిస్తుంటాయి." అని చెప్పగానే దేవమతుడు మరలా ఇలా అడిగాడు.

"నారదా! ఈ ఐదు వాయువులలో దేని వలన ప్రాణి జన్మిస్తుంది. ఏ ప్రాణ వాయువు ముందుగా శరీరంలో ప్రవేశిస్తుంది. ఏయే ప్రాణ వాయువులు జంటగా పైకి కిందికి, అంటే వాటి వ్యతిరేక దిశలో సంచరిస్తుంటాయి." అని అడిగాడు. దానికి నారదుడు ఈ విధంగా సమాధానం ఇచ్చాడు. "సంకల్పములో నుండి సుఖము పుడుతుంది. ఆ సుఖము మంచి శబ్దము వినడం వలనా, మంచి రంగులు, వస్తువులు చూడటం వలనా, వాటిని తాకడం వలనా, వాటిని వాసన చూడటం వలనా, మంచి పదార&థములు రుచి చూడటం వలనా, సుఖం లభిస్తుంది. పురుషుడిలోపల ఉన్న ప్రాణ శక్తి వీర్యము రూపంలో స్త్రీలో ఉన్న శోణితములో ప్రవేశిస్తుంది. అవి రెండూ కలిసి గట్టిపడి అండముగా రూపొందుతాయి. వీర్య రూపములో అండములో ప్రవేశించిన ప్రాణశక్తి అపానముగా రూపాంతరం చెందుతుంది. అప్పుడు ప్రాణము కిందికి అపానము పైకి ఆడటం మొదలవుతుంది. ఈ చర్యవలన అగ్ని పుడుతుంది. ఆ అగ్నితో నిండిన వ్యాన, ఉదాన, సమాన వాయువులు అంతటా ప్రసరిస్తాయి. ఇది ఎలాగంటే, వీర్యము స్త్రీలోకి విడుదల అయ్యేటప్పుడు అపరిమితమైన సుఖం కలుగుతుంది. ఈ సుఖాన్ని కలిగించే ప్రాణశక్తి అండములో ఉదానముగా రూపాంతరం చెందుతుంది. స్త్రీ పురుషులు ఒకరితో ఒకరు కలవాలి అనే కోరిక ముందు పుడుతుంది. ఆ కోరికకు అనుగుణంగా పురుషుడి రక్తములో నుండి వీర్యము ఉత్పత్తి అవుతుంది. స్త్రీపురుషుల కలయిక వలన సుఖం లభిస్తుంది. పురుషుడిలో స్త్రీలో ఉన్న వ్యాన ఉదాన ప్రాణములు, శుక్ర శోణితముల కలయికకు దోహద పడతాయి. శుక్ర శోణితముల కలయికతో ప్రాణ అపానములు అండములో ప్రవేశించి వ్యతిరేక దిశలో సంచరిస్తుంటాయి. అలాగే వ్యాన ఉదానములు కూడా స్త్రీ పురుషుల శరీరములలో నుండి అండములో ప్రవేశిస్తాయి. వ్యతిరేక దిశలలో సంచరిస్తుంటాయి. వీటి సంచారము వలన అగ్ని పుడుతుంది. ఆ అగ్ని సమానప్రాణముగా అంతటా సంచరిస్తుంది.

ఈ అగ్ని అన్ని దేవతలకు మూలము. ఈ విషయములన్నీ వేదములలో చెప్పబడ్డాయి. జ్ఞానము వలన లభించే అగ్నిని జ్ఞానాగ్ని అని అంటారు. ఈ అగ్ని ఉదాన ప్రాణము అని అంటారు. ఆ జ్ఞానాగ్ని బ్రాహ్మణునిలో బుద్ధిద్వారా ప్రవేశిస్తుంది. అగ్ని వెంట పొగ ఉన్నట్టే, జ్ఞానాగ్ని వెంట అజ్ఞానము అనే పొగ కూడా ప్రవేశిస్తుంది. ఈ అజ్ఞానము అనే పొగనే వ్యామోహము అని కూడా అంటారు. ఈ జ్ఞానాగ్నిలో నిరంతరము శాస్త్రజ్ఞానము అనే ఆహుతులు వేయడం వలన వృద్ధిచెందుతూ ఉంటుంది. యజ్ఞయాగాదులు చేసే వారు వారిలోని మంచితనము, సాత్వికత వలన వ్యాన, సమాన వాయువులు వృద్ధిచెందుతాయి అని తెలుసుకుంటారు. ప్రాణ అపాన వాయువులు పైకి కిందికి సంచరిస్తూ శరీర వ్యాపారములు నిర్వహిస్తుంటాయి. ఈ ప్రాణ అపానములు ద్వంద్వములు. సాధారణంగా సుఖదు:ఖాలు, లాభనష్టాలు, మేలు కీడు, జయాపజయాలు, సత్ అసత్ అంటే ఉన్నది లేదు, సత్యము అసత్యము ఇవి అన్నీ కూడా పైన చెప్పబడిన ప్రాణము అపానము వంటివే. ఈ రెండింటి మధ్య సంచరించే అగ్ని పేరే ఉదానము. ఈ ఉదానమునకు అగ్ని తత్త్వము, వాయు తత్త్వము కలిసి ఉంటాయి. ఈ విషయాన్ని ఆత్మతత్త్వమును తెలిసిన వాడే గ్రహించగలడు. దీనినే బ్రహ్మము అని, పరమ శాంతి అని కూడా అంటారు. ఈ ఉదాన తత్వము తెలిసి సంచరించే వాడికి నిరంతర శాంతి లభిస్తుంది.

(సుఖ దు:ఖముల మధ్య ఒక బిందువు ఉంటుంది. అటు సుఖము కాదు ఇటు దు:ఖము కాదు. సమాన స్థితి. అలాగే ప్రాణాయామము చేసే టప్పుడు గాలి పీల్చి కొంచెము సేపు నిలిపి వదులుతాము. అలా నిరంతరం ప్రాణాయామము చేస్తే ప్రాణ అపానముల మధ్య ఉన్న సమాన స్థితికి చేరుకుంటాము. అదే పరమ శాంత స్థితి.)

ఈ స్థితిని గురించి తెలియాలంటే ఇంద్రియములు, మనస్సు, ఐదు ప్రాణములు వీటి గురించి సమగ్రమైన అవగాహన ఉండాలి. అప్పుడు ఈ మహత్తరమైన సమాన స్థితి గురించి తెలుస్తుంది. ఓ లలనా! ఈ సందర్భంలో నీకు చాతుర్హోత్ర యజ్ఞము గురించి తెలియజేస్తాను. కరణం, కర్త, కర్మ, ముక్తి ఈ నాలుగింటిని సమ్మేళనము చేసి చేసేదే ఈ చాతుర్హోత్ర యజ్ఞము. ఈ ప్రపంచం అంతా ఈ నాలుగింటిలోనే ఇమిడి ఉంది. ఏ పని చేయడాని కైనా బుద్ధి, మనసు, జ్ఞానేంద్రియములు ఉపకరణములు అంటే పని చేయడానికి సాధనములు. తరువాత ఆ పని చేయడానికి ఒక కర్త ఉండాలి. అతడే లోపల ఉన్న జీవాత్మ. మనస్సుతో సంకల్పించిన వాటిని ఇంద్రియముల సాయంతో చేయడమే కర్మలు. ఈ కర్మలు చేయడానికి శ్రద్ధ, నియమము, నిష్ట అవసరము. ఈ కర్మలు ఏదో ఒక ఫలితాన్ని ఇస్తాయి. వీటి నుండి విముక్తి పొందడమే మోక్షము. ఈ లోకమంతా ఈ నాలుగింటి మధ్యనే తిరుగుతూ ఉంటుంది.

కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మము ఇంకా మనసు, బుద్ధి ఈ ఏడు కరణములు అంటే కర్మలు చేయడానికి సాధనములు. ఈ సాధనములు అంటే కరణముల తో, లోపల ఉన్న కర్త అంటే జీవుడు, బయట ఉన్న వస్తువులను చూడటం, శబ్దములు వినడం, వాసన చూడటం, రుచి చూడటం, స్పర్శ సుఖం అనుభవించడం, ఆలోచించడం, సంకల్పించడం అనే కర్మలను నిరంతరం చేస్తుంటాడు. అంటే చూచేవాడు, వినేవాడు, రుచి చూచేవాడు, స్పర్శ సుఖం అనుభవించేవాడు, వివిధ వాసనలను ఆఘ్రాణించేవాడు, సంకల్పించేవాడు, ఆలోచించేవాడు ఇవన్నీ చేసేవాడు లోపల ఉన్న జీవాత్మ అంటే జీవుడు. వాడే కర్త. ఈ కర్త తన ఇష్టం వచ్చిన కర్మలను, ఇష్టం లేని కర్మలను నిరంతరం చేస్తూనే ఉంటాడు. వాటి ఫలములను అనుభవిస్తుంటాడు. కాని లోపల ఉన్న ఆత్మ ను ఇవన్నీ అంటవు. కేవలం సాక్షీభూతంగా చూస్తుంటాడు.

ఇది ఎలాగంటే, కన్ను మొదలగు సాధనముల ద్వారా, చూడటం మొదలగు కర్మలను చేసే జీవుడు అన్నీ తానే చేస్తున్నట్టు, ఆ ఫలములను తానే అనుభవిస్తున్నట్టు భ్రమచెందుతుంటాడు. అంటే ఈ శరీరమే తాను అనే దేహాభిమానము కలిగి ఉంటాడు. ఈ దేహాభిమానము కలిగిన ఆత్మ జీవాత్మగా రూపాంతరం చెంది అన్నీ తానే చేస్తున్నట్టు భ్రమలో ఉంటుంది. జ్ఞానము కలిగిన జీవుడు, తాను వేరు ఈ శరీరము వేరు అని తలుస్తాడు. దేహాభిమానము వదిలిపెడతాడు. ఈ సాధనములతో చేసే కర్మలను వాటి ఫలితములను అత్యంత శ్రద్ధతో, నిష్ఠతో తాను ఆర్జించిన జ్ఞానము అనే అగ్నిలో సమిధలుగా వేస్తాడు. అప్పుడు అతనిలో ఉన్న అవిద్య తొలగిపోతుంది. జీవాత్మ

ఆత్మస్వరూపంగా ప్రకాశిస్తాడు. దానినే మోక్షము అని అంటారు. అలా కాకుండా తానే అన్నింటికీ భోక్తను అంటే అనుభవించేవాడిని అనే భ్రమలో ఉంటే, ఆ భావన అనేకములైన బంధనములు కలిగిస్తుంది. కర్మలఫలములను వదిలిపెట్టడమే ఈ యజ్ఞములో ఋత్విక్కులకు ఇచ్చే దక్షిణ. ఈ యజ్ఞము చేస్తే పరమాత్మ సంతోషిస్తాడు. జీవుడిని అనుగ్రహిస్తాడు. దానినే మోక్షము అని అంటారు.

మానవుడు భవబంధాలను తెంచుకొని ముక్తిని పొందాలన్నా లేక ప్రాపంచిక విషయ వాంఛలలో మునిగి తేలుతూ, జన్మ వెంట జన్మ ఎత్తాలన్నా, ఈ ఏడు కారణములు. జ్ఞాని అయిన వాడు ఈ ఏడింటినీ తన ఆత్మలో హోమం చేసి వాటి ఫలితములను వదిలిపెట్టి, ముక్తిని పొందుతాడు. అలా కాకుండా అజ్ఞానములో మునిగి తేలేవాడు, నేనే ఈ శరీరము, ఈ శరీరమే నేను అనే దేహాభిమానమును విపరీతంగా పెంచుకుంటాడు. తినకూడని పదార్థములను ఇష్టంగా తింటాడు. తాగకూడని పానీయములను(మత్తులో మునిగి పోవడానికి) ఇష్టంగా తాగుతాడు. వినకూడని మాటలు ఇష్టంగా వింటూ ఉంటాడు. తాకకూడని వాటిని, తాకకూడని మనుషులను తాకుతూ స్పర్శసుఖం అనుభవిస్తుంటాడు. దుర్వాసనల మీద మోజు పెంచుకుంటాడు. ఎల్లప్పుడూ మనసుతో ఇతరులకు హాని కలిగించే సంకల్పములను చేస్తుంటాడు. అతని బుద్ధి కూడా వాటికి అనుగుణంగానే నడుచుకుంటూ ఉంటుంది. తుదకు అధ:పతనం చెందుతాడు.

సాధకుడు తాను చేసే ఆలోచనలను,సంకల్పములను, తాను చూచేవాటిని, వినే వాటిని, రుచి చూచేవాటిని, వాసన చూచే వాటిని, స్పర్శించేవాటిని, తన అనుభవాలు కాదు అనే భావనతో ఉంటాడు. ఈ ఏడింటినీ లోపల ఉన్న ఆత్మకు అర్పిస్తాడు. ఆత్మలో హోమం చేస్తాడు. తాను నిర్మలంగా దేనికీ అంటుకోకుండా ఉంటాడు. నిరంతరం ఆత్మానందాన్ని అనుభవిస్తుంటాడు. దీనినే యోగము అని అంటారు. (గీతలో చెప్పబడిన ఆత్మసంయమ యోగము ఇటువంటిదే).

ఓ భార్యామణీ! అటువంటి యోగమునే నేను అభ్యాసము చేస్తున్నాను. నాలో ఉన్న జ్ఞానాగ్నిలో నేను చేసే కర్మలను, కర్మఫలములను హోమం చేస్తున్నాను. ఈ యజ్ఞములో నాలో ఉన్న ప్రాణవాయువు స్తోత్రములు. అపానము శాస్త్రము. కర్మఫలములను త్యాగం చేయడం అనేది ఈ యజ్ఞములో నేను ఋత్విక్కులకు ఇచ్చే దక్షిణ. నాలో ఉన్న బుద్ధి, మనసు, వివేచనా శక్తి ఇవే యజ్ఞమునకు హోత, ఉద్గాత, అధ్వర్యువు. పూర్వకాలంలో చేసినట్టు యజ్ఞములలో పశువులను చంపనవసరం లేదు. తాను చేసిన కర్మలను, కర్మఫలములను ఆత్మార్పణం చేస్తే చాలు. అదే మానసిక యజ్ఞము. ఈ యజ్ఞమునకు ఎటువంటి సంభారములు, ద్రవ్యము, పశువధ అవసరం లేదు. పరమాత్మ స్వరూపుడైన నారాయణుడు అన్ని జీవులలో ఆత్మస్వరూపుడుగా వెలుగుతున్నాడు అని తెలుసుకో.

మరొక విషయం కూడా చెబుతాను. అన్నిలోకాలకు శాసనం చేసేవాడు ఒక్కడే. అతనికి సమానమైన వాడు, ఆయనను మించిన వాడు మరొకడు లేదు. ఆయన ఎక్కడో లేడు. అందరి హృదయాలలో ఆత్మ స్వరూపుడుగా తిష్టవేసుకొని ఉన్నాడు. నీరు ఎల్లప్పుడూ దిగువకు పారినట్టు, నేను ఆయన చూపిన మార్గమునే ఎల్లప్పుడూ అనుసరిస్తాను. మూడులోకములకు గురువు ఒక్కడే. ఆయనను మించిన వాడు లేదు. ఆయనే అందరి హృదయములలో ఉన్నాడు. నేను ఆ గురువు చెప్పిన మార్గమును అనుసరిస్తాను.

అంతే కాదు నీకు శత్రువు కూడా నీ మనస్సు. నీ మనస్సును మించిన శత్రువు మరొకడు లేడు. నీ మనసులో, బుద్ధిలో పుట్టే దుష్ట ఆలోచనలకు, దుష్టసంకల్పములకు నీ అహంకారమే కారకుడు. పాములకు ఆత్మరక్షణార్ధము కోపము, ద్వేషము సహజ లక్షణంగా పెట్టాడు పరమాత్మ. కాని పాముల లక్షణాలు మానవులు అలవరచుకొని అధఃపతనం చెందుతున్నారు. కాబట్టి లోపల ఉన్న ఆత్మ చెప్పినట్టు నడుచుకోవడమే మన కర్తవ్యము. మంచి మార్గంలో నడుస్తావో, చెడు మార్గంలో నడుస్తావో నీ ఇష్టం. ఈ సందర్భంలో నీకు మరొక కథ వినిపిస్తాను.

ఒక సారి దేవతలు, మునులు, పాములు కలిసి బ్రహ్మగారి వద్దకు వెళ్లారు. ఆయనను ఈ కింది విధంగా అడిగాయి. “ఓ బ్రహ్మదేవా! మాకందరికీ శ్రేయస్సుకలిగే మార్గము ఉపదేశించండి.” అని అడిగారు. దానికి బ్రహ్మదేవుడు “పరమాత్మ స్వరూపమైన ఓం కారము మాత్రమే అందరికీ శ్రేయోదాయకము” అని బదులు చెప్పాడు. బ్రహ్మచేత ఉపదేశము పొందిన వారందరూ తలొక దిక్కుగా వెళ్లిపోయారు. ముందుగా పాములు తమ సహజ లక్షణంతో అందరినీ కాటు వేసి చంపనారంభించాయి. అదేవిధంగా దానవులలో గర్వం ప్రబలిపోయింది. తమకు ఏ లోకంలో కూడా ఎదురు లేదని విర్రవీగసాగారు. దేవతా గణములు మానవులచేత పూజలందుకుంటూ వారికి వరాలు ఇస్తూ, వారి కోరికలు తీరుస్తూ తామే అందరికంటే అధికులము అని గర్వించారు. ఋషులు తమ ఇంద్రియములను, మనసును నిగ్రహించి, తపస్సు చేసుకోవడంలో మునిగి పోయారు.

వీరందరూ ఒకే గురువు (బ్రహ్మ) దగ్గరకు వెళ్లారు. ఒకే అక్షరాన్ని అంటే ఓం కారమును ఉపదేశము పొందారు. కాని తమ తమసహజ లక్షణములను అనుసరించి వారి జీవన విధానము వేరు వేరుగా ఉంది. కాబట్టి లోపల ఉన్న ఆత్మను మించిన గురువు లేడు. అందరూ తమతమ ఆత్మప్రబోధమును అనుసరించి నడుచుకోవలసిందే. తాను ఏ విధంగా నడుచుకోవాలో ఆ స్వేచ్ఛను పరమాత్మ ప్రతి జీవికీ ఇచ్చాడు. పాపపు పనులు చేస్తే వాడు పాపాత్ముడు అవుతాడు. వాడి జీవాత్మ పాపపు ఆలోచనలతో నిండి పోతుంది. వాడు ఎల్లప్పుడూ పాపపు పనులు చేయడానికే ఇష్టపడతాడు. ఆ విధంగానే పుణ్యకార్యములు చేసిన వాడు పుణ్యాత్ముడు అవుతాడు. అతని ఆత్మ అంతా పుణ్యపు ఆలోచనలతో నిండి పోతుంది. ఇంకొందరికి ఒక లక్ష్యం అంటూ ఉండదు. ఎటుబడితే అటు

పోతుంటారు.చేయకూడని పనులు చేస్తుంటారు. తినకూడనివి తింటుంటారు. తాగకూడనివి తాగుతుంటారు. అటువంటి వారికి కోరికలు మెండుగా ఉంటాయి. ఇంద్రియసుఖములు అనుభవించడానికి అలవాటు పడతారు. ఆ సుఖాల కోసం ఎటువంటి చేయకూడని పనులు చేయడానికి వెనుకాడరు.

బ్రహ్మచర్యమును అవలంబించిన సాధకుడు తన ఇంద్రియములను తన మనసును తన స్వాధీనంలో ఉంచుకుంటాడు. అతడు బయట ప్రపంచములో విహరిస్తున్నా దేనికీ అంటకుండా ఉంటాడు. తన మనసును ఎల్లప్పుడూ పరమాత్మయందు లగ్నం చేస్తాడు. అతడికి ఈ లోకం అంతా పరమాత్మ స్వరూపంగా కనిపిస్తుంది. తుదకు తానే బ్రహ్మస్వరూపము అనే స్థితికి చేరుకుంటాడు. (అహం బ్రహ్మోస్మి) అతడే నిజమైన బ్రహ్మచారి అంటే నిరంతరం బ్రహ్మలో చరించేవాడు. బ్రహ్మచర్యమును ఈ విధంగా అర్థం చేసుకోవడం కేవలం జ్ఞానులకు మాత్రమే సాధ్యం అవుతుంది. అటువంటి జ్ఞానికి, తనలో ఉన్న ఆత్మస్వరూపుడైన పరమాత్మయే నిజమైన గురువు. అతడు తనలో ఉన్న క్షేత్రజ్ఞుడి ప్రబోధము ప్రకారము మాత్రమే నడుచుకుంటాడు. ప్రాపంచిక విషయములు, విషయ వాంఛలు అతడిని ఏ విధంగా కూడా ప్రలోభపెట్టలేవు.

ఓ భార్యామణీ! నేను కూడా ప్రస్తుతము ఆ స్థితిలోకి ప్రవేశించాను. ఈ ప్రాపంచిక విషయములను, విషయ వాంఛలను దాటాను. ఈ ప్రపంచములో ఉండే సుఖ దు:ఖములు అనే శీతోష్ణములను, , క్రోధ లోభములు అనే బందిపోటు దొంగలను,  మదమాత్సర్యములు అనే పాములను, ధనము అనే మార్గములో కలిగే ప్రమాదములను, వీటన్నింటినీ దాటుకొని ఒక అడవిలోకి ప్రవేశించాను.  ఆ అడవి చాలా ప్రశాంతంగా ఉంది. చాలా ప్రకాశవంతంగా ఉంది. ఆ అడవి ఎక్కడో లేదు. నాలోనే ఉంది. నా హృదయంలోనే ఉంది. దాని కన్నా పెద్దది, దాని కన్నా చిన్నది మరొకటి లేదు అని తెలుసుకున్నాను. ఆ అడవిలో దొరికే ఆనందంతో సమానమైన ఆనందము, దాని కంటే మించిన ఆనందం మరొకటి లేదు. ఆ అడవిలోకి ప్రవేశించిన సాధకుడు సుఖదు:ఖములకు అతీతంగా ఉంటాడు. అక్కడ అతడికి ఏ జంతువు వలన ఎటువంటి భయము ఉండదు. అలాగే అతని వలన ఆ అడవిలో ఉన్న జంతువులకు కూడా ఎటువంటి భయము ఉండదు.

ఈ అడవిలో ఏడు పెద్ద చెట్లు ఉన్నాయి. (జ్ఞానేంద్రియములు ఐదు, మనస్సు, బుద్ధి). ఏడు ఫలములు ఉన్నాయి. ( ఇంద్రియములు చేసే కర్మల వలన కలిగే సుఖదు:ఖాలు, జయాపజయాలు మొదలగు ఫలితములు).  ఏడు ఆశ్రమాలు ఉన్నాయి.(ఈ ఆశ్రమాలలోనే ఇంద్రియములు, వాటి శక్తులు ఆశ్రయాన్ని పొందుతుంటాయి.) ఏడుగురు అతిథులు ఉన్నారు.(ఈ అతిథులు అనగా ఇంద్రియముల వెనక ఉన్న  శక్తులు, చూచే శక్తి, వినే శక్తి మొదలైనవి).  ఏడు యోగములు ఉన్నాయి.(అంటే ఇంద్రియములను, మనస్సును, బుద్ధిని నియంత్రించడం).  ఏడు

విధములైన ఉపదేశములు ఉన్నాయి(అంటే ఇంద్రియ వ్యాపారముల నుండి, మనస్సు బుద్ధితో చేసే సంకల్పముల నుండి విడివడి, నివృత్తి మార్గంలోకి అడుగుపెట్టడం). ఇదీ ఆ అడవి యొక్క వర్ణన.

ఆ అడవినిండా రెండు రకములైన చెట్లు ఉన్నాయి. ఆ రెండు రకములైన చెట్లకు ఐదు రంగులు ఉన్న పూలు, ఫలములు కాస్తాయి. ఆ ఐదు రంగుల పుష్పములు, ఫలములు చాలా ప్రకాశవంతంగా ఉంటాయి. ఆ పూలు, పండ్లు మంచి సువాసనలను వెదజల్లుతుంటాయి. అంతే కాకుండా, ఆ రెండు రకములైన చెట్లకు కాచే పూలు, పండ్లు కనపడని అనేక రంగులు, వాసనలు కలిగి ఉంటాయి. ఐదు జ్ఞానేంద్రియముల వలన చేసే కర్మలు, వాటిఫలములే పైన చెప్పిన ఐదు రంగుల పూలు, పండ్లు. లోపల ఉన్న జీవాత్మ ఈ పూలను, పండ్లను అనుభవిస్తుంటాడు.

ఆ అడవిలో హెూమాగ్ని ఉంది. అదే మంచి మనసు. ఆ మంచి మనసు, లోపల ఉన్న పరమాత్మ స్వరూపము అయిన ఆత్మతో అనుసంధానము అయి ఉంటుంది., సాధకుని జ్ఞానేంద్రియాలు(కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మము) ఆ హెూమములో వేసే సమిధలు. ఏడు విధములైన ఉపదేశములను పొందడం ద్వారా, ఇంద్రియముల నుండి విముక్తి పొందవచ్చును.

ధ్యానము చేయడం ద్వారా ఈ అడవిని దాటి, మరొక అడవిలోకి ప్రవేశించాను. ఆ అడవిలో ఉన్న చెట్టు పేరు బుద్ధి. దానికి ముక్తి అనే ఫలం కాస్తుంది. ప్రశాంతతయే ఆ చెట్టు ఇచ్చే నీడ. ఆ చెట్టు దగ్గర జ్ఞానము అనే అతిథి గృహము కూడా ఉంది. ఆ చెట్టుకు తృప్తి అనే నీరుపోసి పెంచుతాము. ఆ అడవిలో క్షేత్రజ్ఞుడు అనే సూర్యుడు ప్రకాశిస్తుంటాడు. ఆ అడవి ఆది అంతము లేనిది. ఆ అడవిలో ఏడుగురు మహాఋషులు తపస్సు చేసుకుంటూ ఉంటారు. వారందరిలోకి వసిష్ఠుడు అగ్రగణ్యుడు. కీర్తి, మహత్తు, ప్రకాశము, గొప్పదనము, జ్ఞానము, విజయము, శక్తి, స్థిరత్వము అనే గుణములు, సూర్యుని నుండి కిరణములు వెలువడినట్టు, ఆ ఏడుగురు ఋషులనుండి వెలువడుతుంటాయి.

ఆ అరణ్యంలో కొండలు, పర్వతములు ఉన్నాయి. ఆ కొండల కోనలలోనుండి నదులు, సెలయేళ్లు ప్రవహిస్తుంటాయి. ఆ ప్రశాంత వాతావరణంలో ఋషులు యజ్ఞములు చేస్తుంటారు. వారు చేసే యజ్ఞములు లోక కల్యాణార్థము, తమను తాము ఉద్ధరించుకోడానికి మోక్షం పొందడానికి చేస్తుంటారు. వారిలో కోరికలు, ఆశలు, ప్రాపంచిక విషయముల మీద అనురక్తి అనేవి ఉండవు. ఒక వేళ ఉన్నా వారు చేసే యజ్ఞముల హెూమాగ్నిలో పడి భస్మం అయి పోతాయి. ఆ ఋషులు తమ మనసులను ఆత్మయందు లగ్నం చేసి, మోక్షం కొరకు ప్రయత్నం చేస్తుంటారు. ఈ అడవి గురించి తెలిసిన వారికి ప్రశాంతత ఏమిటో, అది ఎలా ఉంటుందో అర్థం అవుతుంది. ఆ అడవి గురించి బ్రహ్మజ్ఞానము తెలిసిన వారు మాత్రమే తెలుసుకోగలరు. సాధకులు బాహ్యప్రపంచములో విహరిస్తున్నా, మానసికంగా ఇటువంటి అడవిలో ఉండటానికి ఇష్టపడతారు. ఇది సాధకునిలో

ఉన్న క్షేత్రజ్ఞుని ఆజ్ఞానుసారం జరుగుతూ ఉంటుంది.

నేను కూడా అదేవిధంగా ప్రవర్తిస్తాను. శరీర సహజ ధర్మాలను బట్టి ప్రవర్తిస్తాను కాని నాకుగా నేను ఏమీ చేయను. మంచి వాసన వస్తే చూస్తాను. ఏది దొరికితే అది తింటాను. ఏది కనపడితే దానిని చూస్తాను. అంతే కానీ ఇది నాకు కావాలి అది నాకు వద్దు అనే భావన నాలో లేదు. నేను ఈ ప్రపంచములో విహరిస్తున్నా, గృహస్థధర్మాలను నిర్వర్తిస్తున్నా, కేవలం ప్రకృతి ధర్మం ప్రకారము, నా శరీర ధర్మం ప్రకారము తామరాకు మీద నీటి బొట్టు మాదిరి ప్రవర్తిస్తాను.

సాధారణంగా ప్రాణులు వాటి వాటి సహజ లక్షణములను బట్టి ప్రవర్తిస్తూ ఉంటాయి. ఆ సహజ లక్షణములు ప్రాణములు దేహములో ప్రవేశించినపుడు ప్రాణులలో ప్రవేశిస్తాయి. ప్రాణుల జీవిత కాలం అంతా వాటిని అంటిపెట్టుకొని ఉంటాయి. ఈ విషయాలను తెలుసుకున్న యోగి, ప్రాపంచిక విషయములకు అంటుకోకుండా, తన సహజ లక్షణములను బట్టి ప్రవర్తిస్తుంటాడు. యోగి అనబడే వాడికి కోరికలు కానీ, ఆ కోరికలు తీరకపోతే వచ్చే కోపం కాని ఉండవు. ఎల్లప్పుడూ నిర్మలంగా ఉంటాడు. మృత్యువుకు భయపడడు. మృత్యువును సంతోషంగా ఆహ్వానిస్తాడు. మృత్యువు కూడా శరీర పరిణామము అని భావిస్తాడు. తన జీవిత కాలంలో ఏ కోరికా లేకుండా, దేనికీ అంటుకోకుండా, నిర్లిప్తంగా, నిర్వికారంగా, రాగద్వేషములు లేకుండా, తన సహజ లక్షణములతో జీవిస్తాడు. సూర్యకిరణములు నిరంతరం ఆకాశంలో ఉంటూనే, ఆకాశానికి ఎలా అంటుకోవో, అలాగే యోగి కూడా ఈ బాహ్యప్రపంచంలో తన సహజ లక్షణములతో విహరిస్తూనే, తాను చేసే కర్మలకు, ఆ కర్మల వలన వచ్చే ఫలములకు అంటుకోడు.

ఈ సందర్భంలో నీకు మరొక ఉదంతము వివరిస్తాను. ఒకసారి ఒక యతీంద్రునికి, ఒక యజ్ఞము చేసే అధ్వర్యువుకు ఒక సంవాదము జరిగింది. యజ్ఞంలో భాగంగా అధ్వర్యువు ఒక మేకను బలి ఇవ్వడానికి, మేకను సిద్ధం చేస్తున్నాడు. మేక మీద మంత్రజలం ప్రోక్షణ చేసాడు. ఆ సమయంలో ఒక యతి అక్కడకు వచ్చాడు. యజ్ఞంలో మేకను బలి ఇవ్వడం చూచాడు. అధ్వర్యువుతో ఇలా అన్నాడు. “మేకను బలి ఇవ్వడం జీవ హింస అవుతుంది. అది మహా పాపము. పుణ్యం కొరకు చేసే యజ్ఞంలో పాపం చేయడం తప్పుకాదా!” అని అడిగాడు.

“ఏమీ తప్పుకాదు. యజ్ఞములలో మేకలను బలి ఇవ్వడం అనాది నుండి వస్తున్న ఆచారం. వేదములలో కూడా ప్రతిపాదింపబడింది. వేదములను గౌరవించడం మన కర్తవ్యము. పవిత్ర యజ్ఞంలో బలి ఇవ్వబడిన మేక పుణ్యలోకములను చేరుకుంటుంది. నేను దానికి పుణ్యలోకాలను ప్రసాదిస్తున్నాను. ఈ మేక శరీరము భూమిలో కలిసి పోతుంది. దాని ప్రాణ వాయువు అనంత వాయువులలో కలిసి పోతుంది. దాని శరీరంలోని నీరు నీటిలో కలిసి పోతుంది. దాని కంటి వెలుగు సూర్యునిలో కలుస్తుంది. దానిలోని సూక్ష్మశరీరం పుణ్యలోకాలు చేరుకుంటుంది.

ఇది వేదములలో చెప్పబడింది. అదే నేను చేస్తున్నాను.” అని అన్నాడు.

“నీవు దీని సూక్ష్మశరీరమును స్థూల శరీరము నుండి వేరు చేసి, దానికి పుణ్యలోకాలు ప్రసాదిస్తున్నాను అని అంటున్నావు. బాగానే ఉంది. కాని దీని వలన నీకు కలిగే లాభం ఏమిటి? పైగా ఈ మేకకు తల్లి తండ్రి అన్న తమ్ముడు బంధువులు ఉన్నారు. ఈ మేకను బలి ఇవ్వడానికి వారి అనుమతి తీసుకున్నావా! ఈ మేకకు పుణ్యలోకాలు ప్రసాదించేముందు వారిని సంప్రదించావా! ఎందుకంటే ఈ మేక ఇతరుల మీద ఆధారపడి ఉంది. కాబట్టి ఈ మేకను ఏమైనా చేసేముందు, ఇది ఎవరిని ఆశ్రయించుకొని ఉందో వారి అనుమతి అవసరం. వారు అనుమతిస్తే, తరువాత విషయం ఆలోచిద్దాము. ఇంకొక విషయం కూడా ఉంది. నీవు ఈ మేక ప్రాణములు తీసిన తరువాత, మిగిలింది ఏముంది. దాని చలనం లేని శరీరము. ఆ చలనం లేని శరీరాన్ని నీవు హోమం చేస్తున్నావు. చలనం లేని శరీరము ప్రాణంలేని చెట్టు మొద్దులాంటిది. ప్రాణం లేని శరీర భాగాలు హోమం చేయడం కంటే కట్టెలను, సమిధలతో హోమం చేయవచ్చుకదా! దానికి మేకను చంపడం ఎందుకు. పైగా జీవహింస మహా పాపం అని శాస్త్రములు ఘోషిస్తున్నాయి. నీకు తెలియదా! అన్ని ధర్మములలోకి అహింస పరమ ధర్మము అని పెద్దలు చెప్పగా నీవు వినలేదా!” అని మందలించాడు యతి.

దానికి అధ్వర్యువు ఇలా సమాధానం చెప్పాడు. “ఓ యతీ! మనం అందరం అనునిత్యం, ప్రతి క్షణం జీవహింస చేస్తున్నాము. ఎలాగంటే నీవు గాలి పీలుస్తున్నావు. వదులుతున్నావు. నీరు తాగుతున్నావు. ఆహారం తింటున్నావు. గాలిలో, నీటిలో, ఆహారంలో జీవం ఉంది కదా. మరి వాటిని నీవు హింసించడం లేదా! వాటిని నీవు స్వీకరించడం లేదా! గాలి నీరు ఆహారం లేకపోతే నీవు బతకలేవు. అంటే హింస లేకపోతే నీవు బతకలేవు. అనునిత్యం హింస చేస్తూ అహింస గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది. కాబట్టి నీవు చేసే ప్రతి పనిలోనూ ఏదోవిధంగా హింస దాగి ఉంది. అటువంటప్పుడు ఈ పవిత్రమైన యజ్ఞకార్యంలో హింస చేస్తే తప్పేంటి?” అని అడిగాడు అధ్వర్యువు.

దానికి యతి ఈ విధంగా సమాధానం చెప్పాడు. “క్షరము, అక్షరము అని రెండు ఉన్నాయి. క్షరము అంటే మార్పుచెందేది. నశించిపోయేది. అక్షరము అంటే నశించనిది. ఆత్మ నశించదు. ఆత్మ తప్ప మిగిలినవి అన్నీ ఏదోవిధంగా మార్పుచెందుతాయి. నశించిపోతాయి. ఇది శాస్త్రములు చెప్పిన మాట. ఈ శరీరము, శరీరములోని ఇంద్రియములు, బాహ్య ప్రపంచము అన్నీ మార్పుచెందేవే, నశించి పోయేవే. వాటిని క్షరములు అంటారు. వీటి కంటే మించినది ఆత్మ. అది అక్షరము. ఈ అక్షర తత్త్వము అయిన ఆత్మ సుఖ దు:ఖములు, జయాపజయములు, శీతోష్ణములు మొదలగు ద్వంద్వములకు అతీతము. ఈ ఆత్మ అన్ని జీవరాసులలో సమానంగా వ్యాపించి

ఉంటుంది. సాధకుడు అయిన వాడు ప్రాపంచిక విషయములకు, విషయ వాంఛలకు అతీతంగా ఉంటాడు. ద్వంద్వములను దగ్గరకు రానీయడు. తన మనసును ప్రాపంచిక విషయముల నుండి వెనుకకు తిప్పి ఆత్మతో అనుసంధానం చేస్తాడు. ఆత్మ దర్శనం చేస్తాడు. తుదకు ముక్తిని పొందుతాడు. కాబట్టి యజ్ఞయాగములలో హింస చేయడం అవివేకము, శాస్త్ర విరుద్ధము. కాబట్టి హింసతో కూడిన ఈ కర్మకాండలతో కూడిన యజ్ఞము కంటే ఇంద్రియ నిగ్రహము, మనో నిగ్రహము పాటించి చేసే తపో యజ్ఞము గొప్పది. తపోయజ్ఞములో హింసకు తావు లేదు. కాబట్టి ఈ హింసతో కూడిన యజ్ఞము మాను." అని అన్నాడు యతి.

అప్పుడు ఆధ్వర్యువు ఇలా అన్నాడు. "అయ్యా! తమరి ఆధ్యాత్మిక బోధనల వలన నాకు జ్ఞానోదయం అయింది. నాలోని అజ్ఞానము సమసిపోయింది. కాని నేను పెద్దలు చెప్పిన మాటలనే ఆచరిస్తాను. వేదోక్తంగా యజ్ఞమును నిర్వర్తిస్తాను. వేద మంత్రములను ఉచ్ఛరిస్తూ వేదములలో చెప్పిన మాదిరి మేకను బలి ఇస్తూ యజ్ఞమును పూర్తిచేస్తాను. ఈ కార్యమును పుణ్యకార్యముగా భావిస్తాను. ఈ మేకకు ఉత్తమ గతులు కల్పిస్తాను. ఇది వేదములలో చెప్పబడిన కర్మకాండ కాబట్టి ఇది హింస కాదు. వేదజ్ఞానముతో కూడిన యజ్ఞము కాబట్టి ఇది కూడా జ్ఞానయజ్ఞమే " అని అన్నాడు ఆధ్వర్యువు.

వీడికి ఏమి చెప్పినా లాభం లేదని ఆ యతి మౌనం వహించాడు. ఆధ్వర్యువు తన యజ్ఞము యధావిధిగా చేయడానికి ఉపక్రమించాడు.

కాబట్టి ఓ వనితా! ముక్తి, మోక్షము ఇవి చాలా సున్నితమైన అంశాలు. వీటిని అర్థం చేసుకోవడం చాలా కష్టము. కేవలము బ్రహ్మను గురించి తెలుసుకున్న వారు మాత్రమే ముక్తిని గురించి తెలుసుకోగలరు. ఈ విధంగా జరగడం కూడా లోపల ఉన్న క్షేత్రజ్ఞుని అనుగ్రహం వలననే జరుగుతుంది కాని వేరుకాదు." అని ఆ బ్రాహ్మణుడు తన భార్యకు ముక్తిని గురించి వివరించాడు.

మరలా ఆ బ్రాహ్మణుడు తన భార్యతో ఇలా అన్నాడు. "ఓ వనితా! ఈ సందర్భంగా నీకు మరొక ఉదంతము కూడా వినిపిస్తాను. శ్రద్ధగా విను. పూర్వము కార్తవీర్యార్జునుడు అనే రాజు ఉండేవాడు. ఆయనకు సముద్రానికి ఒక సంవాదము జరిగింది. ఆ కార్తవీర్యార్జునునికి వేయి చేతులు ఉండేవి. ఆయన తన భుజబలంతో, అస్త్రశస్త్ర బలంతో భూమి ఎంత వరకూ విస్తరించి ఉందో, అంతమేరా జయించాడు.

తనకున్న బల గర్వంతో కార్తవీర్యుడు, ఒక సారి సముద్రపు ఒడ్డున నడుస్తూ, తన వేయి చేతులతో సముద్రం మీదికి తన బాణాలు సంధిస్తున్నాడు. సముద్రుడు చేతులు జోడించి

“ఓ మహారాజా! మీరు నా మీద నీ శరములు ఎందుకు సంధిస్తున్నారు. నేను మీకు ఏమి చెయ్యాలి. చెప్పండి. నాలో ఎన్నో ప్రాణులు, జలచరములు ఆశ్రయం పొందుతున్నాయి. నీవు వేసే బాణముల వలన ఆ ప్రాణులు జలచరములు చనిపోతున్నాయి. అకారణంగా వాటిని ఎందుకు చంపుతున్నారు. దయచేసి వాటిని కాపాడండి.” అని ప్రార్థించాడు.

“ఓ సముద్రుడా! నేను ఈ లోకాన్నంతటినీ జయించాను. నాకు యుద్ధకాంక్ష తీరలేదు. నాతో సమానమైన వీరుడు ఈ లోకంలో ఉన్నాడా! ఉంటే ఎక్కడ ఉన్నాడో అతని పేరు ఏమిటో చెప్పు. అతనితో యుద్ధం చేసి నా యుద్ధకండూతి తీర్చుకుంటాను.” అని అన్నాడు కార్తవీర్యుడు.

“ఓ మహారాజా! నాకూ తెలియదు. కాని జమదగ్ని మహర్షి కుమారుడు రాముడు అనే వీరుడు ఉన్నాడు. అని విన్నాను. ఆయన నీకు సరిఅయినజోడి. నీవు వీలయితే అతనితో యుద్ధం చేసి నీ యుద్ధకండూతి తీర్చుకో” అని అన్నాడు.

ఆ మాటలు విన్న కార్తవీర్యుడు కోపంతో ఊగిపోయాడు. వెంటనే కార్తవీర్యుడు జమదగ్ని కుమారుడైన రాముని వెతుక్కుంటూ వెళ్లాడు. జమదగ్ని మహర్షి ఆశ్రమంలో ఉన్న రాముడిని చూచాడు. ఆయన చేతిలో ఒక గండ్రగొడ్డలి ఆయుధంగా ఉంది. అందుకని ఆయనను పరశు రాముడు అంటారు అని తెలుసుకున్నాడు. కార్తవీర్యుడు జమదగ్ని ఆశ్రమాన్ని ధ్వంసం చేశాడు. పరశురాముడికి కోపం వచ్చేటట్టు అనేక వికృత చేష్టలు చేసాడు.

అకారణంగా తన ఆశ్రమాన్ని నాశనం చేసిన కార్తవీర్యుని చూచి పరశురాముడు కోపంతో మండి పడ్డాడు. తన గండ్రగొడ్డలితో కార్తవీర్యుని వేయి చేతులు నరికాడు. ఇది చూచిన అతని సైన్యం పరశు రాముని మీద అన్ని వైపుల నుండి విరుచుకు పడింది. పరశురాముడు తన విల్లు తీసుకొని అస్త్రములను సంధించి, అతని సైన్యాన్ని సర్వనాశనం చేసాడు. ఈ సంగతి తెలిసిన క్షత్రియులు అందరూ పరశురాముడి కోపానికి భయపడి పారిపోయారు. మిగిలిన క్షత్రియులు తమ క్షత్రియ ధర్మము వదిలి పెట్టి పరశురాముడికి దాస్యం చేయసాగారు. కాని పరశు రాముని కోపం చల్లారలేదు. క్షత్రియుడు అని కనపడితే చాలు వాడిని చంపడం మొదలు పెట్టాడు. క్షత్రియ కులమును సర్వం నాశనం చేయసాగాడు. ఆ విధంగా పరశురాముడు క్షత్రియుల మీద ఇరవై ఒక్క సార్లు యుద్ధంచేసి క్షత్రియ కులము అనేది భూమి మీద లేకుండా చేసాడు.

అప్పుడు అశరీర వాణి ఆకాశం నుండి అందరూ వింటూ ఉండగా ఇలా పలికింది. “ఓ జమదగ్ని కుమారా! ఏమిటీ అకారణ కోపం. ఏమిటీ దారుణ మారణ కాండ. ఈ క్షత్రియులు అందరూ నీకు దాసులు అయ్యారు కదా. అబలులైన ఈ క్షత్రియులను ఎందుకు చంపుతున్నావు?” అని విన పడింది.

అప్పుడు రాముడు "ఎవరు మీరు?" అని అడిగాడు. "మేము నీ పితృదేవతలము. నీ మేలు కోరి చెబుతున్నాము. ఈ మారణ కాండ ఆపు." అని పలికారు. "ఎందుకు ఆపాలి?" అని ఎదురు ప్రశ్నవేసాడు పరశురాముడు. "ఎందుకంటే ఈ క్షత్రియులు నీ కంటే బలహీనులు. వారిని చంపడం అధర్మము. పైగా నీవు బ్రాహ్మణుడవు. నీవు క్షత్రియధర్మం అవలంబించడం ధర్మవిరుద్ధము. నీవు ఈ విధంగా క్షత్రియ వంశం నాశనం చేస్తే ప్రజలను పాలించడానికి క్షత్రియుడు అనేవాడు మిగలడు. దుర్బలులైన ఇతర వర్ణముల వారు మాత్రమే మిగులుతారు. వర్ణవ్యవస్థ దెబ్బతింటుంది.

ఓ పరశురామా! ఈ సందర్భంలో నీకు ఒక కథ చెబుతాము. శ్రద్ధగా విని నీ పద్ధతి మార్చుకో. పూర్వము అలర్కుడు అనే రాజర్షి ఉండేవాడు. అతడు మహా బలవంతుడు. గుణవంతుడు. వేదవేదాంగపారంగతుడు. ఆడిన మాట తప్పేవాడు కాదు. ఏ పని అయినా త్రికరణ శుద్ధిగా ఆచరించేవాడు. ఆయన తన పరాక్రమంతో ఈ భూమినంతా జయించాడు. కాని ప్రాపంచిక విషయాలలో, విషయ వాంఛలకు లోనుకాకుండా, ఎల్లప్పుడూ ఆత్మవిచారం చేయడంలో నిమగ్నం అయి ఉండేవాడు.

ఒకరోజు అలర్కుడు ఏకాంతంగా కూర్చుని తనలో తను ఇలా అనుకున్నాడు. "నేను ఇప్పటి వరకు నా అస్త్ర, శస్త్రములతో బయట ఉన్న శత్రువులను జయించాను. కాని ఆ మనసు నామాట వినడం లేదు. తన ఇష్టం వచ్చినట్టు సంచరిస్తూ ఉంది. దానిని అదుపులో పెట్టాలి. ఇక మీదట నా అస్త్రశస్త్రములు నా మనసు మీద ప్రయోగించి నా మనసును నిగ్రహిస్తాను." అని అనుకున్నాడు.

అప్పుడు అతని మనసు ఇలా అంది. "ఓ అలర్కా! నీ అస్త్రశస్త్రములు నన్ను ఏమీ చేయలేవు. అవి నీ శత్రువుల యొక్క, నీ యొక్క శరీరమును గాయపరచగలవు కాని లోపల ఉన్న నన్ను గాయపరచలేవు. నన్ను అదుపులో పెట్టగలిగే అస్త్రము గానీ, శస్త్రము గానీ నీ వద్ద ఉందేమో ఆలోచించు." అని పలికింది అతని మనసు.

దానికి అలర్కుడు ఇలా అన్నాడు. "నా ముక్కు వివిధములైన వాసనలను ఆకర్షిస్తుంటుంది. నా అస్త్రములు దాని మీద ప్రయోగిస్తాను. నా ముక్కును కట్టడి చేస్తాను." అని అన్నాడు. దానికి ముక్కు "ఓ అలర్కా! నీ అస్త్రముల వలన నీ ముక్కు పగులుతుందేమో కానీ, నాలో ఉన్న వాసన చూచే శక్తిని ఏమీ చేయలేవు. నీ ముక్కు పగిలితే నీకే నష్టం. కాబట్టి నా వాసన చూచే శక్తిని నిరోధించే అస్త్రముల గురించి ఆలోచించుకో." అని పలికింది.

"నీ సంగతి సరే. ఈ నాలుక రకరకాల రుచులను కోరుతూ ఉంటుంది. దీనిని కోసేస్తే సరి. ఏ రుచుల జోలికి పోదు." అని అన్నాడు అలర్కుడు. "నీ నాలుక కోస్తే నీ కే నష్టం. నీకు

మాట రాదు. మూగవాడివి అవుతావు. ఆహారం తినలేక చస్తావు. అయినా నాలుక వేరు రుచులు గ్రహించే శక్తివేరు. దానిని కట్టడి జేసే అస్త్రం గురించి ఆలోచించు." అని పలికింది నాలుక.

అలాగే చెవి, చర్మము, కళ్లు కూడా ఈ విధంగానే బదులు చెప్పాయి. బయటకు కనిపించే ఇంద్రియములు ముఖ్యం కాదు, వాటి గ్రహణ శక్తి ముఖ్యం. ఇంద్రియముల వెనక ఉన్న శక్తులను జయించే అస్త్రముల గురించి ఆలోచించు అని పలికాయి.

(చని పోయిన శవానికి కూడా కళ్లు, ముక్కు, నోరు, నాలుక, చెవి, చర్మము అంటాయి. కాని వాటిని పనిచేయించే చైతన్య శక్తి మాత్రం ఉండదు. కాబట్టి ఇంద్రియములు ముఖ్యం కాదు. వాటిని పనిచేయించే అంతర్గత శక్తి ముఖ్యం అని అంతరార్థం.).

ఇప్పుడు ఆలోచించాడు అలర్కుడు. "ఆ తెలిసింది.మీరంతా పని చేయడానికి లోపల విచక్షణా శక్తి, బుద్ధి కావాలి కదా. అందుకని ఆ బుద్ధిని నా అస్త్రములతో నిరోధిస్తాను" అని అన్నాడు. అతని బుద్ధికూడా ఇంద్రియములు చెప్పినట్టుగానే చెప్పింది. "బయటకు కనిపించే ఇంద్రియములనే నిరోధించలేని వాడివి, కంటికి కనిపించని నన్ను ఎలా నీ అస్త్రములతో నిరోధిస్తావు. నీ అస్త్రములు నిన్ను చంపగలవేమో గానీ నన్నేమీ చేయలేవు." అని పలికింది అతని విచక్షణా శక్తి అనే బుద్ధి.

ఇలా కాదని అలర్కుడు ఎన్నో యజ్ఞములు యాగములు చేసాడు కానీ పంచేంద్రియములను, మనస్సును బుద్ధిని నిరోధించే మార్గమును మాత్రం కనుక్కోలేకపోయాడు. మరలా అతడు ఆలోచించడం మొదలు పెట్టాడు. బయట ఉన్న శత్రువులను జయించడానికి అస్త్రములు ఉపయోగపడతాయేమో కానీ, లోపల ఉన్న శత్రువులను జయించడానికి ఏ అస్త్రము శస్త్రము ఉపయోగపడదు అని గ్రహించాడు. ఆ ఏడింటినీ జయించడానికి యోగము ఒకటే మార్గము, యోగమును మించిన మార్గము మరొకటి లేదు అనే జ్ఞానం కలిగింది అలర్కుడికి. అప్పుడు అలర్కుడు ఏకాంతంగా కూర్చుని, మనసును ఏకాగ్రం చేసి యోగాభ్యాసం చేయడం ప్రారంభించాడు. ఆ యోగాభ్యాసంతో అతడికి అనంతమైన శక్తి వచ్చింది. తన మనసు, బుద్ధి, ఇంద్రియములు తన స్వాధీనంలోకి వచ్చాయి. యోగములో ఇంతటి మహత్తర శక్తి ఉందా అని ఆశ్చర్యపోయాడు అలర్కుడు.

అప్పుడు అలర్కుడు తనలో తాను ఇలా అనుకున్నాడు. "ఇన్నాళ్లు ప్రాపంచిక విషయములలో పడి, విషయ వాంఛలకు లోనై, సుఖములు అనుభవించడానికే అలవాటు పడ్డాను. కోరికలు కోరడం, వాటిని తీర్చుకోవడంలోనే కాలం గడిచిపోయింది. కాని యోగములో దాని కంటే మహత్తరమైన సుఖం ఉందని తెలుసుకున్నాను. కాబట్టి యోగమును మించిన సుఖం మరొకటి లేదు. ఇది సత్యం." అని అలర్కుడు యోగము యొక్క విశిష్ఠతను గుర్తించాడు.

కాబట్టి పరశు రామా నీవు కూడా ఈ క్షత్రియ వినాశనము మాని, యోగాభ్యాసము వైపు మళ్లు. నీకు ప్రశాంతత లభిస్తుంది. నీకుముక్తి లభిస్తుంది." అని పరశురాముని పితృదేవతలు పలికారు.

తన పితృదేవతలు ఆదేశానుసారము పరశురాముడు హింసామార్గమును వదిలిపెట్టి, యజ్ఞములు చేసి, సాత్వికుడై, పరమపదమును పొందాడు." అని చెప్పిన బ్రాహ్మణుడు తన భార్యతో ఇంకా ఇలా అన్నాడు.

(ఇక్కడ ఒకటి గుర్తుపెట్టుకోవాలి. ఇది కృష్ణునికి అర్జునుడికి జరిగిన సంవాదము. ఆ సంవాదములో ఒక బ్రాహ్మణుడు తన భార్యకు చెబుతున్న ఆధ్యాత్మిక విషయాలను మనం తెలుసుకుంటున్నాము. వీటినే అభయ గీతలు, బ్రాహ్మణగీతలు అని కూడా అంటారు.)

"ఓ వనితా! మానవులకు మూడు గుణాలు ఉన్నాయని చెప్పాను కదా! అవే సత్వ రజస్ తమో గుణాలు. సత్వగుణం కలవాడికి అలౌకికమైన ఆనందము, తృప్తి, సంతోషము ఇవి ముఖ్యలక్షణములు. రజోగుణము కలిగిన వాడికి లోభము అంటే అంతా నాకే కావాలి అనే గుణము, అమితమైన కోపము, ఎదుటి వారి మీద పగ,ద్వేషము ఇవి రజోగుణ లక్షణములు. సోమరితనము, ఏపనీ చేయకపోవడం, తొందరగా అలసి పోవడం, ప్రతి పనీ వాయిదా వేయడం, ఎప్పుడూ ఏదో ఒక భ్రమలో ఉండటం ఇవీ తామస గుణ లక్షణాలు. తెలివైన వాడు ముందు సోమరి తనాన్ని వదిలివేయాలి. భ్రమలో నుండి వాస్తవంలోకి రావాలి. ఇంద్రియములను తన వశంలో ఉంచుకోవాలి. అప్పుడు అతని మనసులో శాంతిని పొందుతాడు.

ఈ సందర్భంలో అంబరీషుడు అనే చక్రవర్తి చెప్పిన గీతలు వినిపిస్తాను. శ్రద్ధగా విను. పూర్వము అంబరీషుడు అనే చక్రవర్తి ఉండేవాడు. అతడు తన శత్రువులను అందరినీ జయించాడు. దేశంలో సుస్థిరతను, శాంతిని స్థాపించాడు. ప్రజలను చక్కగా పాలిస్తున్నాడు. కాని అతనిలో అంతర్గతంగా ఉన్న అశాంతి అంతరించలేదు. తనలో తాను ఇలా అనుకున్నాడు.

"నేను నాలో ఉన్న అన్ని లోపాలను సరిదిద్దుకున్నాను. నేను నా శత్రువులను అందరినీ సంహరించాను. కాని నాలో ఒకే ఒక శత్రువు ఉన్నాడు. వాడిని నిర్మూలించాలన్నా నిర్మూలించలేకపోతున్నాను. ఆ ఒక్క శత్రువు నాలో ఉండటం వలన నేను ఈ కోరికల వలయం నుండి బయటపడలేక పోతున్నాను. నాలో చెలరేగుతున్న అంతులేని కోరికల వలన నేను అనవసరమైన చిక్కులు అనే అఘాతంలో పడిపోతున్నాను. కాని ఆ సంగతి నాకు తెలియడం లేదు. ఆ శత్రువు లోపల ఉండటం వలన మానవులు అనేక చేయకూడని పనులు చేస్తుంటారు. ఆ శత్రువు ఎవరో కాదు మానవునిలో ఉన్న లోభము, ద్వేషము. ఈ శత్రువును జయించకపోతే

మానవునికి శాంతి లేదు.

లోభము లో నుండి అంతులేని కోరికలు పుడతాయి. కోరికలు పుట్టగానే, ఆ కోరికలు తీర్చుకోవాలనే ఆతురత పెరుగుతుంది. ఆ కోరికలు తీరకపోతే ఈ జీవితం వృథా అనే మోహం పెరుగుతుంది. ఆ వ్యామోహంలో పడిన వాడు తన కోరికలు తీర్చుకోడానికి చేయకూడని పనులు చేస్తాడు. తుదకు కష్టాలపాలవుతాడు.

(ఉదాహరణకు గర్ల్‌ఫ్రెండ్ ను పబ్‌కు తీసుకెళ్లడానికి చేతిలో డబ్బులు లేక, దొంగతనానికి పాల్పడ్డ యువకుల గురించి మనం రోజూ వార్తల్లో చూస్తున్నాము. ధనవంతులు కూడా ఉన్న ధనం, ఆస్తులు చాలక, ఇంకా డబ్బు కూడపెట్టాలనే లోభంతో అనే అక్రమాలు చేస్తుంటారు. ఇతరుల మీద ద్వేషం పెంచుకుంటారు.)

ఈ విధంగా లోభంతో కోరికలు, అవి తీరడానికి ఆతురత, వ్యామోహము, అవినీతి, అక్రమాలు, ఇంతలో మరణం, ఆ కోరికలు తీరడానికి మరలా జన్మ ఎత్తడం. ఈ విధంగా జనన మరణ చక్రంలో తిరుగుతుంటాడు. ఇదంతా అర్థం చేసుకున్న తెలివైనవాడు, బుద్ధి మంతుడు, వీటికంతా మూలకారణమైన లోభాన్ని, పగను ముందు జయిస్తాడు. అదే నిజమైన విజయము. తనలో ఉన్న లోభాన్ని, పగనుజయించిన వాడే అన్నింటినీ జయించిన చక్రవర్తి. దానిని మించిన విజయం మరొకటి లేదు. ఆత్మజ్ఞానం కలిగిన వాడే నిజమైన సాధకుడు, యోగి. వాడే ఇంద్రియములకు, మనసుకు చక్రవర్తి. ”

ఈ విధంగా ఆలోచించిన అంబరీషుడు తనలో ఉన్న లోభమును, పగను జయించి, తుదకు మోక్షసామ్రాజ్యమును అధిరోహించాడు.” అని ఆ బ్రాహ్మణుడు తన భార్యకు మానవునికి లోపల ఉన్న శత్రువు గురించి వివరించాడు.

ఆ బ్రాహ్మణుడు తన భార్యకు, బ్రాహ్మణ వేషంలో వచ్చిన యమధ ర్మరాజుకు, మిథిలా నగర రాజు అయిన జనకునికి జరిగిన సంవాదమును ఈ విధంగా వివరించాడు.

“ఓ భార్యామణీ! ఒక సారి యమధర్మరాజు మిథిలా నగర రాజు అయిన జనక మహారాజును పరీక్షింప దలచి ఒక బ్రాహ్మణ రూపంలో ఆ నగరానికి వచ్చాడు. తాను ఒక నేరం చేసినట్టు జనకుడికి భ్రమ కలిగించాడు. అతడు బ్రాహ్మణుడు కాబట్టి శారీరకమైన శిక్ష విధించలేదు. అందుకని తన రాజ్యం వదిలిపెట్టి వెళ్లమని ఆదేశించాడు. అప్పుడు ఆ బ్రాహ్మణుడు చిరునవ్వుతో ఇలా అన్నాడు.

"ఓ జనక మహారాజా! నన్ను నీ రాజ్యం వదిలి వెళ్లమన్నావు కదా! నీది అనుకుంటున్న నీ రాజ్యం ఎంతవరకు విస్తరించి ఉందో చెప్పగలవా! నీ రాజ్యం ఎంత వరకు ఉందో నీవు చెప్పగలిగితే నేను నీ రాజ్యం నుండి వెళ్లిపోతాను. కానీ, శాస్త్రములలో చెప్పబడిన విధంగా నీది అంటూ ఏమైనా ఉందా, అది రాజ్యం కావచ్చు, సంపదలు కావచ్చు. ఏదీ నీది కానపుడు, నన్ను నీ రాజ్యం వదిలి వెళ్లమనే హక్కు నీకు ఎక్కడిది? బాగా ఆలోచించి చెప్పు" అని అన్నాడు ఆ బ్రాహ్మణుడు.

జనకుడు ఆలోచనలో పడ్డాడు. తన మేధస్సునంతా ఉపయోగించి, తాను చదివిన శాస్త్రములనన్నింటినీ జ్ఞప్తికి తెచ్చుకొని ఆలోచించాడు. అతడిని సరిఅయిన సమాధానం దొరకలేదు. గ్రహణ కాలంలో రాహువు సూర్యుడిని కప్పినట్టు, అతని అజ్ఞానము అతనిలో ఉన్న శాస్త్రజ్ఞానమును కప్పివేసింది. ఎంత ఆలోచించినా జనకుడికి  సమాధానం దొరకడం లేదు. జనకుడు తలవిదిలించాడు. తనలో ఉన్న బుద్ధిని, విచక్షణా జ్ఞానాన్ని ఉపయోగించి, తనలో ఉన్న అజ్ఞానాన్ని పారదోలాడు. అప్పుడు అతనిలో ఉన్న జ్ఞానజ్యోతి గ్రహణం విడిచిన సూర్యుని మాదిరి ప్రకాశించింది. అప్పుడు జనకుడు ఆ బ్రాహ్మణుడితో ఇలా అన్నాడు.

"ఓ బ్రాహ్మణోత్తమా! నీ రాజ్యము, ఈ సంపదలు నేను కష్టపడి సంపాదించినవి కావు. ఈ రాజ్యము, ఈ సంపదలు నాకు నా తండ్రి వలన సంక్రమించాయి. నాది అంటూ ఈ భూమి మీద ఎంత వెతికినా ఏమీ కనపడటం లేదు. ఈ భూమి మీద నాది అంటూ ఏమీ లేనపుడు, కనీసం ఈ మిథిలా నగరంలో ఐనా నాదంటూ ఏమైనా ఉందా అని వెదికాను. కాని మిథిలా నగరంలో కూడా నాది అంటూ ఏదీ కనపడలేదు. అప్పుడు కనీసం నా కుటుంబంలో ఐనా, ఏదైనా నాది అనేది ఉందా అని వెదికాను. నా భార్య, నా సంతానము, బంధుమిత్రులు కనపడ్డారు. ఈ భార్య, సంతానము, బంధుమిత్రులు నేను సంపాదించుకున్నవాళ్లు కారు. యాదృచ్ఛికంగా నా జీవితంలోకి వచ్చిన వాళ్లే. ఎలా వచ్చారో అలాగే వెళ్లిపోతారు కాబట్టి వాళ్లను నా వాళ్లను అని అనలేను.

ఆలోచించి ఆలోచించి నా బుద్ధి మందగించింది. ప్రాపంచిక విషయాలను గురించి ఆలోచించడం మానిన తరువాత నాకు జ్ఞానోదయం అయింది. నాలో ఉన్న అజ్ఞానము అనే చీకట్లు తొలగి పోయాయి. అప్పుడు నాకు అనిపించింది. నాకంటూ, నాదంటూ ఈ భూమి మీద ఏదీ లేదు. కాని ఈ విశాల విశ్వం అంతా నా సామ్రాజ్యమే అనే జ్ఞానం కలిగింది. ఈ శరీరమే నాది కాదు కాని ఈ విశాల ప్రపంచం అంతా నాదే. ఇది నా ఒక్కరి సొత్తు కాదు. అందరిదీ. ఈ భూమి, సంపదలు, సామ్రాజ్యాలు అన్నీ కూడా ఏ ఒక్కరికి చెందినవి కాదు. ఇవన్నీ కూడా ఈ ప్రపంచంలో ఉన్న అందరి సొత్తు. నాదంటూ ఏమీ లేనపుడు నా రాజ్యం విడిచిపెట్టి మిమ్ములను ఎక్కడికి వెళ్లమనగలను. కాబట్టి మీరు ఎక్కడికీ వెళ్లనక్కరలేదు. ఇక్కడే సుఖంగా ఉండండి" అని అన్నాడు జనకుడు.

(ఈ సందర్భంలో సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి పాట ఒకటి స్ఫురణకు వచ్చింది. “జగమంత కుటుంబం నాది. ఏకాకి జీవితం నాది. సంసార సాగరం నాదే, సన్యాసం,శూన్యం నావే!” అంతా నాదే కాని నాదంటూ ఏమీ లేదు అనే అర్థం వచ్చే గీతం.)

ఆ మాటలకు ఆ బ్రాహ్మణుడు సంతోషించి జనకుడిని మరలా ఇలా అడిగాడు.

“ఓ జనకమహారాజా! నీకు విశాలమైన సామ్రాజ్యం ఉంది. నగరములు, పట్టణాలు, గ్రామాలు, జనపదాలు నీ రాజ్యంలో ఉన్నాయి. కాని నీవు మాత్రం ఇవేవీ నీవి కానట్టు మాట్లాడుతున్నావు. నీవు ఈ నిర్వికార స్థితికి రావడానికి కారణం ఏమిటి! నీలో కలిగిన ఏ జ్ఞానం చేత ఇలా మాట్లాడగలుగుతున్నావు? అని అడిగాడు. దానికి జనకుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు.

“ఓ బ్రాహ్మణోత్తమా! నాకు కలిగిన జ్ఞానం ఒక్కటే. ఈ ప్రపంచంలో కనపడే వస్తువులు, పదార్థములు అన్నీ ఏదో ఒక నాడు నశించి పోయేవే లేక మార్పుచెందేవే! అశాశ్వతమైన వీటి కొరకు ఆరాటపడటం అవివేకము అని తెలుసుకున్నాను. అశాశ్వతమైన ఈ రాజ్యము, సంపదలు, నావి అని అనుకోవడంలో అర్థం లేదు. ఎందుకంటే ఇవన్నీ నేను పుట్టకముందు నుండి ఉన్నాయి. నేను మరణించిన తరువాత కూడా ఉంటాయి. నాతో కూడా ఏమీ రావు. పైగా ఈ శరీరమే నాది కాదు. నా తల్లితండ్రులు ఇచ్చినది. కొంత కాలం తరువాత నశించి పోతుంది. ఈ శరీరమే నాది కానపుడు, ఈ రాజ్యము, సంపదలు, జనపదములు నావి అని భావించడంలో అర్థం లేదు. అలా భావించడం మూర్ఖత్వమే అవుతుంది కదా! నిరంతర శాస్త్ర అధ్యయనము వలన ఈ విషయములను గ్రహించగలిగాను. అందుకే నేను, నాది అనే అహంకారమును, లోభత్వమును విడిచిపెట్టాను. ఏదీ నాది కాదు అనే జ్ఞానము అలవరచుకున్నాను.

అంతే కాదు ఈ జగమంతా నాది, నేనే ఈ జగత్తును, అందరూ నావాళ్లు, ఈ రాజ్యము సంపదలు అన్నీ అందరికీ చెందుతాయి అనే భావన కూడా అలవడింది. నేను నా ఇంద్రియములతో ఏ పని చేసినా అంటే గాలి పీల్చినా, ఆహారం తిన్నా, ఇంకా ఇతర పనులు చేసినా అవన్నీ నా స్వార్థం కోసంకాదు, నా సుఖం కోసం కాదు, నేను ఆ పనులు చేయాలి కాబట్టి చేస్తున్నాను అనే భావన అలవరచుకున్నాను. ఆ విధంగా ఇంద్రియముల మీద వాటి వ్యాపారముల మీద పట్టుసాధించగలిగాను. నా ఇంద్రియములు నాకు లోబడి ఉంటాయి గానీ, వాటి ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించలేవు. పైగా నేను ఇంద్రియములతో చేసే పనులన్నీ పరమాత్మ పరంగా చేస్తున్నాను. ఆ కర్మల ఫలములను పరమాత్మకు అర్పిస్తున్నాను. నా పితృదేవతలను తృప్తి పరచడానికి శ్రాద్ధకర్మలు నిర్వర్తిస్తున్నాను. శరీరము నిలబడడానికి మాత్రమే ఆహారం తీసుకుంటున్నాను, గాలి పీలుస్తున్నాను. అతిథి సత్కారములు నా ధర్మము కాబట్టి ఆ ధర్మం నిర్వర్తిస్తున్నాను. గృహస్థాశ్రమంలో ఉండి కూడా

దేనికీ అంటకుండా ఉండగలుగుతున్నాను." అని పలికాడు.

ఆ మాటలు విన్న ఆ బ్రాహ్మణ రూపంలో ఉన్న యమధర్మరాజు తన నిజరూపంలో జనకుని ముందు నిలిచాడు. "ఓ జనకమహారాజా! నేను యమధర్మరాజును. నీ ధర్మనిరతి, సత్యనిష్ఠ లోకానికి చాటి చెప్పడానికే బ్రాహ్మణ రూపంలో నీ వద్దకు వచ్చాను. నీ వలననే ఈ ధర్మచక్రం వెనుకకు కాకుండా ముందుకు తిరుగుతూ ఉంది. నీకు శుభం కలుగుతుంది. నీ లోని వివేకం ఇంకా వృద్ధిచెందుతుంది. ఎల్లప్పుడూ నీ మనసు శాంతి ప్రదాయకము అవుతుంది. నీవు ఎల్లప్పుడూ స్థిరమైన బుద్ధి కలిగి ఉంటావు." అని దీవించి వెళ్లిపోయాడు." అని ఆ బ్రాహ్మణుడు తన భార్యకు యముడికి జనకుడికి జరిగిన సంవాదమును వినిపించాడు.

ఇంకా ఆ బ్రాహ్మణుడు తన భార్యతో ఇలా అన్నాడు. "ఓ భార్యామణీ! నేను చెప్పినవి అన్నీ విన్నావు కదా! ఇప్పుడు నా గురించి చెబుతాను విను. నేను సర్వసంగ పరిత్యాగిని. నన్ను ఈ ప్రాపంచిక విషయాలలోకి లాగడానికి నీవు ఎంతో తాపత్రయ పడ్డావు. కాని నేను నా నివృత్తి మార్గమును విడిచి రాను. నేను వేదములు శాస్త్రములు చదువుకున్నాను. జ్ఞానము సంపాదించాను. నేను మోక్షమార్గములో ప్రయాణం చేస్తున్నాను. గృహస్తుగా నా ధర్మములు అన్నీ నిష్కామంగా నిర్వర్తిస్తున్నాను కానీ ఎటువంటి ఆసక్తితో కాదు. నేను ఏ పని చేసినా, నా మనసు మాత్రం పరమాత్మ మీద లగ్నం అయి ఉంటుంది. నాకు ద్వంద్వముల మీద ఆసక్తి లేదు. సుఖదు:ఖములు సమంగా చూడటం అలవాటు చేసుకున్నాను. ఈ ప్రపంచములో ఉన్న చరాచర జీవరాసులన్నీ ఏదో ఒక నాడు నశించి పోయేవే, ఏవీ శాశ్వతము కావు అనే నిశ్చయమైన అభిప్రాయము కలిగి ఉన్నాను. నా జ్ఞానమే నా సంపద. ఆ సంపద ముందు ఈ అఖండభూమండలము మీది ఆధిపత్యము, సురలోకాధి పత్యము ఏ మాత్రం సాటి రావు. నేను వాటి కంటే అతీతుడను.

కట్టెలో అగ్ని దాగిఉన్న విధంగా, ప్రతి జీవి హృదయంలో పరమాత్మ ఆత్మస్వరూపుడుగా దాగి ఉన్నాడు. కాబట్టి ఈ చరాచర జగత్తు అంతా ఆ పరమాత్మ స్వరూపము. పరమాత్మ కానిది అంటూ ఈ ప్రపంచంలో ఏదీ లేదు. మానవుడు బ్రహ్మచర్యము కానీ, గృహస్థాశ్రమము కానీ, వానప్రస్థము కానీ, సన్యాసము కానీ, ఏ ఆశ్రమములో ఉన్నా, ప్రతివాడూ ఈ జ్ఞానమును కలిగి ఉండాలి. ఎందరు దేవతామూర్తులు ఉన్నా అందరిలో ఉన్న పరమాత్మ ఒక్కడే అనే భావన కలిగి ఉండాలి. ఆకాశము నుండి నేల మీదికి పడిన నీరు అంతా నదుల రూపంలో సముద్రములోకి చేరినట్టు, మానవులు ఏ దేవతలను ఏయే రూపాలతో, పేర్లతో అర్చించినా, ఆ అర్చనలు అన్నీ నిరాకారుడు, నిత్యసత్యస్వరూపుడు అయిన పరమాత్మకే చెందుతాయి అనే జ్ఞానం అందరికీ కలగాలి. అప్పుడే ప్రతి మానవుని మనసు ద్వంద్వములకు అతీతంగా ప్రశాంతంగా ఉంటుంది.

ఈ నివృత్తి మార్గంలో నడవడానికి ఈ భౌతిక శరీరం సరిపోదు. దానికి తోడు

ఆధ్యాత్మిక జ్ఞానం కూడా కావాలి. మానవుడు చేసే ప్రతి కర్మకు మొదలు, తుది ఉంటాయి. ఆకర్మలు బంధనములను కలుగజేస్తాయి. ఆ బంధనముల వలన పునర్జన్మ కలుగుతుంది. కాబట్టి నీవు కూడా ఈ కర్మబంధనముల నుండి విడివడి, మోక్షమార్గములో నడవడానికి ప్రయత్నించు. నీ మనసును ఆత్మలో లగ్నం చెయ్యి. మోక్షమార్గంలో ప్రయాణం చెయ్యి. నీకు శుభం కలుగుతుంది." అని ఆ బ్రాహ్మణుడు తన భార్యకు ఆధ్యాత్మిక విషయాలను బోధించాడు.

కాని ఆ బ్రాహ్మణ వనితకు ఆఖరున తన భర్త చెప్పిన మాటలు ఏ మాత్రం రుచించలేదు. అందుకే విననట్టే నటించింది. పైగా తన భర్తతో ఇలా అంది. "ఏమండీ! మీరు ఆధ్యాత్మిక విషయాలు ఎన్నో బోధించారు. అవేవీ నా తలకు ఎక్కలేదు. ఎందుకంటే నేను మీ అంతా జ్ఞానిని, తెలివి తేటలు కల దానిని కాదు కదా! పైగా మీకు ఉన్న శాస్త్రపరిజ్ఞానము నాకు ఏ మాత్రంలేదు. ప్రాపంచిక విషయములతో నిండి కలుషితమైన మనసు కల నాబోటి దానికి ఇంతటి ఉన్నతమైన జ్ఞానబోధ ఎలా అర్థం అవుతుంది. మీకున్నంత పరిజ్ఞానం నాకు ఎలా వస్తుందో, దానికి తగిన మార్గం ఏమిటో దయచేసినాకు చెప్పండి." అని సున్నితంగా వినయంగా అడిగింది. తన భార్యమాటలకు ఆ బ్రాహ్మణుడు ఇలా సమాధానం ఇచ్చాడు.

"ఓ వనితా! నీకు అరణి గురించి తెలుసుకదా! ఒక కొయ్యదిమ్మ మీద మరొక కొయ్యను పెట్టి వేగంగా తిప్పితే నిప్పుపుడుతుంది. అంటే ఘర్షణ వలన అగ్ని పుడుతుంది. ఇక్కడ కదలని కొయ్యదిమ్మ గురువు అయితే, ఆ గురువు దగ్గర విద్య నేర్చుకునే శిష్యుడు ఆ కదలని కొయ్యదిమ్మలో పెట్టి తిప్పే మరొక కొయ్య. ఈ రెండు కొయ్యల సంయోగమువలన అగ్ని పుట్టినట్టే. గురు శిష్యుల సంయోగము వలన జ్ఞానము అనే అగ్ని పుడుతుంది. కాబట్టి ఏ విద్య నేర్చుకోవాలన్నా గురుముఖతా నేర్చుకోవాలి." అని చెప్పాడు.

వెంటనే ఆ బ్రాహ్మణ వనిత "స్వామీ! ఇందాక మీరు క్షేత్రజ్ఞుడు అని అన్నారు. ఇప్పుడు గురువు అన్నారు. వీరిరువురూ ఒకరేనా! గురువు లక్షణాలేమిటి! ఆయనను ఎలా గుర్తుపట్టాలి. ఇంతకూ బ్రాహ్మణుడు అంటే ఎలా ఉంటాడు! ఈ విషయాలన్నీ నాకు వివరించండి." అని అడిగింది. దానికి ఆ బ్రాహ్మణుడు ఇలా చెప్పాడు.

"ఓ వనితా! బ్రాహ్మణుడిని కానీ, గురువును కానీ గుర్తించడానికి ప్రత్యేకమైన గుర్తులు ఏమీ లేవు. వారి వారి నడవడిక, ప్రవర్తనను బట్టి మాత్రమే గుర్తించాలి. ఏ గుణములకు లొంగకుండా, నిర్గుణ తత్త్వము కలిగి ఉండటమే గురువు, బ్రాహ్మణుల లక్షణము. అహంకారము, ద్వేషము లేకుండా నిర్మలంగా ఉండటమే గురువు లక్షణము. ప్రాథమికంగా ఈ లక్షణములు ఉన్నవారిని గురువుగా గుర్తించవచ్చును. తుమ్మెద పువ్వునుండి మకరందమును ఎలా తాగుతుందో, బ్రాహ్మణుడు అయిన వాడు అదేవిధంగా గురువు వద్దనుండి జ్ఞానమును స్వీకరిస్తాడు. బ్రాహ్మణుడి మనసు, అతడు చేసే

కర్మలు ఎల్లప్పుడూ నిర్మలంగా, స్వచ్ఛంగా ఉంటాయి. అటువంటి బ్రాహ్మణులను గుర్తించాలంటే, ఇతరుల మనసులు, కర్మలు కూడా నిర్మలంగా, స్వచ్ఛంగా ఉండాలి. లేకపోతే అటువంటి బ్రాహ్మణులను గుర్తించడం కష్టం.

మోక్షం పొందడానికి ఇది చెయ్యాలి, అది చెయ్యకూడదు అనే నియమం ఏమీ లేదు. స్వచ్ఛమైన మనసుతో ఏమి చేసినా అది పుణ్యకర్మ అవుతుంది. (స్వచ్ఛమైన, నిర్మలమైన మనసు కలవారు ఎటువంటి పాపకర్మలు చేయరు, చేయలేరు.) ఇంద్రియ నిగ్రహము, మనో నిగ్రహము కలిగిన బ్రాహ్మణులు, ప్రాపంచిక విషయములలో తిరుగుతున్నా, ఏమీ పట్టనట్టు ఎటువంటి ఆసక్తి లేకుండా తామరాకు మీద నీటి బొట్టు మాదిరి ఉంటారు. వారి మనసు ఎల్లప్పుడూ పరమాత్మయందు లగ్నం అయి ఉంటుంది. కాబట్టి నీవు కూడా ముందు నీ మనసును పవిత్రంగా స్వచ్ఛంగా ఉంచుకో. అసూయ, ద్వేషాలు, లోభ,క్రోధములను విడిచిపెట్టు. ఎల్లప్పుడూ నీ మనసు పరమాత్మయందు లగ్నం చెయ్యి. ఇదే మోక్షమునకు సులువైన మార్గము." అని బోధించాడు. భర్త చేసిన బోధనల వలన ఆమెకు జ్ఞానోదయం అయింది." అని శ్రీకృష్ణుడు అర్జునునికి వివరించాడు.

అప్పుడు అర్జునుడు ఇలా అన్నాడు. "కృష్ణా! ఆ దంపతులు అంత గొప్పవారా! అంత జ్ఞానము కల వారా! చాలా ఆశ్చర్యంగా ఉందే! ఇంతకూ వారు ఎక్కడ ఉంటారు?"అని అన్నాడు.

ఆ మాటలకు కృష్ణుడు నవ్వి "అర్జునా! నీకు అర్థం కావడానికి ఒక బ్రాహ్మణుడు, ఆయన భార్య, వారిరువురు వాదించుకున్నారు అని చెప్పాను కానీ నిజానికి అటువంటి వారు లేరు. నా మనసే ఆ బ్రాహ్మణుడు. నా బుద్ధి ఆ బ్రాహ్మణవనిత. నాలో ఉన్న ఆత్మస్వరూపమే క్షేత్రజ్ఞుడు." అని పలికాడు కృష్ణుడు.

ఆ మాటలకు ఆశ్చర్యపోయాడు అర్జునుడు. శ్రీకృష్ణునికి భక్తితో ప్రణమిల్లాడు. "దేవా! నీ బోధనలతో నాకు జ్ఞానోదయం అయింది. నా బుద్ధి, మనసు ఇప్పుడు స్వచ్ఛంగా పరిశుద్ధంగా, నిర్మలంగా ఉన్నాయి. మీరు ఇన్ని చెప్పినా నాకు ఆ పరబ్రహ్మతత్వం ఏమిటో ఇంకా చక్కగా బోధపడలేదు. అది ఏమిటో, ఎలా తెలుసుకోవాలో వివరంగా చెప్పండి." అని అడిగాడు అర్జునుడు.

"అర్జునా! పరబ్రహ్మతత్వాన్ని నేను నీకు చెప్పడం కన్నా పూర్వము ఈ విషయం మీద, బ్రహ్మగారికి మహాఋషులకు జరిగిన సంవాదము వినిపిస్తాను. శ్రద్ధగా విను. ఒక సారి ఒక తెలివైన శిష్యుడు తన గురువుగారిని ఇలా అడిగాడు. "గురుదేవా! పరబ్రహ్మము అంటే ఏమిటి? ఆ పరబ్రహ్మను గూర్చి తెలుసుకోవడానికి ఏమి చెయ్యాలి? ఈ విషయం గురించి నాకు వివరంగా తెలియజేయండి. మీ పాదాలు పట్టుకొని ప్రార్థిస్తున్నాను." అని అడిగాడు.

అప్పుడు ఆ గురువుగారు, “శిష్యా! నీవు అడిగిన విషయాలు అన్నీ వివరంగా చెబుతాను. నీ సందేహాలు అన్నీ తీరుస్తాను. కాకపోతే నేను చెప్పబోయే విషయాలు నీవు శ్రద్ధాభక్తులతో వినాలి.” అని పలికాడు.

ఆ మాటలకు ఆ శిష్యుడు “తప్పకుండా వింటాను గురుదేవా. ఇంతకూ నేను ఎవరు? మీరు ఎవరు? మనం ఎక్కడనుండి వచ్చాము. మనం తెలుసుకోవలసిన జ్ఞానం ఏమిటి? ఈ భౌతిక ప్రపంచంలో కనపడే కదిలేవి, కదలనివి ఎక్కడ నుండి సృష్టించబడ్డాయి? వాటిని అన్నింటినీ ఎవరు సృష్టించారు. ఈ సృష్టిలోని జీవరాసులు అన్నీ ఎలా బతుకుతున్నాయి? వాటిని ఎవరు పోషిస్తున్నారు. జీవరాసులు అన్నీ ఇంతకాలం జీవించాలి అనే విషయాన్ని ఎవరు నిర్ణయించారు? అనంత కోటి జీవరాసుల జీవన ప్రమాణం ఎంత? సత్యం అంటే ఏమిటి? యజ్ఞము అంటే ఏమిటి? పుణ్యాత్ములు ఎలా ఉంటారు? వారి లక్షణములు ఏమిటి? వారిని ఎలా తెలుసుకోవాలి? ఈ లోకంలో శుభప్రదమైన మార్గములు ఏమిటి? ఆనందము, సంతోషము అంటే ఏమిటి? పుణ్యము అనగా నేమి? పాపము అనగా నేమి? తమరు నా మీద దయయుంచి నా ప్రశ్నలకు అన్నింటికీ సరి అయిన, సత్యములైన, నిర్దిష్టమైన సమాధానాలు చెప్పండి. నా ప్రశ్నలకు సమాధానాలు చెప్పగల శక్తి, జ్ఞానము, సామర్థ్యము తమరికి తప్ప మరొకరికి లేవు. ఎందుకంటే మీకు బ్రహ్మజ్ఞానము గురించి ముక్తి గురించి బాగా తెలుసు అని ప్రతీతి. కాబట్టి నా సందేహాలు అన్నీ తీర్చండి. ఈ లోకంలో మానవులంతా ఈ ప్రాపంచిక విషయాలతో, విషయవాంఛలతో విసుగుచెంది, మోక్షం కొరకు నిరంతరం ప్రయత్నం చేస్తున్నారు. ఈ విషయాలు నాకే కాదు, మోక్షం కొరకు సాధన చేసే సాధకులకు అందరికీ ఉపయోగపడతాయి. ” అని భక్తితో వినయంగా అడిగాడు ఆ శిష్యుడు. దానికి ఆ గురువుగారు తన శిష్యునితో ఇలా అన్నాడు.

“శిష్యా! నీవు అడిగిన విషయాలు అన్నీ ఎంతో క్లిష్టమైనవి. కానీ ఈ విషయాలు అన్నీ బ్రహ్మగారు ఎప్పుడో నిర్దిష్టంగా నిర్ణయించి పెట్టారు. బ్రహ్మగారు చెప్పిన విషయాలు అన్నీ వేద ప్రమాణాలు. ఋషులందరూ ఆ పరబ్రహ్మతత్వమును నిర్ద్వందంగా అంగీకరించారు. జ్ఞానము సంపాదించడమే మానవుని అంతిమ లక్ష్యం. మోక్షసాధనే మానవుడు చేసే నిరంతర యజ్ఞము. అందరూ తెలుసుకోదగిన సత్యం ఒక్కటే. దానికి మార్పులేదు. అదేమిటంటే ఈ చరాచర జీవరాసులలో పరమాత్మ ఆత్మస్వరూపుడుగా నిలిచి ఉన్నాడు. ఇదే పరమ సత్యం. దానికి మార్పులేదు. ఈ సమస్త జగత్తు ఆ పరమాత్మలోనుండి ఆవిర్భవించింది. తిరిగి ఆ పరమాత్మలోనే లయం అవుతుంది. అందరిలో పరమాత్మ ఆత్మ స్వరూపుడుగా ఉన్నాడు. ఈ జగత్తు అంతా ఆ పరమాత్మలోనే ఇమిడి ఉంది. ఈ విషయం గురించి తెలుసుకున్న సాధకుడు సమస్తదు:ఖముల నుండి విముక్తి పొందుతాడు.

ఎవరైతే ఈ ప్రపంచంలో తిరుగుతూ కూడా కామ,క్రోధ,లోభములకు వశుడు కాకుండా ఉంటారో, ఎవరైతే నేను, నాది అనే స్వార్థమును విడిచిపెడతారో, అటువంటి వారు నిరంతరం ఈ ప్రపంచంలో తిరుగుతున్నా, ఈ ప్రాపంచిక విషయములు వారిని అంటవు. వారి మనసు బుద్ధి ఎల్లప్పుడూ పరమాత్మయందు లగ్నం అయి ఉంటుంది. ఎవరైతే ఈ ప్రకృతి లక్షణాల యొక్క నిజానిజాలను క్షుణ్ణంగా తెలుసుకుంటారో, ఎవరైతే తమలో ఉన్న స్వార్థమును, అహంకారాన్ని విడిచిపెడతారో, అటువంటి వారు తమకుతాముగా ఈ ప్రాపంచిక విషయముల నుండి ముక్తిని పొందుతారు.

ఈ విషయం నీకు చక్కగా అర్థం కావడానికి ఒక చక్కని ఉదాహరణ చెబుతాను. విత్తనము భూమిలో పాతుతాము. విత్తనము ఎలా మొక్కగా మారుతుందో మనకు కనపడదు. మనకు తెలియదు. భూమిలో నుండి మొక్క ఆవిర్భవించినపుడే మొక్కరూపంలో మనకు కనపడుతుంది. ఆ మొక్క పెరిగి పెద్దది అవుతుంది. అప్పుడు దానికి ఒక కాండము ఏర్పడుతుంది. ఆ కాండమే విచక్షణాజ్ఞానము. ఆ కాండము నుండికొమ్మలు వస్తాయి. ఆ కొమ్మలే నేను, నాది, ఇవన్నీ నావి అనే స్వార్థపూరితమైన బుద్ధి. ఆ కొమ్మలకు పుట్టినరెమ్మలే ఇంద్రియములు. ఆ రెమ్మలకు పూసిన మొగ్గలే శబ్ద,స్పర్శ,రస,రూప,గంధములు అనే తన్మాత్రలు. ఆ తన్మాత్రల నుండి ఇంద్రియముల ద్వారా కలిగే కోరికలే ఆకులు. ఆ కోరికలు తీరగా వచ్చే ఫలితములే పూలు, పండ్లు. ఈ మహావృక్షమునకు కారణమైన విత్తనమే అవ్యక్తమైన బ్రహ్మ స్వరూపము. ఈ సంసారము అనే మహా వృక్షమును జ్ఞానము అనే కత్తితో తెగనరికినపుడే మోక్షము లభిస్తుంది. జనన మరణ చక్రము నుండి విముక్తి లభిస్తుంది. 0

ఒక సారి బృహస్పతి, గౌతముడు, భరద్వాజుడు, వశిష్ఠుడు, కశ్యపుడు, విశ్వామిత్రుడు, అత్రి మొదలగు మహాఋషులు, అంగిరసుడు అనే మహాఋషిని ముందుంచుకొని బ్రహ్మదగ్గరకు వెళ్లారు. అక్కడ వారు నిర్మలమనస్కుడైన బ్రహ్మను చూచారు. వారందరూ వినయంగా బ్రహ్మగారికి నమస్కరించారు. వారందరూ ముక్తకంఠంతో పరబ్రహ్మతత్వమును గురించి తమకు ఉపదేశించమని అడిగారు. ఇంకా ఇలా అడిగారు.

“ఓ బ్రహ్మదేవా! పుణ్యాత్ముడు ఎలా ఉంటాడు? అతడి లక్షణములు ఏమిటి? తాను చేసిన పాపముల నుండి విముక్తి పొందాలంటే ఏమి చేయాలి? సన్మార్గములు అంటే ఏమిటి? పుణ్యం అంటే ఏమిటి? పాపం అంటే ఏమిటి? ఉత్తర అయనము, దక్షిణ అయనము అని రెండు మార్గాలు ఉన్నాయంటారే వాటిలో ప్రయాణించడం ఎలాగ? లయం అంటే ఏమిటి? ముక్తి అంటే ఏమిటి? ఈ భూమి మీద ఉన్న జీవరాసులకు జననం అంటే ఏమిటి? మరణము అంటే ఏమిటి? అవి ఎలా సంభవిస్తాయి?” అని గబగబా అడిగారు.

వారి ప్రశ్నలన్నీ ఓపికగా విన్న బ్రహ్మగారు, వారితో ఇలా అన్నారు. "ఈ సృష్టికి మూలము సత్ (అంటే సత్యము). ఆ సత్ నుండి అసత్ అయిన ఈ చరాచర సృష్టి ఆవిర్భవించింది. సృష్టించబడిన ప్రతి ప్రాణీ ఏదో ఒక కర్మ చేయవలసిందే. కర్మచేయకుండా ఏ ప్రాణీ జీవించలేదు. అవి పుణ్య కర్మలు , పాప కర్మలు అని రెండుగా విభజింపబడ్డాయి. పుణ్యకర్మలు చేసిన వాడు మోక్షమును పొందుతాడు. పాప కర్మలు చేసినవాడు ఆ కర్మల ఫలితంగా జన్మించి పాప ఫలితములను అనుభవిస్తాడు. వీటి నన్నిటినీ నిత్యము సత్యము అయిన ఆత్మ సాక్షీభూతంగా చూస్తూ ఉంటుంది. పరమాత్మ సత్యము. మార్పులేనిది. పరమాత్మ తప్ప అన్నీ అసత్యాలే, నిరంతరం మార్పుచెందేవే.

ఆ పరమాత్మ అన్ని జీవరాసులలో చైతన్యస్వరూపుడుగా ఉన్నాడు. ఆ సత్యస్వరూపుడైన పరమాత్మ నుండి ఈ సమస్త సృష్టి ఆవిర్భవించింది. మానవుడు తన మనస్సును ఆత్మతో లగ్నం చేయడమే యోగము. ఆ యోగము సిద్ధించడానికి సుఖదు:ఖముల నుండి విడివడాలి. అలా విడివడాలంటే సుఖదు:ఖములను సమానంగా చూడటం నేర్చుకోవాలి. ఇలా చూడగలగడానికి ఆధారం ఆధ్యాత్మతత్వము. ఈ సృష్టి అంతా పరమాత్మ స్వరూపము అని తెలుసుకోవడమే ఆధ్యాత్మ తత్వము. అలా తెలుసుకున్న సాధకుడు బ్రహ్మ సత్యం జగన్మిధ్య అని తెలుసుకుంటాడు. ఆ పరబ్రహ్మను ఆశ్రయిస్తాడు.

బుద్ధిమంతులు అయిన వాళ్లు ఈ జీవన విధానాన్ని నాలుగు భాగములుగా విభజించారు. మానవులు ఆ విధానాలను అనుసరించారు. ఈ నాలుగు మార్గములను అనుసరించిన వారు పుణ్యలోకములను పొందారు. సాధకులు అయిన వాళ్లు ఈ నాలుగు మార్గములలో ప్రయాణము చేసి తుదకు మోక్షపదమును చేరుకున్నారు. పైన చెప్పబడిన మార్గములను ఆశ్రమములు అని అంటారు. వాటిలో మొదటి ఆశ్రమము బ్రహ్మచర్యము. మానవుడు పుట్టిన తరువాత మొదటి పది సంవత్సరములు బాల్య దశ. ఏమీ తెలియదు. ఆటపాటలతో సంతోషంగా గడుపుతాడు. తరువాత ఉపనయనము చేసుకొని గురువు గారి దగ్గర విద్య నేర్చుకోడానికి వెళతాడు. దానిని బ్రహ్మచర్య ఆశ్రమము అని అంటారు. బ్రహ్మ చర్యము అంటే బ్రహ్మయందు చరించేవాడు అని అర్థము. అంటే ఆ సమయంలో పరమాత్మ స్వరూపమైన విద్య తప్ప మరొక విషయం గురించి ఆలోచించడు. (అందుకే విద్యను వాగ్దేవి సరస్వతితో పోల్చారు)...... (ఈ రోజుల్లో పెళ్లి కాని వాడిని బ్రహ్మచారి అంటున్నాము. అది తప్పు).

గురువు గారి దగ్గర విద్య నేర్చుకోవడం పూర్తి కాగానే బ్రహ్మచర్యం వదిలిపెట్టి గృహస్థాశ్రమంలోకి ప్రవేశిస్తాడు. అంటే గురువుగారు, తల్లి తండ్రుల అనుమతితో వివాహం చేసుకుంటాడు. తన జీవితంలోకి సహధర్మచారిణి ని ఆహ్వానిస్తాడు. వారిద్దరూ గృహస్థాశ్రమం స్వీకరిస్తారు. సంతానోత్పత్తి చేస్తి సృష్టిని కొనసాగిస్తారు. అతిథి సత్కారాలు, అగ్నిహోత్రము, వేదాధ్యయనము మొదలగునవి ఆచరిస్తారు. వృద్ధాప్యంలో అన్ని బాధ్యతల నుండి విముక్తి చెంది

భార్యతో సహా వానప్రస్థమునకు అంటే అడవులలోకి వెళతారు. అక్కడ కుటీరము ఏర్పరచుకొని, దొరికిన పండ్లు తిని జీవితం కొనసాగిస్తారు. ఆ విధంగా తనువు చాలిస్తారు. కొంత మంది భార్యలేని వాళ్లు వానప్రస్థము నుండి సన్యాసాశ్రమము స్వీకరిస్తారు. అన్ని భవబంధాలు తెంచుకుంటారు. అదే తుది ఆశ్రమము మరియు ఉన్నతమైన ఆశ్రమము.

ఇప్పుడు మీకు అధ్యాత్మయోగం గురించి చెబుతాను శ్రద్ధగా వినండి. పైన చెప్పబడిన నాలుగు ఆశ్రమములు పాటిస్తూ అధ్మాత్మసాధన చేయాలి. అధ్మాత్మ సాధన చేయకుండా ఎవరూ మోక్షమును పొందలేరు. ఎవరైనా సరే ఆఖరుడు ఇంద్రుడుకి అయినా సరే అందరికీ అధ్యాత్మమార్గమే ఉత్తమము.

అధ్యాత్మమార్గం అంటే పరమాత్మయొక్క 24 తత్వముల గురించి తెలుసుకోవడమే. ఆ 24 తత్వముల గురించి వివరిస్తాను. ఆకాశము, అగ్ని, వాయువు, నీరు, నేల ఈ ఐదు పంచభూతములు, వీటి తత్వములు అంటే శబ్ద,స్పర్శ,రస,రూప,గంధములు ఐదు, జ్ఞానేంద్రియములు 5, కర్మేంద్రియములు 5, (మొత్తం 20), ఇంకా మనస్సు, బుద్ధి, అహంకారము, మొత్తం 23. కంటికి కనపడే ప్రకృతి ఒకటి. మొత్తం ఇరవైనాలుగు తత్వములు. (కొంత మంది ప్రకృతి మిథ్య కాబట్టి పరమాత్మ 24వ తత్వము అంటారు.). ఈ 24 తత్వాలు కలయికే సృష్టి అంటే జననం. ఈ 24 తత్వాలు విడిపోతే మరణం. ఈ జనన మరణ రహస్యం తెలుసుకోగలగడమే అధ్మాత్మజ్ఞానము. ఈ అధ్యాత్మజ్ఞానము కలవాడు ఈ ప్రాపంచిక విషయముల భ్రమలో పడడు. ఒకవేళ, అంతకు ముందే ఈ ప్రాపంచిక విషయములు అన్నీ సత్యములు అనే భ్రమలో పడ్డా, ఈ జ్ఞానం కలగగానే ఆ భ్రమల నుండి విడివడతాడు.ఈ భవబంధముల నుండి విముక్తి పొందుతాడు. అప్పటి వరకు తాను చేసిన పాపములను ప్రక్షాళన చేసుకుంటాడు. అతని మనసు నిర్మలంగా, పరిశుద్ధంగా ఉంటుంది." అని పలికాడు బ్రహ్మ. ఇంకా ఇలా అన్నాడు.

"నిరాకారుడు, సర్వాంతర్యామి అయిన పరమాత్మ, ఆత్మస్వరూపుడుగా అన్ని జీవరాసుల హృదయాలలో తిష్టవేసుకొని ఉన్నాడు. ఆయనకు ఈ తొమ్మిది ద్వారములు కల శరీరమే ఆవాసము. ఈ శరీరము పంచభూతములతోనూ, మూడు గుణములతోనూ నిర్మితమయినది. ఈ శరీరములో కనపడే పది ఇంద్రియములు, కనపడని మనస్సు, బుద్ధి, అహంకారములు మొత్తం పదకొండు తత్వములతో నిండి ఉంది. ఈ శరీరంలో అంతర్గతంగా మూడు గుణాలు నిరంతరం పని చేస్తుంటాయి. అవే సత్వ,రజస్,తమోగుణములు. అవి విడివిడిగా ఉండవు. ఒకదానితో ఒకటి కలిసిపోయి ఉంటాయి. ఒకదానిమీద మరొకటి ఆధారపడి ఉంటాయి. ఒక దానిని మరొకటి ఆశ్రయించుకొని ఉంటాయి. ఒకదానిని మరొకటి అనుసరిస్తూ ఉంటాయి. ఒక్కోసారి ఒకదానితో మరొకటి కలిసిపోతుంటాయి. జ్ఞానేంద్రియములు ఐదు ఈ మూడు గుణముల ప్రభావానికి లోనవుతూ ఉంటాయి.

సత్వము, తమస్సు ఒకదానితో ఒకటి కలిసి ఉంటాయి. అలాగే సత్వము రజస్సు ఒక దానితో ఒకటి కలిసి ఉంటాయి. అన్నింటి కన్నా మించి రజస్సు, తమస్సు ఎక్కువగా కలుస్తుంటాయి. అటువంటి వారిలో సత్వము చాలా తక్కువగా ఉంటుంది. తమోగుణమును నిగ్రహించగలిగితే, రజస్సు కూడా నిగ్రహింపబడి సత్వము వృద్ధిచెందుతుంది. ఈ విధంగా ఒకగుణముతో మరొక గుణము కలిసి ప్రవర్తిస్తుంటాయి. ఆ గుణములకు అనుగుణంగా ప్రాణులు తమ జీవన విధానమును అనుసరిస్తుంటాయి.

అన్నిటి కంటే ప్రమాదకరమైనది తమోగుణము. ఆ తమోగుణమును నిగ్రహించగలిగితే, రజోగుణము కూడా నిగ్రహించబడి, సత్వము వృద్ధిచెందుతుంది. ఈ తమోగుణము లక్షణములు ఈ విధంగా ఉంటాయి. తమోగుణములో తమస్సు అధికంగా ఉంటుంది. ఈ గుణము ఉన్న వాళ్లు ఎల్లప్పుడూ ఏదో ఒక భ్రమలో ఉంటారు. ఒక వస్తువు యొక్క నిజస్వభావాన్ని తెలుసుకోలేరు. అన్నింటినీ తప్పుగా అర్థం చేసుకుంటారు. వితండ వాదం చేస్తుంటారు. దురాలోచనలు దుర్మార్గాలు చేయడంలో ఆసక్తి కలిగి ఉంటారు. వారు చేసే ఆలోచనలు, పనులు పాపభూయిష్టమై ఉంటాయి. లోభం, శోకం, భ్రాంతి, నిద్ర, భయం, అలసత్వం, దురభిమానం, కోపం, మోసం, అసూయ, ద్వేషము... ఇవన్నీ తమోగుణ లక్షణములు.ఈ తమోగుణ సంపన్నులు ఎల్లప్పుడూ ఇతరుల గురించి చెడుగా మాట్లాడుతుంటారు. బ్రాహ్మణులను, దేవతామూర్తులను ద్వేషిస్తుంటారు. ఇతరుల పట్ల కఠినంగా ప్రవర్తిస్తుంటారు. వీరికి గర్వము, కోపము, దురభిమానము ఎక్కువగా ఉంటాయి.

పైన చెప్పబడిన లక్షణములు కానీ, వాటికి సమానమైన లక్షణములు కానీ ఎక్కువగా కలిగి ఉన్నవారిని తమోగుణ సంపన్నులు అని చెప్పవచ్చును. ఈ తమోగుణ సంపన్నులు దేనినీ లెక్కచెయ్యరు. శాస్త్రములలో చెప్పబడిన అంశములను ఆచరించరు. తమ ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తారు. ఇటువంటి తమోగుణము కలవారు మరుజన్మలో నీచ యోనులలో పుడతారు. నరక యాతనలను అనుభవిస్తారు. జీవితంలో కుంగి పోతారు. దిక్కుతోచకుండా ఉంటారు. అటువంటి వారు చలనం లేని కొండలు గుట్టలుగా మారిపోతారు. లేక క్రూర జంతువుల మాదిరి జన్మఎత్తుతారు. నిరంతరం ప్రాణభయంలో బతుకుతారు. పురుగులు, పాములు, తేళ్లు, డేగలు మొదలగు పక్షులు, చేపలు మొదలగు జలచరముల మాదిరి జన్మలు ఎత్తుతారు. ఇటువంటి జన్మలు ఎత్తి ప్రాణులకు హాని కలిగిస్తూ, అందరికీ భయం కలిగిస్తూ, తాము భయపడుతూ, తొందర తొందరగా జననం మరణం పొందుతుంటారు. తమోగుణ సంపన్నులు ఎల్లప్పుడూ అధోగతిపాలవుతుంటారు. వారికి ఊర్ధ్వలోకములు ప్రాప్తించవు.

ఈ తమోగుణమును గురించి బాగా తెలుసుకొని, ఆ తమోగుణముయొక్క గుణ కర్మలను గుర్తించి, వాటికి దూరంగా ఉంటూ, తమోగుణము వలన కలిగే వికారాలను దూరం చేయగల విచక్షణా శక్తి కల వారు, అధోగతి పాలు కాకుండా, ఊర్ధ్వగతులు పొందుతారు.

తమోగుణమునకు పూర్తి వ్యతిరేకమైన సత్వగుణము కలవారు ఎలా ఉంటారో చెబుతాను. సంతోషము, ప్రకాశము, ప్రేమ, ఆనందము, కరుణ, క్షమాగుణము, సత్యం పలకడం, శుచిగా ఉండటం, ధైర్యము, లోభం లేకుండా ఉండటం, ఓర్పు, అహింస, చక్కని నడవడిక, అసూయలేకపోవడం, కోపం, ఉద్రేకం లేకుండా ప్రశాంతంగా ఉండటం, అందరినీ సమానంగా చూచే తత్వము, ఇతర ప్రాణుల మీద కనికరం, నిష్ఠ, నమ్మకము, విశ్వాసము, గౌరవము ఇవన్నీ సత్వగుణప్రధానమైన లక్షణములు. సత్వగుణ సంపన్నులు తాము చేసిన పుణ్యకార్యముల ఫలితంగా ఎల్లప్పుడూ ఊర్ధ్వలోకములను పొందుతారు. వారి జీవనము ప్రశాంతంగా గడుస్తుంది. మరుజన్మలలో కూడా వారు ఉత్తమ జన్మలు ఎత్తుతారు. పుణ్యకార్యములు, యజ్ఞయాగములు చేసిన వారు స్వర్గలోక సుఖములు అనుభవిస్తారు. ఇది వేదములలో చెప్పబడినది. చేసుకున్న పుణ్యం అయిపోగానే మరలా మానవ జన్మఎత్తుతారు. కాని ఉత్తమ కులంలో జన్మిస్తారు. మరలా తమ పుణ్యకార్యములను కొనసాగిస్తారు.

ప్రాపంచిక విషయముల పట్ల ఆకర్షితులు కావడం, అవి అన్నీ తనకు కావాలని అనుకోవడం, ప్రాపంచిక విషయములు అంటే ధనము, ఆస్తి, రాజ్యము, భార్య, సంతానము, బంధుమిత్రులు వీరంతా శాశ్వతము అని అనుకోవడమే భ్రాంతి. పూర్వము మహా మహా ఋషులు, యోగులు కూడా ఈ విధమైన భ్రాంతికి లోనైనవారు. ఈ భ్రాంతిలో నుండి కోరికలు పుడతాయి. అవి తీరకపోతే కోపం వస్తుంది. అప్పుడు బుద్ధి పనిచేయదు, అదే అధ:పతనానికి మూలము. కాని ఈ తమోగుణము గురించి, దాని లక్షణముల గురించి సమగ్రంగా ఎవరు తెలుసుకుంటారు? తమోగుణము యొక్క అసలు తత్వాన్ని ఎవరు గ్రహించగలరు? ఏదైతే మానవుడు సత్యము, శాశ్వతము అని అనుకుంటున్నాడో, అది నిజంకాదు, శాశ్వతం కాదు. అని తెలుసుకోవడమే తమోగుణము నుండి తెలుసుకోవడం. కాబట్టి మానవుడు "కంటికి కనపడేదంతా శాశ్వతము", "శాశ్వతము కానిది శాశ్వతము అని అనుకోవడం" అనే భ్రమలో నుండి బయటపడాలి. అప్పుడు సత్యం ఏమిటో బోధపడుతుంది.

కాబట్టి ఓ బ్రాహ్మణులారా! తమోగుణము గురించి, దాని లక్షణముల గురించి పూర్తిగా తెలుసుకొని, దాని ప్రభావం నుండి ఎవరు బయటపడతారు, వారే మోక్షపదమునకు అర్హులు.

ఇంక రజోగుణ లక్షణములు ఏవంటే......రజోగుణ సంపన్నులు అత్యంత చురుకుగా ఉంటారు.ఎల్లప్పుడూ ఏదో ఒక పని చేయడంలో నిమగ్నమై ఉంటారు. ఉత్సాహంగా ఉద్రేకపూరితంగా ఉంటారు. ముందు వెనుక ఆలోచించరు. ఏదితోస్తే అది చేసేస్తుంటారు. చేసే ప్రతి పనికీ ఏదో ఒక ఫలితమును ఆశిస్తుంటారు. బలం, పరాక్రమం, గర్వం, వైభవం, సుఖము, దు:ఖము, కోరిక, ఆశ, దురాశ, అసూయ, ద్వేషం, పగ, స్త్రీలోలత్వం, అసత్యం పలకడం, అసహనం ఇవన్నీ రజోగుణ లక్షణములు. రజోగుణము కల వారు ఎల్లప్పుడూ ఇతరుల మీద దాడి చేయడానికి ఉత్సాహంగా

ఉంటారు. శారీరక సౌందర్యానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. సుఖ దు:ఖములను అనుభవించడానికి ఎక్కువ ఇష్టపడుతుంటారు. వారికి యుద్ధము దాని తరువాత వచ్చే శాంతి అంటే మక్కువ ఎక్కువ. ఎక్కువగా ద్వంద్వముల ఎడల ఆకర్షితులౌతుంటారు. ప్రతి విషయాన్ని వాదప్రతివాదములు చేస్తుంటారు. వారికి పరాక్రమము, స్వాభిమానము, గర్వము, కోపము, అసూయ, ద్వేషము, కోరిక ఎక్కువగా ఉంటాయి. ఇంకా వీరికి వేట యందు ఆసక్తి, బంధుప్రీతి, ఆశ్రితపక్షపాతము, క్రూరత్వము, యుద్ధము, తన లోపాలు కప్పిపుచ్చుకొని, ఎదుటి వారి లోపాలను ఎత్తి చూపడం, ప్రాపంచిక విషయముల మీద ఎక్కువ ఆసక్తి కలిగి ఉండటం, అసత్యం పలకడం, దేనికైనా తెగించడం, ఎక్కువగా తెలివి తేటలు కలిగి ఉండటం, శపథాలు, ప్రతిజ్ఞలు చేయడం, వాటిని నెరవేర్చడానికి హింసచేయడం, దానధర్మాలు, యజ్ఞయాగాదులు చేయడం, ఇతరుల నుండి దానాలు స్వీకరించడం, అవసరం వచ్చినపుడు అత్యంత క్రూరంగా, మోసపూరితంగా వ్యవహరించడం, ఎవరినీ లెక్కచేయకపోవడం, ఎక్కువగా శారీరక బంధములు కలిగి ఉండటం, జూదము ఆడటం, మృగయావినోదం, స్త్రీలోలత్వము, అందమైన స్త్రీల నృత్యగానాదులతో వినోదించడం, అనుభవించడం, ఇవే కాకుండా వీటికి సంబంధించిన అన్ని లక్షణములు రజోగుణ ప్రధానములు అని చెప్పబడతాయి.

భూత,భవిష్యత్,వర్తమానముల గురించి ఎక్కువగా ఆలోచించేవారు, అర్థ కామముల గురించి తాపత్రయపడేవారు, ఎల్లప్పుడూ కోరికలతో సతమతమయ్యేవారు, అలాంటి వారు రజోగుణముతో కప్పబడి ఉంటారు. ఇటువంటి వారికి అధోలోకములు ప్రాప్తిస్తాయి. వారు చేసిన కర్మఫలములను బట్టి వారు తమ కోరికలు తీర్చుకోడానికి జన్మ వెంట జన్మ ఎత్తుతుంటారు. రజోగుణ ప్రధానులు ఇహలోక సుఖములకు, స్వర్గలోక సుఖములకు అలవాటు పడి జనన మరణ చక్రంలో తిరుగుతుంటారు. (క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి. భ.గీ.) అటువంటి వారు స్వర్గలోక ప్రాప్తికి యజ్ఞయాగములు చేస్తుంటారు. సాధకులు రజోగుణము గురించి, దాని లక్షణముల గురించి బాగా తెలుసుకొని, అర్థం చేసుకొని, వాటి ప్రభావానికి లోనుకాకుండా, దూరంగా ఉంటారు.

తరువాత అత్యంత ప్రధానమైనది, ముఖ్యమైనదీ, అందరూ ఆచరించతగ్గది అయిన సత్వగుణము గురించి వివరిస్తాను. సంతోషం, ప్రకాశం, ప్రేమ, ఆనందం, కరుణ, క్షమ, సత్యం, శౌచం, ధైర్యం, లోభం లేకపోవడం, ఓర్పు, అహింస, చక్కని నడవడిక, కోపం, అసూయ, ద్వేషం లేకపోవడం, ఉద్రేకం లేకుండా శాంతంగా ఉండటం, అన్నిటినీ సమభావనతో చూడటం, కనికరం, నమ్మకం, విశ్వాసం, నిష్ఠ కలిగి ఉండటం, మాటలు కానీ, చేతలలో కానీ పరుషత్వం లేకపోవడం, ఇతరుల పట్ల గౌరవం, ఈ గుణాలు కలవారు సత్వగుణ ప్రధానులు. సత్వగుణ సంపన్నులు అహంకార మమకారాలు లేకుండా, కోరికలకు దూరంగా ఉంటూ, మోక్షం కొరకు ప్రయత్నం చేస్తుంటారు. సత్వగుణ లక్షణములు కలిగి ఉండి, యోగసాధనలో నిమగ్నమైన వారికి బాహ్యప్రపంచముతో కానీ, సుఖదు:ఖములతో కానీ, అహంకారముతో కానీ సంబంధము ఉండదు. వారి దృష్టి ఎల్లప్పుడూ మోక్షసాధన మీదనే ఉంటుంది. అటువంటి వారు స్వాభిమానము, అహంకారము, కోపము, అసూయ

మొదలగు స్వార్థగుణముల నుండి విముక్తి పొందుతారు. వారు ఎల్లప్పుడూ బ్రహ్మ యందు చరిస్తుంటారు. వినయము, విధేయత కలిగి ఉంటారు. క్రూరత్వము అంటే ఏమిటో వారికి తెలియదు. తమ మాటలతో కానీ చేతలతో కానీ ఇతరులను నొప్పించరు. వేదముల పట్ల, శాస్త్రముల పట్ల నమ్మకము, విశ్వాసము కలిగి ఉంటారు. అటువంటి వారిని వేదవిదులు అని అంటారు. అన్ని రకములలైన బంధనముల నుండి, దు:ఖముల నుండి విముక్తి పొందిన సాత్వికులు, పరలోకములో కూడా పరమ శాంతిని పొందుతారు. ఈ స్థితికి చేరుకున్న సాధకుడు తనను తాను నియంత్రించుకుంటాడు. అటువంటి వారికి దైవత్వం సిద్ధిస్తుంది. వారు ఊర్ధ్వలోకాల వైపు పయనిస్తారు. అటువంటి వారికి అసాధ్యము అంటూ ఏమీ లేదు. వారికి లభ్యం కానిది అంటూ ఏదీ ఉండదు. సమస్త సుఖాలు వారి ముంగిట ఉంటాయి. ఇటువంటి సత్వగుణ ప్రధాన మైన లక్షణములను అర్థం చేసుకొని ఆచరించిన వారు, వారు కర్మలు చేస్తున్నా, నిష్కమంగా చేస్తారు కాబట్టి ఆ కర్మఫలములు వారిని బంధించవు. కాబట్టి గుణములలో అన్నింటిలోకి సత్వగుణము ప్రధానమైనది అని బ్రహ్మగారు మహాఋషులకు వివరించాడు.

బ్రహ్మగారు ఇంకా ఇలా అన్నారు. "మహాఋషులారా! ఈ గుణాలు, వాటి లక్షణాలు, ఉపలక్షణాలు వేరు వేరుగా ఉంటాయి. ఒకదానితో ఒకటి కలిసి ఉంటాయి. వివిధ నిష్పత్తులలో ఉంటాయి. కాబట్టి ఒక మానవుని వీడు ఈ ప్రత్యేక గుణముతో ఉన్నాడు అని చెప్పలేము. దేశ,కాలములను బట్టి, వాడి మానసిక స్థితిని బట్టి వాడిలోని గుణములు ప్రవర్తిస్తుంటాయి. ఈ గుణముల సమ్మేళనమే మానవునికి భ్రాంతిని కలిగిస్తుంది. ఆ భ్రాంతిలో పడ్డ మానవుడు పరమాత్మ నిజస్వరూపమును తెలుసుకోలేడు. దానినే అజ్ఞానము, మాయ అని కూడా అంటారు. ఈ గుణసమ్మేళనము గురించి క్లుప్తంగా చెబుతాను. శ్రద్ధగా వినండి. సత్వ,రజస్తమోగుణములు ఒకదానితో ఒకటి మిళితమై ఉంటాయి. ఒకదానితో ఒకటి అతుక్కుని ఉంటాయి. ఒకదానిమీద మరొకటి ఆధారపడి ఉంటాయి. ఒకదాని అధీనంలో మరొకటి ఉంటాయి. ఒకదానిని మరొకటి అనుసరిసూ ఉంటాయి.

ఉదాహరణకు ఒకడిలో సత్వగుణం ఉంటే దాని పక్కనే రజోగుణం కూడా ఉంటుంది. కాకపోతే వాటి పరిమాణంలో హెచ్చుతగ్గులు ఉంటాయి. అవి కూడా కాలానుగుణంగా మారుతుంటాయి. వాటితో పాటు తమోగుణము కూడా వర్ధిల్లుతూ ఉంటుంది. సమయం చూచి అది కూడా తన ప్రతాపం చూపిస్తుంది. కాబట్టి ఈ మూడు గుణాలు ఒకదానితో ఒకటి కలిసి ప్రయాణం చేస్తుంటాయి. ఆ ప్రయాణం కూడా ఎక్కడో కాదు. మానవుని శరీరంలోనే. ఆ విధంగా మూడు గుణాలు మానవుని శరీరం అంతా నిండి ఉండి, సకారణంగా కానీ, అకారణంగా కానీ, తమ ప్రభావాన్ని చూపుతుంటాయి. (కొంత మందికి ఏ కారణం లేకుండానే విపరీతమైన కోపం వస్తుంది. అరిచేస్తారు. అంతలోనే ప్రశాంతంగా మారి పోతారు. ఇది మనం చూస్తుంటాము.) ఈ

విధంగా ఒకదానితో ఒకటి సంబంధం ఉన్న ఈ మూడు గుణాలు ప్రతి మానవునిలోనూ కాలానుగుణంగా వివిధ రూపాలలో పెరుగుతుంటాయి.

ఆ గుణాల హెచ్చుతగ్గుల గురించి చెబుతాను. వినండి. తమోగుణము ఎక్కువ మోతాదులో ఉంటే, రజోగుణము దాని కంటే కొంచెం తక్కువగా ఉంటుంది. సత్వగుణము చాలా స్వల్పంగా ఉంటుంది. జంతువులలో కూడా ఇదేవిధంగా ఉంటుంది. ఇటువంటి జీవులను అధమ ప్రాణులు అని అంటారు. అలా కాకుండా, రజోగుణము ఎక్కువగా ఉండి, తమోగుణము కొంచెం తక్కువగా ఉండి, సత్వగుణము స్వల్పంగా ఉన్న ప్రాణులను మధ్యమ ప్రాణులు అని అంటారు. ఇంకా, సత్వగుణము ఎక్కువగా ఉండి, దానికంటే కొంచెం తక్కువగా తమోగుణము, రజోగుణము స్వల్పంగా ఉన్న ప్రాణులను ఉత్తమ తరగతి ప్రాణులు అని అంటారు. ఈ విధంగా సత్వగుణము ఎక్కువగా ఉన్న సాధకుడు, తన ఇంద్రియములను తన అధీనంలో ఉంచుకోగలడు. అటువంటి మానవులను జ్ఞానులు అని అంటారు. సత్వగుణమును మించిన గుణము మరొకటి లేదు. సత్వగుణమును అలవరచుకున్న మానవులు ఊర్ధ్వలోకములను పొందుతారు. రజోగుణ ప్రధానులైన వారు మానవలోకంలో మానవులుగా జీవనం సాగిస్తారు. తమోగుణము అధికంగా కలవారు జంతువులుగానూ, వృక్షములుగానూ జన్మిస్తారు.

ఈ గుణములను బట్టి మానవులను విభజించారు. బ్రాహ్మణులలో సత్వగుణము, క్షత్రియులలో రజోగుణము, వైశ్య, శూద్రులలో తమోగుణము ఎక్కువగా ఉంటుంది. ఆయా గుణములను బట్టి వర్ణవిభజన జరిగింది. కాని ప్రతి మానవునిలో ఈ మూడుగుణములు వివిధ నిష్పత్తులో ఉంటాయి అని తెలుసుకోవాలి. అంతేకానీ, ఒకే గుణము ఒకే మానవునిలో ఉండటం జరగదు. మూడుగుణముల సమ్మేళనమే జీవుని జీవన యానము అని తెలుసుకోవాలి. అలాగే ప్రకృతిలో కూడా ప్రాత: కాలంలో సత్వగుణము హెచ్చుగా ఉంటుంది. ఎండ ఎక్కేకొద్దీ సత్వగుణము తగ్గి రజోగుణము పెరుగుతూ ఉంటుంది. సాయంత్రం ఎండ తగ్గే కొద్దీ రజోగుణము తగ్గి తమోగుణము పెరుగుతూ ఉంటుంది.

(ఈ గుణముల సంధి కాలములను ప్రాత: సంధ్య, సాయం సంధ్య అని అంటారు. అందుకే ధ్యానము, పూజలు అన్నీ సత్వగుణము ఎక్కువగా ఉన్న ఉదయం పూటనే చేయాలి అని అంటారు. రాత్రి తమోగుణము ఎక్కువగా ఉంటుంది. పగలంతా కష్టపడిన ప్రాణులు రాత్రి విశ్రాంతి తీసుకుంటాయి. రజోగుణము ఎక్కువగా ఉన్న పగటి పూట, తాము చేయవలసిన పనులు అన్నీ చక్కబెట్టుకోవాలి. ఇదీ ప్రతి ప్రాణీ ఆచరించవలసిన ప్రకృతి ధర్మము. )

ప్రకృతిలో చరాచర జీవరాసులు ఉన్నాయి. అంటే కదిలేవి. కదలనివి. కదలని వాటిలో తమోగుణము ఎక్కువగా ఉంటుంది. రజోగుణము, సత్వగుణము స్వల్పంగా ఉంటుంది. అందుకని

వాటిలో చలనం ఉండదు.

ఇదే విధంగా ప్రకృతిలో ఉన్న అణువణువునా ఈ మూడుగుణాలునిండి ఉన్నాయి. ఉదయం, మధ్యాహ్నము, రాత్రి, శుక్లపక్షము, కృష్ణ పక్షము, అలాగే ఋతువులు, ఇవన్నీ కూడా మూడుగుణముల కలయిక. అలాగే దానములు కూడా సాత్వికదానము, రాజస దానము, తామస దానము, యజ్ఞములు కూడా ఇలాగే మూడు విధములు. లోకములు కూడా ఊర్ధ్వలోకము, మానవలోకము, అధోలోకము.

కాబట్టి ప్రకృతిలో అణువణువునా ఈ మూడుగుణములు నిండి నిబిడీకృతం అయి ఉన్నాయి అని తెలుసుకోవాలి. ఈ మూడుగుణములు అన్ని ప్రాణులలో, అన్ని వస్తువులలో అవ్యక్త రూపంలో నిండి, కాలానుగుణంగా, సమయానుకూలంగా, ఒకదాని వెంట ఒకటి ప్రకటితమౌతుంటాయి. ఈ మూడు గుణములు అనాదిగా ఉన్నాయి. ఈ సృష్టి ఆరంభం కాకముందు నుండి ఉన్నాయి. ఈ మూడుగుణములకు ఆది అంతము లేదు. ఈ మూడు గుణములు జీవన ప్రవాహం లాంటివి. అవి మానవుని దిశను దశను నిర్దేశిస్తాయి. వారి వారి గుణభేదములను బట్టి వారి దశ దిశ మారుతూ ఉంటుంది.

ఉదాహరణకు సత్వగుణ సంపన్నుడు భగవంతుని అనుగ్రహం కొరకు అనునిత్యం ప్రయత్నిస్తుంటాడు. ఆ ప్రయత్నంలో భాగంగానే పూజలు, యజ్ఞములు చేస్తుంటాడు. పరమాత్మను చేరుకోడానికి వీటిని సాధనంగా ఎంచుకుంటాడు. అలాగే రజోగుణము వారు, తమోగుణము వారు తమ తమకు అనుకూలమైన మార్గములను ఎంచుకుంటారు. కాని ఈ మార్గములన్నీ బంధనములు కలిగించేవే. ఈ మూడుగుణముల ప్రభావం నుండి బయట పడితే కానీ నిర్గుణ తత్వము అలవడదు. అప్పుడే నిర్గుణుడు అయిన పరమాత్మను చేరుకోగలడు. ఈ నిర్గుణ తత్వం అలవడాలంటే తృష్ణ అంటే దురాశ నశించాలి. మనలో ఉన్న వికారములను పోగొట్టుకోవాలి. గుణాల మధ్య సమత్వం అలవడాలి. కాని, ఈ మూడుగుణములలో ప్రవర్తించినన్నాళ్లు మానవుడు జనన మరణములు పొందుతూ ఉంటాడు.

ఈ మూడు గుణములు సమానంగా ఉన్న స్థితిని మహత్తత్వము అని అంటారు. అది అవ్యక్త స్థితి. ఆ స్థితి ఆనందకరమైనది. మార్పులేనిది, శాశ్వతమైనది. ఈ అవ్యక్తము అనే స్థితి సత్ అసత్ కంటే అతీతమైనది. ఈ తత్వం తెలుసుకోవాలంటే జ్ఞానం కావాలి. ఆ జ్ఞానంతో ఈ మహత్తత్వం గురించి తెలుసుకున్న వాడు మోక్షమును పొందుతాడు. ఇప్పుడు దీని పరిణామ క్రమాన్ని వివరిస్తాను.

అవ్యక్తము లో నుండి మహత్ తత్వము పుట్టింది. ఆ మహత్ తత్వమే జ్ఞానమునకు, అన్ని గుణములకు మూలము. ఈ మహత్ తత్వమే మొట్ట మొదటి సృష్టి. ఈ మహత్ తత్వాన్ని పరమాత్మ అనీ, విజ్ఞానము అనీ, విష్ణువు అనీ, శంభు, బుద్ధి, ధృతి అనీ వివిధ నామములతో పిలుస్తారు. ఈ సృష్టిలో జరిగే అన్ని కర్మలకు మూలం ఆ మహత్ తత్వమే. ఈ మహత్ తత్వము గురించి తెలుసకున్న సాధకుడు ఈ మూడుగుణముల మాయలో పడడు. ఈ మహత్ తత్వము ఈ అనంత విశ్వం అంతా నిండి ఉంది. అదే విధంగా అందరి హృదయాలలో చైతన్య స్వరూపంగా నిండి ఉంది. ప్రాణులలోని సూక్ష్మ, స్థూల తత్వములు ఆ మహత్ తత్వమే. ఆ మహత్ తత్వమే ఈ జగత్తు కంతా నిర్దేశకుడు. ప్రభువు. పాలకుడు. ఆ మహత్ తత్వము గురించి తెలుసుకోవడమే జ్ఞానము. ఆ జ్ఞానము గురించి తెలుసుకోడానికి సత్వగుణ సంపన్నులు ఇంద్రియ నిగ్రహము, మనోనిగ్రహము అవలంబించి, అనునిత్యం ధ్యానం చేస్తుంటారు. అటువంటి వారికి లోభము, క్రోధము, మోహము మొదలగు లక్షణములు ఉండవు. వారిలో అహంకారము మచ్చుకైనా కనిపించదు. వీరు భవబంధనములు అన్నీ తెంచుకొని మోక్షము కొరకు ప్రయత్నిస్తుంటారు.

ఆ మహత్ తత్వము నుండి అహంకారము అంటే “నేను” అనే తత్వము పుట్టింది. ఇది సృష్టి క్రమంలో రెండవ సృష్టి. ఈ చరాచర సృష్టికి మూలము ఈ అహంకారమే. ఈ రెండవ సృష్టినే ప్రజాపతి అని అంటారు. ఈ ప్రజాపతి నుండి సృష్టి మొదలయింది. ఆ ప్రజాపతి మూడు లోకములను సృష్టించాడు. అప్పటి నుండి నేను, నాది అనే భావన మొదలయింది. ఈ అహంకారములు మూడు రకములు. సాత్వికాహంకారము, రాజస అహంకారము, తామస అహంకారము అంటే అహంకారము ఈ మూడుగుణములతో చేరి ప్రకటితమయింది. ఈ అహంకారము నుండి పంచతన్మాత్రలు ఆవిర్భవించాయి. వాటినే శబ్ద, స్పర్శ, రస, రూప, గంధములు అని అంటారు. ఈ పంచ తన్మాత్రలే పంచభూతములుగా అంటే ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథివిగా రూపాంతరం చెందాయి. ఈ విధంగా ప్రకటితమైన పంచ భూతములు ఒకదానిలో ఒకలీనం అవుతూ చివరకు ఈ అనంత సృష్టి అంతా మహత్ తత్వములోకి లీనం అవుతుంది. దానినే మహాప్రళయము అని అంటారు.

ఈ ప్రళయకాలంలో ప్రతి వస్తువు కూడా తాను దేని నుండి ఉద్భవించిందో, అదే వస్తువులో లీనం అవుతుంది. ఉదాహరణకు నీటి నుండి భూమి వస్తే, భూమి నీటిలో కలిసి పోతుంది. అలాగే నీరు అగ్నిలో, అగ్ని వాయువులో, వాయువు ఆకాశంలో, ఆకాశం మహత్ తత్వంలో కలిసిపోతాయి. అంటే సృష్టి ఎలా క్రమ పద్ధతిలో జరిగిందో అదే క్రమపద్ధతిలోనే ఒకదానిలో ఒకటి లయం అవుతాయి. ఉదాహరణకు మట్టి నుండి రకరకాల కుండలు తయారయ్యాయి. అలాగే బంగారం నుండి వివిధములైన ఆభరణములు తయారయ్యాయి. కుండ పగిలిపోతే, ఆభరణములు కరిగిస్తే, కుండ మట్టిగానూ, ఆభరణములు బంగారంగానూ మారిపోతాయి. మానవ శరీరం కూడా పడిపోగానే గాలి గాలిలో కలిసిపోతుంది. మిగిలినవి వాటి వాటి స్వస్వరూపాలలో కలిసిపోతాయి.

ఇది ప్రాకృతిక ప్రళయము. ఒకదాని నుండి ఒకటి పుడుతుంది. ఆ పుట్టినది దేనినుండి పుట్టినదో అందులోనే లీనం అవుతుంది. ఇది ప్రాకృతిక ధర్మము. జ్ఞానులు ఈ సత్యాన్ని తెలుసుకొని దేనికీ దు:ఖించరు. కాని సాధారణ మానవులు ఈ మూడుగుణములనుండి పుట్టిన మాయలో పడి, వ్యామోహానికి లోనై, కనపడేదంతా శాశ్వతము అనుకకుంటూ ఉంటారు. మోహము అనే అంధకారంలో మునిగిపోతారు.

ఆ మోహము నుండి బయటకు రావడం చాలా కష్టము. ఆ వ్యామోహము నుండి బయటకు రావాలంటే జ్ఞానము ఒక్కటే మార్గము. ఆ జ్ఞానం ఎటువంటిది అంటే.... విషయ సుఖాలు అశాశ్వతములు. విషముతో సమానము. అవే అన్ని వికారములకు మూలము. ఈ విషయ సుఖాలు లోభాన్ని, మోహాన్ని కలిగిస్తాయి. మంచి వాడిని కూడా దుర్మార్గుడిగా మారుస్తాయి. ఈ విధంగా తెలుసుకోవడమే జ్ఞానము. ఆ జ్ఞానముతో నిష్కామంగా కర్మలు ఆచరిస్తూ్చ దేని మీదా సంగము పెట్టుకోకుండా, ఇంద్రియములను, మనసును నిగ్రహించి, మనసును ఆత్మయందు నిలిపి సాధన చేయాలి. అప్పుడే ఈ మూడుగుణముల నుండి పుట్టిన మాయలో నుండి బయటపడతాడు. కాని అజ్ఞానులు అయిన మానవులు ఈ శరీరమే సత్యము అని నమ్మి, అవయవాలు కలిగించే సుఖాలకు లోబడి పోతారు. ఆ వ్యామోహంలో పడి అధోగతి పాలవుతారు.

ఓ బ్రాహ్మణులారా! ఇప్పుడు మీకు అవయవాల గురించి వివరిస్తాను. ఆకాశము నుండి శబ్దము పుట్టింది. ఆ శబ్దమును గ్రహించేది చెవులు. ఆ చెవులు నలుదిక్కుల నుండి వచ్చే శబ్దములను గ్రహిస్తాయి. శబ్దము నుండి వాయువు పుట్టింది. వాయువు లక్షణము స్పర్శ. ఈ స్పర్శను గ్రహించేది చర్మము. స్పర్శ వలననే మానవునికి వాయువు యొక్క ఉనికి తెలుస్తుంది. వాయువు నుండి అగ్ని పుట్టింది. అగ్ని గుణము వెలుగు, కాంతి. ఆ కాంతిని గ్రహించేది కన్ను. వెలుగులో కనపడే వస్తువుల ఉనికిని కళ్లు గ్రహిస్తాయి. అగ్ని నుండి జలము పుట్టింది. జలము యొక్క తత్వము రుచి. రుచిని గ్రహించేది నాలుక. ఆహారము, పానీయముల యొక్క రుచిని నాలుక గ్రహిస్తుంది. జలము నుండి భూమి పుట్టింది. భూమి లక్షణము వాసన. భూమిలో నుండి పుట్టిన వృక్షములు, మొక్కలు, పూలు పండ్లు వివిధములైన వాసనలను వెదజల్లు తుంటాయి. ఆ వాసనలను గ్రహించేది ముక్కు. ఈ విధంగా పంచభూతములు పంచ జ్ఞానేంద్రియములతో మిళితమై ఉన్నాయి.

బయట ప్రపంచంలో ఉన్న వివిధములైన విషయములను జ్ఞానేంద్రియములు మనసుకు చేరవేస్తుంటాయి. తరువాత రెండు కాళ్లు ఈ శరీరమును ఎక్కడికి కావాలంటే అక్కడికి ఏ వాహనము అవసరం లేకుండా తీసుకొని వెళతాయి. అందుకే అవి గతిమంతములు. ఈ గతికి మూలము విష్ణువు. అందుకే విష్ణువును సర్వవ్యాపి అన్నారు. అపానము అనే వాయువు శరీరములోని వ్యర్థములను బయటకు తోసేస్తుంది. దాని అధిష్టాన దేవత మిత్రుడు. తరువాతది జననాంగము. స్త్రీపురుషుల కలయిక వలన సంతానోత్పత్తి జరిగి, సృష్టిక్రమము కొనసాగుతుంది. దీనికి అధిష్టాన

దేవత ప్రజాపతి. రెండు చేతులు కార్యాచరణకు ప్రతీక. రెండు చేతులతోనే అన్ని కార్యములు నెరవేరుస్తాము. వీటికి అధిష్టాన దేవత ఇంద్రుడు. తరువాతది వాక్కు అంటే మాట. వాక్కుకు మూలము నోరు. వాక్కు వలన వేదములు పుట్టాయి. వాక్కుకు అధిష్టాన దేవత అగ్ని. వాక్కు అగ్నితో సమానము. (రకారము అగ్ని బీజము అంటారు. అందుకే రామ శబ్దమునకు అంతటి పవిత్రత ప్రాముఖ్యము కలిగాయి.) తరువాతది మనసు ఈ మనసు అతి చంచలమైనది అన్ని కోరికలకు, సంకల్పములకు మూలము. దీని అధిష్టాన దేవత చంద్రుడు.

తరువాతది అహంకారము. ఈ అహంకారము లేకపోతే మానవుని జీవన యానము నడవదు. ఒక్క మానవులే కాదు. అన్ని జీవజాతులకు ఈ అహంకారము తప్పనిసరిగా ఉంటుంది. ఈ అహంకారమునకు అధిష్టాన దేవత రుద్రుడు. తరువాతది బుద్ధి. విచక్షణా శక్తి. పూర్వము తాను చదివిన, విన్న,చూచిన విషయములను.తనలో పదిలపరచుకొని, అవసరము వచ్చినపుడు, ఆయా సమయములలో మనసుకు చేరవేసి, మంచి మార్గములో నడిపించేది బుద్ధి. ఈ బుద్ధికి జ్ఞానము తోడైతే ఆ మానవుడు మహాజ్ఞాని అవుతాడు. ఈ బుద్ధికి అధిష్టాన దేవత బ్రహ్మగారు. పంచ భూతములు, వాక్కు, మనసు, బుద్ధి ఈ ఎనిమిది కలిపి అంతరాత్మ అని అంటారు.

ఇంక సృష్టి గురించి చెబుతాను వినండి. ఈ సృష్టికి ఆధారము భూమి, నీరు, ఆకాశము. ఈ లోకములో జీవరాసులు నాలుగు రకాలుగా పుడతాయి. మొదటిది అండము. వీటిని అండజములు అంటే గుడ్డు నుండి పుట్టేవి. కొన్ని భూమి నుండి పుడతాయి. ఇవి మొక్కలు చెట్లు. కొన్ని చెమట నుండి పుడతాయి. వాటిని స్వేదజములు అని అంటారు. నాలుగవది గర్భమునుండి బయటకు వస్తాయి. ఈ విధంగా ఈ సృష్టి నాలుగు విధాలుగా జరుగుతుంది. ఈ జీవరాసులు కూడా రెండు కాళ్లు, నాలుగు కాళ్లు, అనేక కాళ్లు కలవిగా విభజింపబడ్డాయి ఈ విధంగా సృష్టి కొనసాగుతూ ఉంటుంది.

మానవుడు చేయవలసిన కర్మలు శాస్త్రఅధ్యయనము, తాను అధ్యయనం చేసినవాటిని ఇతరులకు బోధించడం, యజ్ఞయాగములు చేయడం, దానధర్మములు చేయడం. ఇవే మానవుని ముఖ్యమైన కర్మలు. ఎవరైతే ఈ సృష్టిక్రమము గురించి తెలుసుకుంటారో, వారు జ్ఞానులు, యోగులు అని చెప్పబడతారు. అటువంటి వారు ఈ దు:ఖాలయము అయిన సంసారము నుండి విముక్తి పొందుతారు.

ఇప్పుడు మీకు అధ్యాత్మ తత్వమును గురించి ఉపదేశిస్తాను. ఈ అధ్యాత్మ తత్వము గురించి జ్ఞానులైన మహాఋషులు చక్కగా తెలుసుకొన్నారు. ఇంద్రియములు, పంచ తన్మాత్రలు, పంచభూతములు, వీటన్నిటిగురించి అసలైన జ్ఞానమును మనసు, బుద్ధిద్వారా చక్కగా తెలుసుకోగలగాలి. ఆ విధంగా తెలుసుకున్న జ్ఞాని ప్రాపంచిక విషయముల వంక, విషయవాంఛల

వంక కన్నెత్తి కూడా చూడడు. వాటి జోలికి పోడు. నిర్లిప్తంగా ఉంటాడు. శాస్త్ర జ్ఞానము కల సాధకుడు అసలైన ఆత్మానందము కొరకు వెదుకుతాడు కానీ, ప్రాపంచిక విషయముల సంగమము వలన కలిగే ఆనందం కొరకు ప్రయత్నించడు.

ఇప్పుడు మీకు ఈ ప్రాపంచిక విషయముల నుండి, విషయ వాంఛల నుండి ఎలా విముక్తి పొందాలో వివరిస్తాను. అన్నింటి కన్నా ముందు ప్రాపంచిక విషయముల పట్ల ఆసక్తిని, అనురక్తిని తగ్గించుకోవాలి. సాధ్యమైనంతవరకు ఒంటరిగా ఉండటానికి ప్రయత్నించాలి. ద్వంద్వాలకు అతీతంగా ఉండాలి. మనసును ఎల్లప్పుడూ పరబ్రహ్మయందు చరింపచేయాలి. ఈవిధంగా చేయడం వలన అసలైన ఆనందం కలుగుతుంది. తాబేలు తన అంగములను లోపలకు తీసుకున్నట్టు, సాధకుడు తన ఇంద్రియములను బాహ్య ప్రపంచము నుండి వెనుకకు లాగి తనలోకి ఇముడ్చుకోగలిగితే, అతడు అపరిమితమైన ఆనందమును అనుభవించగలడు. కేవలం ఇంద్రియములనే కాకుండా మనసును కూడా నియంత్రించగలగాలి. మనసులోని కోరికలను నియంత్రించగలగాలి. తనలో ఉన్న తృష్ణను పూర్తిగా నాశనం చేయాలి. దానికి సాధనం ధ్యానం ఒక్కటే. అప్పుడు సృష్టిలోని అన్ని జీవరాసులను సమానంగా చూడగల భావన అలవడుతుంది. ఈ విధంగా చేస్తే ఆ సాధకుడు పరబ్రహ్మలో ఐక్యం కాగలడు.

ఇంతకు ముందు చెప్పబడిన ఇంద్రియ నిగ్రహము సామాన్యము కాదు. దానిని అభ్యాసం చేయాలంటే ముందు పోకూడని ప్రదేశములకు పోకూడదు. తినకూడనివి తినకూడదు. తాగకూడనివి తాగకూడదు. చూడకూడనివి చూడకూడదు. అప్పుడు అతనిలో అధ్యాత్మ తత్వము మెల్లి మెల్లిగా నాటుకుంటుంది. ఈ అధ్యాత్మ తత్వము కట్టెలో నిప్పుదాగిఉన్నట్టు దాగి ఉంటుంది. ఇంద్రియ నిగ్రహము మనోనిగ్రహము పాటించిన వారిలో ఈ అధ్యాత్మ తత్వము మండే అగ్నిలాగా ప్రజ్వరిల్లుతుంది. ఇదంతా జరగాలంటే ముందు మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలి. ప్రశాంత మనస్కుడు ఈ పంచభూతములను తనలోనే చూచుకోగలడు. (అగ్ని (శరీర ఉష్ణోగ్రత), వాయువు (స్పర్శజ్ఞానము), నీరు (రక్తము మొదలగు ద్రవములు), పృథివి (శరీరంలో ఉన్న మాంసము, ఎముకలు), ఆకాశము (శబ్దము గ్రహించే చెవులు)).

ఈ శరీరములో ఐదు ప్రాణములు శరీరం అంతా సంచరిస్తుంటాయి. ఈ శరీరమునకు తొమ్మిది ద్వారములు, మనస్సు బుద్ధి అనే రెండు సూక్ష్మతత్వములు ఉన్నాయి. ఈ శరీరము సత్వ, రజస్తమోగుణములతో నిండి ఉంటుంది. ఇన్ని ఉన్న ఈ శరీరము వ్యామోహము అనే మాయతో కప్పబడి తన నిజస్వరూపమును తెలుసుకోలేదు. ఎల్లప్పుడూ ప్రాపంచిక విషయముల యందు ఎక్కువ ఆసక్తి చూపుతుంటుంది. వాటి మోహములో పడి వాటి వలన బంధింపడుతూ ఉంటుంది. ఈ శరీరము కాలము యొక్క అధీనంలో ఉంటుంది. కాలము తీరి పోగానే కాలధర్మం చెందుతుంది. ఈ శరీరము సంసారము, భ్రాంతి అనే మహాసముద్రములో పడి ఈదుతూ

ఉంటుంది. తీరము కనిపించక వ్యధ చెందుతూ ఉంటుంది.

ఈ సంసార సాగరము నుండి బయట పడటానికి కూడా ఒకే ఒక మార్గం ఉంది. ఎవరైతే ఇంద్రియములను తన అదుపులో ఉంచుకుంటారో, తనలో ఉన్న మోహమును,కామమును, లోభమును, క్రోధమును, మదమును, మాత్సర్యమును వదిలిపెడతారో, వారే సంసారసాగరమును దాటగలరు కానీ వీటిని వదిలించుకోవడం చాలా కష్టం. ఎంతో సాధన చేయాలి. ఇవి మానవునిలో ఉన్న మూడు గుణములతో మిళితమై ఉంటాయి. కాబట్టి ముందు సాధకుడు గుణాతీతుడు కావాలి. అప్పుడే మోక్షమునకు అర్హుడు అవుతాడు. అటువంటి సాధకుడు ఈ ప్రపంచంలో తనను, తనలో ఈ ప్రపంచాన్ని చూసుకుంటాడు. తనలోనూ అందరిలోనూ పరమాత్మ ఆత్మస్వరూపుడుగా వెలుగుతున్నాడు అన్న సత్యం గ్రహిస్తాడు. ఒక దీపము నుండి అనేక దీపములు వెలిగినట్టు ఒకే పరమాత్మ నుండి అనేక మైన ఆత్మలు ఉద్భవించాయి అని తెలుసుకుంటాడు. ఆ పరమాత్మనే సృష్టి, స్థితి,లయకారుడుగా మూడు రూపములలో భావిస్తాడు. ఆ పరమాత్మ యొక్క విశ్వరూపాన్ని తనలోనే దర్శిస్తాడు. ఆ విశ్వరూపాన్ని దేవతలు, అసురులు, రాక్షసులు, సిద్ధులు, సాధ్యులు గంధర్వులు, మహాఋషులు మొదలగు సుర అసుర గణములు సేవించడం తనలోనే దర్శిస్తాడు." అని బ్రహ్మ ఋషులతో అన్నాడు.

బ్రహ్మ వారితో ఇంకా ఇలా అంటున్నాడు. "ఓ బ్రాహ్మణులారా! బ్రాహ్మణులు సత్వగుణ ప్రధానులైతే, క్షత్రియులు రజోగుణ ప్రధానులు, వారిలో సత్వము తక్కువగా, రజోగుణము ఎక్కువగా, తామసము దానికంటే తక్కువగా ఉంటుంది. మానవులలో బ్రాహ్మణుడు ప్రధానుడు. తరువాతి స్థానము క్షత్రియుడు. అడవిలో ఉన్న జంతువులలో సింహము, యజ్ఞములో బలి ఇచ్చే జంతువులలో మేక, భూమి అడుగున నివసించేవాటిలో పాము, పశువులలో ఆవు, వృక్షములలో రావి చెట్టు, పర్వతములలో హిమవత్పర్వతము, గణములలో మరుత్తులు, పితృదేవతలలో యముడు, జలాశయాలలో సముద్రము, నీటికి వరుణుడు, మరుత్తులలో ఇంద్రుడు, జ్వలించేవాటిలో సూర్యుడు, దేవతలలో ఇంద్రుడు, పంచభూతములలో అగ్ని, ఓషధులకు చంద్రుడు, బ్రాహ్మణులలో బృహస్పతి, వీరందరిలోకి విష్ణువు, గొప్పవారు. రుద్రులలో ఈశ్వరుడు, క్రతువులలో యజ్ఞము, దిక్కులలో ఉత్తరము, ధనాధిపతులలో కుబేరుడు, ఈ విధంగా సృష్టిలో శ్రేష్టమైనవి ఉన్నాయి.

ఈ సృష్టి అంతా నా చేత చేయబడుతూ ఉంది. నా కంటే గొప్పవాడు విష్ణువు. ఆ పరమాత్మయే సృష్టి స్థితి లయములకు అధిపతి. సమస్త జీవరాసులకు ఆయనే అధిపతి. కోరికలు అధికంగా కలిగిన మానవులు శక్తి స్వరూపిణి అయిన పార్వతిని పూజిస్తారు. ఆ పరదేవతయే స్త్రీలలో గొప్పది. పవిత్రమైనది. దేవకన్యలలో అప్సరసలు తమ అందానికి లావణ్యానికి పెట్టింది పేరు. ప్రజలను రక్షించేవారిలో రాజు గొప్పవాడు. రాజులు ఎల్లప్పుడూ ధర్మరక్షణ కొరకు బ్రాహ్మణులను గౌరవించి వారిని పోషిస్తూ ఉంటారు. బ్రాహ్మణులు రాజులను ధర్మమార్గం తప్పకుండా

నడిపిస్తుంటారు. బ్రాహ్మణులు లేకపోతే క్షత్రియులు ధర్మం తప్పి ప్రవర్తిస్తారు. అప్పుడు అరాచకం ప్రబలుతుంది. కాబట్టి సత్వగుణ ప్రధానులైన బ్రాహ్మణుల సాయంతో క్షత్రియులు రాజ్యపాలన సాగిస్తే, వారు, వారి రాజ్యములోని, ప్రజలు సుఖ సంతోషాలతో ప్రశాంతంగా జీవిస్తారు.

ఇప్పుడు మీకు మానవుడు ఆచరించ వలసిన నియమ నిబంధనల గురించి వివరిస్తాను. మానవులకు అహింసయే పరమధర్మము. హింస చేయడం అధర్మానికి ప్రతీక. దేవతలకు ప్రకాశము సహజలక్షణము. దేవతా లక్షణములు కలిగిన మానవులు కూడా ప్రకాశిస్తుంటారు. మానవుల గుణములు వారు చేసే కర్మల వలన బహిర్గతం అవుతుంటాయి. ఆకాశము లక్షణము శబ్దము. వాయువు లక్షణము స్పర్శ. అగ్ని లక్షణము రూపము. జల లక్షణము రుచి. భూమి లక్షణము వాసన. వాక్కు లక్షణము శబ్దములు పలకడం. మనసు లక్షణం సంకల్పించడం. బుద్ధిలక్షణం ఆలోచన, విశ్లేషణ. మనసులో మెదిలే సంకల్పాలకు ఒక రూపునిచ్చేది బుద్ధి. సత్వగుణ సంపన్నుని లక్షణం దేనికీ అంటుకోకుండా ఉండటం. శ్రద్ధయొక్క లక్షణం చేసే కర్మలో కనపడుతుంది. మోక్షము యొక్క లక్షణం జ్ఞానము. కాబట్టి మోక్షమార్గములో నడవాలంటే జ్ఞానసముపార్జన ముఖ్యము. మోక్షమార్గములో పయనించాలనుకునే సాధకుడు, ముందుగా జ్ఞానం సంపాదించాలి; ద్వంద్వములకు అతీతంగా ఉండాలి; గుణములను దాటాలి. అప్పుడే మోక్షపథమును చేరుకోగలడు. ఇప్పటి వరకు మీకు మోక్షము పొందాలంటే ఏమేమి చెయ్యాలో చెప్పాను.

ఇప్పుడు అధ్యాత్మ, అధిభూత, అధిదైవతముల గురించి చెబుతాను వినండి.

| అధ్యాత్మము | అధిభూతము | అధిదైవతము |
|---|---|---|
| చెవి | శబ్దం | దిక్కులు |
| చర్మం | స్పర్శ | అగ్ని |
| కన్ను | రూపం | సూర్యుడు |
| నోరు | రసం | చంద్రుడు |
| ముక్కు | గంధం | వాయువు |

మనస్సు యొక్క లక్షణం ఆలోచన, సంకల్పము. బుద్ధియొక్క లక్షణము ఆలోచనలను సంకల్పాలను విశ్లేషించడం, మంచి చెడులను నిర్ణయించడం. బుద్ధి అనేది తన నిర్ణయాల ద్వారా బహిర్గతమౌతుంది. బుద్ధి నిర్ణయించిన తరువాత మనసు సంకల్పిస్తుంది. ఆ సంకల్పములను ఇంద్రియములను ఆచరణలో పెడతాయి. వీటన్నిటినీ సాక్షీభూతంగా చూచేవాడు ఆత్మస్వరూపుడైన పరమాత్మ. ఆత్మకు బుద్ధి చేసే నిర్ణయాలతో కానీ, మనసు చేసే సంకల్పాలతో కానీ, ఇంద్రియములతో చేసే కర్మలతో కానీ ఎటువంటి సంబంధము లేదు. కాబట్టి శరీరము అనే ఈ క్షేత్రములో ఉన్న ఆత్మ

అనే క్షేత్రజ్ఞుడికి ఎటువంటి వికారములు బంధనములు లేవు. ఈ క్షేత్రజ్ఞుడు జ్ఞానస్వరూపుడు. జ్ఞానము చేతనే తెలియబడతాడు. ఈ క్షేత్రము అవ్యక్తము. అవ్యక్తమైన క్షేత్రము గురించి తెలుసుకున్న వాడు క్షేత్రజ్ఞుడు. అవ్యక్తమైన ఈ క్షేత్రము సత్వ రజస్తమోగుణముల చేత ప్రభావితమౌతుంది. అజ్ఞానము వలన క్షేత్రము మూడుగుణముల మాయలో పడిపోతుంది. కాని పరమాత్మ ఆ మూడు గుణముల కంటే అతీతుడు. అందుకని ఆత్మస్వరూపుడు అయిన క్షేత్రజ్ఞునకు ఈ మూడు గుణముల గురించి తెలుసు. కాబట్టి వాటి మాయలో పడకుండా కేవలం సాక్షీభూతంగా చూస్తుంటాడు. కాబట్టి సాధకుడు కర్మల గురించి కర్మఫలముల గురించి తెలుసుకొని, గుణములను వదిలిపెట్టి, ద్వంద్వములను అతీతంగా ఉంటూ, జ్ఞానమును సముపార్జించి, ఆత్మతత్వమును తెలుసుకుంటాడు. తుదకు మోక్షమును పొందుతాడు.

ప్రకాశవంతమైన వాటిలో సూర్యుడు, పంచభూతములతో అగ్ని, విద్యలలో సావిత్రి విద్య, దేవతలలో ప్రజాపతి, మంత్రములలో ఓంకారము, వాయువులలో ప్రాణవాయువు, ఛందస్సులతో గాయత్రి ఛందస్సు, నాలుగు కాళ్ల జంతువులలో మేక, ఆవు, మానవులలో బ్రాహ్మణుడు, పక్షులలో డేగ, యజ్ఞములలో హవిస్సు , యుగములలో కృతయుగము, ధాతువులలో బంగారము అత్యంత శ్రేష్టమైనవి. ఇంకా ధాన్యములలో యవలు, ఆహారములో అన్నము, పానీయాలలో నీరు, శిఖరములలో మేరువు, వృక్షములలో జువ్వి చెట్టు, దిక్కులలో ఊర్ధ్వ దిక్కు, నదులలో గంగ, జలాశయములలో సముద్రము, ఆశ్రమములలో గృహస్థాశ్రమము, ప్రజాపతులలో నేను అంటే బ్రహ్మ, శ్రేష్టమైనవి. నాకంటే పెద్ద విష్ణువు. దేవతలలోకి పెద్ద ఈశ్వరుడు. ఈ విధంగా ఏఏ తత్వాలలో ఏది శ్రేష్టమో తెలుసుకోవడమే బ్రహ్మజ్ఞానము. బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు భేదము లేదు అని తెలుసుకోవడమే పరిపూర్ణజ్ఞానము.

ఈ ప్రపంచంలో చర, అచరములు అంటే కదలేవి, కదలనివి, పుడుతుంటాయి, పెరుగుతుంటాయి, మరణిస్తుంటాయి. వాటి గురించి వివరిస్తాను. పగలు తరువాత రాత్రి, రాత్రి తరువాత పగలు వస్తూ పోతుంటాయి. అలాగే చంద్రుడి వృద్ధి క్షీణతలను బట్టి పక్షములు, నెలలు వస్తుంటాయి. ప్రకృతిలో సంభవించే మార్పులను బట్టి ఋతువులు వస్తుంటాయి. ఒకదాని వెంట ఒకటి వస్తూ పోతుంటాయి. పగలు, రాత్రి ఎలా వస్తూ పోతుంటాయో అలాగే మానవులకు సుఖ దు:ఖములు వస్తుంటాయి పోతుంటాయి. పెరగడం తరగడం కొరకే, తరగడం పెరగడం కొరకే అని తెలుసుకోవాలి. కాబట్టి సుఖాలు కలిగినపుడు పొంగి పోవడం, దు:ఖాలు వచ్చినపుడు కుంగి పోవడం తగదు. వృద్ధి చెందినవి అన్నీ క్షీణించడం ప్రకృతి ధర్మము. మానవుడు పెంచుకున్న బంధాలన్నీ తుదకు తుంచబడతాయి. దీనికి పరాకాష్ట మరణము. మరణముతో బంధాలన్నీ తుంచబడతాయి.

పుట్టినవన్నీ మరణించక తప్పదు. వృద్ధి చెందినవి అన్నీ క్షీణించక తప్పదు. ఈ సృష్టిలోని చరాచర జీవరాసులు శాశ్వతములు కావు. అన్నీ మార్పుచెందుతూ తుదకు నశించి పోయేవే. అంతేకాదు, స్వర్గసుఖముల కొరకు చేసే యజ్ఞములు, యాగములు, దానములు, పూజలు వ్రతాలు

ఇవి కూడా శాశ్వతములు కావు. ఆత్మజ్ఞానము శాశ్వతము. ఎవరైతే తన ఇంద్రియములను నిగ్రహించి అహంకారమును వదిలిపెట్టి, ప్రశాంతమైన మనస్సుతో, ధ్యానయోగమును అవలంబిస్తే అతడు అన్నిపాపముల నుండి విముక్తుడు అవుతాడు.

జీవన చక్రము నిరంతరము తిరుగుతూనే ఉంటుంది. మానవునిలో బుద్ధియే దానియొక్క శక్తి. మనస్సు అనే ఇరుసు మీద తిరుగుతూ ఉంటుంది. ఇంద్రియములే దాని ఆకులు. పంచ భూతములే ఆ ఆకులను కలిపిఉంచే చుట్టు ఉన్న ఇనపచట్రము. ఆ చక్రము జరా,వ్యాధి,మరణములచే నిండి ఉంటుంది. ఆ చక్రము కొంత కాలము, కొంత ఆవరణము కలిగి ఉంటుంది. రాత్రి పగలు ఆ చక్రము యొక్క చలనము. శీతోష్ణములు, సుఖదు:ఖములు, ఆకలి దప్పులు మొదలగు ద్వంద్వములు ఆ చక్రమును కలిపిఉంచే అతుకులు, చీలలు. ఈ చక్రము కనురెప్పపాటులో తిరుగుతూ ఉంటుంది. ఈ చక్రము గిరగిరా తిరుగుతుంటే అంతా మాయగా, భ్రమగా కనిపిస్తుంది. ఈ జీవన చక్రభ్రమణంలో రోజులు, పక్షములు, నెలలు, సంవత్సరములు గడిచిపోతుంటాయి.

ఈ ప్రపంచంలో ఏదీ నిలకడగా ఉండదు. నిరంతరం మార్పుచెందుతూ ఉంటుంది. ఈ జీవన చక్రము అహంకారంతో ప్రకాశిస్తూ ఉంటుంది. మూడుగుణముల ప్రభావం కలిగి ఉంటుంది. ఆ ప్రభావం నుండి ఎవరూ తప్పించుకోలేరు. ఈ జీవన చక్రపరిభ్రమణం ఎక్కువగా దు:ఖము, అశాంతి, అనుకున్నది కాకపోవడం వలన వచ్చే నిరాశ నిస్పృలతోనే నిండి ఉంటుంది. ఇవే బంధనాలను కలుగజేస్తాయి. ఈ జీవన చక్రములో కర్మలు చేయడం, వాటి ఫలితములను అనుభవించడం, ఆ ఫలితములయొక్క వాసనలను మూటగట్టుకోవడం, తద్వారా మరోజన్మ కలగడం జరుగుతూ ఉంటుంది.

ఈ కర్మలకు మూల కారణం మానవునిలోని లోభత్వము, కోరికలు, బంధాలు, అనుబంధాలు. ఇవన్నీ కూడా మానవునిలోని అజ్ఞానము వలన కలుగుతాయి. ఈ అజ్ఞానం మానవునిలో ఒక విధమైన భయం, భ్రాంతిని కలుగచేస్తుంది. అన్నింటినీ తప్పుగా అర్థం చేసుకుంటాడు. ఎల్లప్పుడూ ప్రాపంచిక సుఖాల వెంట పరుగెడుతూ ఉంటాడు. అవి దొరకకపోతే కోపం తెచ్చుకుంటాడు. ఆ కోపమే అతని నాశన హేతువు.

ఓ బ్రాహ్మణులారా! ఈ ప్రకృతి అనేది మహత్ తత్వముతో మొదలై తుదకు పంచభూతములతో అంతం అవుతుంది. ఈ ప్రకృతిలో సృష్టి, లయములు నిరంతరము నిరాటంకముగా జరుగుతూనే ఉంటాయి. ఈ సృష్టిలయముల వేగము మనోవేగమును మించి ఉంటుంది. జీవరాసుల జీవన చక్రములో ద్వంద్వములు(సుఖదు:ఖములు మొదలైనవి) ప్రధాన పాత్రవహిస్తాయి. ఈ ద్వంద్వముల మోహములో పడిన వాడు అజ్ఞానముతో ఉంటాడు. కాని

మానవుడు తెలివి కల వాడు. తెలివి కల మానవుడు ఈ ద్వంద్వములకు అతీతుడుగా ఉంటాడు. జీవన చక్రము యొక్క పరిభ్రమణమును గ్రహించి దాని నుండి విడివడతాడు. అటువంటి సాధకుడు ద్వంద్వముల నుండి, పాపపుణ్యముల నుండి, బంధఅనుబంధముల నుండి, విముక్తుడు అయి పరమ పదమును చేరుకుంటాడు.

మానవుని జీవన విధానములో చెప్పబడిన నాలుగు ఆశ్రమములలో, అంటే బ్రహ్మచర్యము, గృహస్థు, వానప్రస్థము, సన్యాసము, వీటిలో గృహస్థాశ్రమము అన్నింటి కన్నా గొప్పది. గృహస్థాశ్రమములో శాస్త్రవిధులను సక్రమంగా ఆచరించే అవకాశం ఉంది. మిగిలిన ఆశ్రమములలో లేదు. ఈ గృహస్థాశ్రమము బ్రహ్మచర్యము తరువాతనే స్వీకరించాలి. మానవుడు జన్మించిన తరువాత జాతకకర్మ మొదలగు అన్ని సంస్కారములను పొందిన తరువాత పునీతుడై, ఉపనయనము చేసుకొని తరువాత బ్రహ్మచర్య ఆశ్రమమును స్వీకరించాలి. గురుముఖతా వేదములను శాస్త్రములను అభ్యసించాలి. తరువాత గురువు అనుమతితో వివాహం చేసుకొని గృహస్థ ఆశ్రమము స్వీకరించాలి. గృహస్థుగా, తన భార్యతో కలిసి అనునిత్యము పంచమహాయజ్ఞములను ఆచరించాలి. (దేవ యజ్ఞము, పితృ యజ్ఞము, గురుయజ్ఞము, మానుష యజ్ఞము, భూత యజ్ఞము). అంటే దేవతలను పూజించడం, యజ్ఞయాగములు చేయడం, శ్రాద్ధకర్మలు ఆచరించడం, వేదాధ్యయనము చేయడం, అతిథులను పూజించడం, సాటి జంతువులను ఆదరించడం ఇవీ పంచమహాయజ్ఞములు. ఇవి అన్నీ తన సహధర్మచారిణితో కలిసి చేయాలి. దేవతలకు, అతిథులకు పెట్టిన తరువాతనే తాము తినాలి. ప్రతిరోజు అగ్నికార్యము, వేద అధ్యయనము చేయాలి. తన శక్తి కొలదీ యజ్ఞయాగములు, దానధర్మములు చేయాలి.

గృహస్థు తన చేతులతో కానీ కాళ్లతో కానీ చేయకూడని పనులు చేయకూడదు. పోకూడని స్థలములకు పోకూడదు. అలాగే ఇంద్రియములను అదుపులో ఉంచుకోవాలి. అటువంటి గృహస్థును శిష్టాచారుడు అని అంటారు. ఈ శిష్టాచారుడు అయిన గృహస్థు ఎల్లప్పుడూ విడవకుండా యజ్ఞోపవీతమును, తెల్లని వస్త్రములను ధరించాలి. ఎల్లప్పుడూ సత్పురుషుల సాంగత్యములోనే కాలం గడపాలి. మనోనిగ్రహం కలిగి ఉండాలి. కామసంబంధమైన కోరికలను, జిహ్వాచాపల్యమును అరికట్టాలి. ఎల్లప్పుడూ సత్వగుణసంపన్నుడై ఉండాలి. యజ్ఞయాగములు తాను చేస్తూ ఇతరుల చేత చేయించాలి. తాను నేర్చుకున్న శాస్త్రపరిజ్ఞానమును ఇతరులకు అర్థం అయేటట్టు బోధించాలి. ఈ లక్షణములు కలిగిన వాడు మాత్రమే బ్రాహ్మణుడు అని పించుకుంటాడు.

మరి ఈ గృహస్థులకు జీవనోపాధి ఎలాగ అని సందేహము రావచ్చు. ఇతరులకు విద్య బోధించి, గురుదక్షిణల ద్వారా, యజ్ఞయాగములు చేయించి స్వీకరించే దక్షిణల ద్వారా, దానములు గ్రహించడం ద్వారా వారు తమ జీవనమును గడుపుకోవాలి. ఇంద్రియనిగ్రహము,

మనో నిగ్రహము, సాటి మానవుల పట్ల, జీవరాసుల పట్ల దయ, జాలి కరుణ కలిగి ఉండటం, ఏ పని చేసినా శ్రద్ధతో ఒక తపస్సులాగా చేయడం గృహస్థు యొక్క ముఖ్యలక్షణములు. ఈ విధంగా పవిత్రమైన మనసుతో తన జీవనమును గడిపే గృహస్థు, తుదకు పరమపదమును చేరుకుంటాడు.

బ్రహ్మచర్యమును ఆచరించే వటువు గురువుగారు చెప్పిన విధంగా వేదములు, శాస్త్రములు అధ్యయనము చేయాలి. ఇంద్రియ నిగ్రహము, మనోనిగ్రహము పాటించాలి. శాస్త్రనియమములను విధిగా పాటించాలి. సత్యవ్రతమును అవలంబించాలి. మానసికంగా, శారీరకంగా శుచిగా ఉండాలి. ప్రతిరోజూ అగ్నిహోత్రము చేయాలి. భిక్షాటన చేసి, తెచ్చిన ఆహారమును ముందు గురువుగారికి సమర్పించి మిగిలింది తాను భుజించాలి. చేతిలో ఎల్లప్పుడూ బిల్వవృక్షము మోదుగ వృక్షము యొక్క కర్ర ధరించాలి. పత్తితో చేసిన వస్త్రములు ధరించాలి. లేక జింక చర్మము ధరించాలి. ఆ వస్త్రముల యొక్క రంగు కాషాయవర్ణములో ఉండాలి. ముంజగడ్డితో పేనిన తాడును మొలకు కట్టుకోవాలి. తల వెంట్రుకలను పైకి ఎత్తి ముడి వేసినట్టు కట్టుకోవాలి. ఎల్లప్పుడూ యజ్ఞోపవీతము ధరించాలి. తన మనసులోకి లోభము, మోహము రానీయకూడదు. అటువంటి బ్రహ్మచారి అందరిచేతా గౌరవింపబడతాడు. ఈ విధంగా బ్రహ్మచర్యమును నిష్టగా పాటిస్తే అతనికి పునరజన్మ ఉండదు.

ఇటువంటి బ్రహ్మచారి గురువు గారి ఆజ్ఞతో గృహస్థాశ్రమము స్వీకరించి, తరువాత వానప్రస్థములోకి ప్రవేశించాలి. వారు కూడా పత్తితో చేతిన కాషాయరంగు వస్త్రములు కానీ జింక చర్మమును కానీ ధరించాలి. ప్రాపంచిక బంధములు అన్నీ విడిచిపెట్టాలి. జనపదములు వదిలిపెట్టి అడవులలో నివసించాలి. ఉదయము సాయంత్రము అగ్నికార్యమును నిర్వర్తించాలి. అడవులలో దొరికే పండ్లు, కాయలు, దుంపలు మొదలగు వాటిని ఆహారంగా తీసుకోవాలి. తన వద్దకు వచ్చిన అతిథులకు కూడా అవే పెట్టాలి. అంటే కేవలం అడవులలో దొరికే సహజమైన పదార్థములతోనే జీవనం గడపాలి. మితంగా భుజించాలి. ఎల్లప్పుడూ దైవధ్యానంలో గడపాలి. అతని మనసులో అసూయ ద్వేషములకు తావు ఉండకూడదు. కరుణ, దయ, జాలి అతని సహజలక్షణములుగా ఉండాలి. ఎల్లప్పుడూ వేదములు శాస్త్రములు చదువుతూ జ్ఞానము సంపాదించాలి. ఈ విధంగా వానప్రస్థ ఆశ్రమ వాసము చేసిన వారు, తుదకు మోక్షమును పొందుతారు.

అతడు బ్రహ్మచారి కానీ, గృహస్థు కానీ, వానప్రస్థుడు కానీ, తన పరిశుద్ధమైన మనసు, ప్రవర్తనతో మోక్షపదమును చేరుకోవచ్చు. నిష్కామ కర్మ పాటించడం, ప్రాపంచిక విషయములకు దూరంగా ఉండటం, సాటి జీవరాసుల యందుజాలి కరుణ దయ కలిగి ఉండటం, ఇవన్నీ సన్న్యాస ఆశ్రమములో ఉన్నవారికి ఉండవలసిన ముఖ్యలక్షణములు. సన్న్యాసులు తమ ఆహారం గురించి తాపత్రయపడకూడదు. అనాయాసంగా, అయాచితంగా తనకు లభించిన దానినే తినాలి.

భిక్షాటనకు ఏ సమయంలో వెళ్లాలంటే, గృహస్థులందరూ భోజనము చేసిన తరువాత, మిగిలిన ఆహారమును మాత్రమే భిక్షగా స్వీకరించాలి. మంచి ఆహారము దొరికినపుడు సంతోషించడం, ఏమీ దొరకనపుడు దు:ఖించడం పనికిరాదు. కేవలం తాను జీవించి ఉండటానికి దేహం నిలవడానికి సరిపడా ఆహారము మాత్రమే తీసుకోవాలి. ఎవరి దగ్గర నుండి రుచికరమైన పదార్థములను కానీ ధనమును కానీ వస్తువులను కానీ పొగడ్తలను కానీ ఆశించకూడదు, తీసుకోకూడదు.

సన్యాసి పొగడ్తలకు కానుకలకు దూరంగా ఉండాలి. సన్యాసి ఎవరి ఎంగిలి పదార్థములను తినరాదు. అలాగే ఎక్కువ పులుపు, కారము, తీపి, రుచి కలిగిన పదార్థములను తినరాదు. ముఖ్యంగా మాంసాహారమును తినరాదు. తన ఆహార వ్యవహారములకు ఎవరి మీదా ఆధారపడకూడదు. సాధ్యమైనంత వరకు ఏకాంత ప్రదేశములలో నివసించాలి. ఏకాంత గృహములు, చెట్టు మొదళ్లు, కొండ గుహలు మంచివి. ఎండాకాలములో, ఒకచోట ఒక రాత్రికి మించి ఉండరాదు. వానాకాలమునాలుగు నెలలు ఒకేచోట ఉండవచ్చును. (సన్యాసుల చాతుర్మాస్యవ్రతము ఇలాంటిదే. తొలి ఏకాదశి మొదలు కార్తీక పున్నమి వరకు ఉన్న నాలుగు నెలలు వానాకాలము.) సన్యాసి ప్రపంచం అంతా తిరుగుతూ జ్ఞాన బోధ చేయాలి. అంతే కానీ ఒకేచోట స్థిరంగా ఉండకూడదు. పాదచారిగానే వెళ్లాలి గానీ ఎటువంటి వాహనము ఉపయోగించకూడదు. తన ప్రయాణములో ఎవరితోనూ మిత్రత్వము కానీ శత్రుత్వము కానీ పెట్టుకోకూడదు.

సన్యాసి తనకుగా ఎటువంటి ధనమును, ధాన్యమును సమకూర్చుకోకూడదు. మోక్షకాంక్షి అయిన సన్యాసి బ్రహ్మచర్యము, సత్యవ్రతము, నిరాడంబరత, కోపం లేకపోవడం, ఇతరులను ద్వేషించకుండ ఉండటం, స్వీయనియంత్రణ కలిగి ఉండటం, మొదలగు సాత్విక లక్షణములను కలిగి ఉండాలి. సన్యాసిలో ఏ సమయంలోనూ పాపచింతన తలెత్తకూడదు. ఎవరితోనూ ఎటువంటి బంధములు కలిగి ఉండకూడదు. సన్యాసి కూడా అతిథి సత్కారములు చేయాలి. అతిథిని సత్కరించిన తరువాత, తానుజీవించడానికి ఎంత అవసరమో అంతే తినాలి. ఆ ఆహారము కూడా తాను న్యాయంగా, ధర్మంగా సంపాదించుకున్నది అయి ఉండాలి. అన్యాయార్జితము జోలికి వెళ్లకూడదు.

సన్యాసికి కోరికలు అంటూ ఉండకూడదు. సన్యాసి ఆహారము, వస్త్రములు తప్ప ఇతరములు ఎవరి వద్దనుండి తీసుకోకూడదు. అవి కూడా తనకు అవసరము ఉంటేనే తీసుకోవాలి. కూడబెట్టుకోవడానికి ఏమీ తీసుకోకూడదు. సన్యాసి ఇతరుల నుండి బహుమతులను స్వీకరించరాదు. తాను ఎవరికీ బహుమతులను ఇవ్వరాదు. సన్యాసి తన వద్ద ఉన్న ఆహారమును వస్త్రములను నిస్సహాయులైన నిరుపేదలతో పంచుకోవాలి. తాను ఒక్కడే అనుభవించకూడదు. సాటి జీవరాసుల ఎడల దయ కలిగి ఉండాలి.

సన్యాసి ఇతరుల ఆస్తులను, ధనమును అపహరించకూడదు. స్థూలంగా చెప్పాలంటే సన్యాసి ఎవరికీ చెందని, కేవలం ప్రకృతిలో లభించే కాయలను, పండ్లను, ఆకులను, దుంపలను మాత్రమే అనుభవించాలి. సన్యాసి వేదాధ్యయనము, ఇతరులకు బోధించడం తప్ప ధనం కొరకు వేరే వృత్తి అవలంబించకూడదు. బంగారము వంక చూడకూడదు. సన్యాసి ఎల్లప్పుడూ వివాద రహితుడుగా ఉండాలి. ఎటువంటి వివాదములలో తలదూర్చకూడదు. ఆస్తి, ధనము సంపాదించడానికి సంబంధించిన ఎటువంటి కార్యములు ప్రత్యక్షము గా కానీ పరోక్షముగా కానీ చేయకూడదు.

ఇలా ఉండాలంటే సన్యాసి ఒకేచోట ఉండకూడదు. ఉన్నచోట ఉండకుండా తిరుగుతూ ఉండాలి. అన్నిజీవరాసుల పట్ల సమభావన కలిగి ఉండాలి. సన్యాసిఎవరినీ ఇబ్బంది పెట్టకూడదు, తాను కూడా ఇతరుల వలన ఇబ్బంది పడకూడదు. సాటి మానవులచేతనే కాదు, సాటి జంతువులతో కూడా ఆదరింపబడే సన్యాసి మోక్షమునకు అర్హుడు అవుతాడు. (ఉదాహరణకు కణ్వమహాఋషి ఆశ్రమంలో క్రూర జంతువులు కూడా తమ సహజగుణములను మరిచి, సాత్వికగుణముతో సంచరించేవి.)

సన్యాసి అయిన వాడు గతం గురించి కానీ, భవిష్యత్తు గురించి కానీ చింతపడకూడదు. కేవలం వర్తమానంలోనే అత్యంత జాగరూకతతో వ్యవహరించాలి. సన్యాసి మనసుతోకానీ, వాక్కుతో కానీ, శరీరముతో గానీ, రహస్యముగా గానీ, బహిరంగముగా కానీ ఎటువంటి చేయకూడనివి, నిషిద్ధకర్మలు చేయకూడదు. (ఉదాహరణ కంచి జయేంద్రస్వామి. రాజకీయాలలో తలదూర్చి అనవసరమైన చిక్కుల్లో ఇరుక్కున్నాడు. ఇతర స్వామీజిల సంగతి చెప్పనక్కరలేదు.).

అటువంటి పరిస్థితులు వచ్చినపుడు తాబేలు తన అంగములకు లోపలకు లాక్కునట్టు, అటువంటి నిషిద్ధకర్మలకు దూరంగా ఉండాలి. సన్యాసి ద్వంద్వములకు దూరంగా ఉండాలి. అహంకారము, స్వాభిమానము వదిలిపెట్టాలి. ఎవరి మీదా ఆధారపడకుండా ఎల్లప్పుడూ ప్రశాంత చిత్తముతో జీవనం సాగించాలి. ఇటువంటి గుణములు, లక్షణములు కలిగిన సన్యాసి తప్పకుండా మోక్షపదమునకు అర్హుడు. అటువంటి సన్యాసి నిర్గుణుడు, నిరాకారుడు, సర్వవ్యాపి, అన్ని జీవరాసుల హృదయములలో తిష్టవేసుకొని ఉండే వాడు అయిన పరమాత్మయందు మనసు నిలిపి, మృత్యువును కూడా జయించగలడు.

అటువంటి సన్యాసి ప్రాపంచిక విషయములను వదిలిపెట్టి ఎల్లప్పుడూ జ్ఞాన సముపార్జనకు ప్రయత్నించాలి. ప్రాపంచిక విషయముల కన్నా, యజ్ఞయాగములు మొదలగు కర్మకాండల కన్నా, జ్ఞానమే మోక్షమునకు సరిఅయిన మార్గము అని గ్రహించాలి. దానికి సత్యనిష్ట,

పరమాత్మని మీద అచంచలమైన భక్తి విశ్వాసము ముఖ్యము అని గ్రహించాలి. అప్పుడే ఈ త్రిగుణాత్మకమైన మాయను జయించగలడు. అటువంటి సన్యాసి అందరిలోకల్లా శ్రేష్టుడు అనిపించుకుంటాడు. పంచభూతములు, పంచ తన్మాత్రలు, ఇంద్రియములు, మనోబుద్ధి అహంకారములు, వీటి నిజమైన తత్వముల గురించి తెలుసుకున్న సన్యాసి, వాడి నుండి విడివడి, పరమపదము కొరకు నిరంతరము ప్రయత్నిస్తాడు. అటువంటి సన్యాసి తన అంత్యకాలములో కూడా ఏకాగ్రచిత్తంతో పరమాత్మను ధ్యానిస్తూ తన శరీరమును విడిచిపెడతాడు. అటువంటి సన్యాసికి పునర్జన్మ ఉండదు. పరమాత్మలో కలిసిపోతాడు. " అని బ్రహ్మగారు మహాఋషులకు ఆశ్రమధర్మముల గురించి వివరించాడు. ఇంకా బ్రహ్మగారు ఇలా అన్నారు.

"మహాఋషులారా! పూర్వపు ఋషులు చెప్పినది ఏమిటంటే తపస్సు వలననే మోక్షము సిద్ధిస్తుంది అనీ, జ్ఞానము బ్రహ్మస్వరూపము అనీ, వేదాధ్యయనము వలన జ్ఞానము లభిస్తుంది అనీ అన్నారు. ప్రతి జీవిలోనూ ఆత్మస్వరూపుడుగా ఉన్న పరమాత్మ ద్వంద్వాతీతుడు అనీ, నిర్గుణుడు అనీ, నిత్యము, సత్యము, అనాది అనీ, అచింత్యుడు అనీ, అన్నారు. ఆ పరమాత్మను చేరుకోవడం అంత సులభం కాదు. కేవలం జ్ఞానము, తపస్సు చేతనే ఆ పరమాత్మను చేరుకోగలము.

ఎవరి మనస్సులు నిర్మలంగా ఉంటాయో, ఎవరైతే సకల పాపముల నుండి విముక్తి పొందుతారో, ఎవరైతే లోభము మోహము మొదలగు వాటిని జయిస్తారో, ఎవరైతే మోక్షమార్గములో పయనిస్తుంటారో, అటువంటి వారు మాత్రమే ఆ పరమాత్మను చేరుకోగలరు. ఎవరైతే రాగద్వేషములను అధిగమిస్తారో, అన్ని జీవరాసులను సమభావంతో ఆదరిస్తారో, అటువంటి వారు ఈ సంసారము అనే దు:ఖము నుండి బయటపడతారు. ఎవరైతే కోరికలను అదుపులో పెట్టుకుంటారో, వారు ఈ ప్రపంచంలో విహరిస్తున్నా, ప్రాపంచిక విషయములకు అంటకుండా ఉంటారు. ఎవరైతే ఈ ప్రకృతిలోని గుణముల గురించిన అసలు నిజం తెలుసుకుంటారో, ఎవరైతే తమ అహంకారమును మమకారమును విడిచిపెడతారో, అటువంటి వారు మోక్షమునకు అర్హులు.

అవ్యక్తమనే బీజమును, బుద్ధి అనే కాండమును, అహంకారము అనే కొమ్మలను, పంచభూతములను అనే రెమ్మలను, ఇంద్రియములు అనే తొర్రలను, నిరంతరం పుట్టే చిగుళ్లు అనే ఆశలను, మంచి చెడు అనే ఫలములను కలిగినదే ఈ సంసారము అనే వృక్షము. ఈ సంసారము అనే వృక్షమును జ్ఞానము అనే కత్తితో మొదలంటా నరికివేయాలి. తనలో ఉన్న అభిమానమును, అహంకారమును నియంత్రించుకోవాలి. అప్పుడే అతను శాశ్వతమైన బ్రహ్మపదమును చేరుకోవగలడు. ఎవరైతే యోగసాధనతో, ప్రాణాయామం అభ్యసించి, ఒక్క నిమిషమైనా లోపల ఉన్న ఆత్మస్వరూపమును దర్శించగలిగితే, అతడు ఈ విషయ వాంఛల నుండి, ప్రాపంచిక సుఖముల నుండి విడివడి ముక్తిని పొందుతాడు.

అన్నింటి కంటే ముందు సాధకుడు తన మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలి. ఎటువంటి ఆలోచనలను మనసులోకి రానీయకూడదు. అప్పుడు అతని మనసు రజోతమోగుణముల నుండి సత్వానికి మళ్లుతుంది. అప్పుడు సాధకుడు తన మనసును ఆత్మవైపు మళ్లించగలడు. ఆత్మను దర్శించగలడు. ఆ స్థితిని పొందిన వారు సత్వమే ప్రధానమనీ, సత్వమునకు మించినది ఏదీ లేదనీ భావిస్తారు. కాబట్టి మనలో ఉన్న జీవాత్మ సత్వము మీదనే ఆధారపడి ఉంటాడు అని భావించాలి. ఆత్మదర్శనం కావాలంటే సత్వమునకు మించి మరొక మార్గము లేదు.

సత్వగుణ సంపన్నులలో సంతోషం, ధృతి, ఋజుత్వం, క్షమ, దయ, దానగుణము, అహింస, సమానత్వము, సత్యసంధత జ్ఞానము మొదలగు గుణములు పుష్కలంగా ఉంటాయి. ఈ గుణములు కలిగిన వాడిలో పరమాత్మ సత్వగుణ స్వరూపుడుగా గుర్తింపబడతాడు. కాబట్టి నిత్యము సత్యము అయిన ఆత్మను సమగ్రం తెలుసుకోడానికి సత్త్వ భావనకంటే శ్రేష్టమైనది మరొకటి లేదు.  కొందరు లోపల ఉన్న పురుషుడు, సత్వము ఒకటే అంటారు. మరి కొందరు నీటిలో చేప ఉన్నట్టే సత్వములో పురుషుడు ఉన్నాడు అని అంటారు. కాబట్టి సత్వము పురుషుడు ఒకటే అన్నా, సత్వములోనే పురుషుడు ఉన్నాడు అన్నా రెండూ ఒకటే భేదములేదు అని గ్రహించాలి. ఈ విషయాలను ఈ క్రింది విధంగా అర్థం చేసుకోవచ్చు.

ప్రకృతి వ్యక్తము కాకముందు అవ్యక్త స్థితిలో ఉంది. అవ్యక్తము అయిన ఈ ప్రకృతి లో సత్వ,రజస్తమోగుణములు ఒకదానితో ఒకటి కలిసి ఉన్నాయి. సత్వగుణము ఉచ్ఛస్థితిలో ఉన్నపుడు, రజస్తమోగుణముల జాడ కనిపించదు. ఆ సత్వములో నుండి ఆత్మతత్వము అయిన పురుషుడు ఉద్భవిస్తాడు. కాబట్టి పురుషుడు, ప్రకృతి వేరు కాదు. అని అర్థంచేసుకోవాలి. నీటిలో చేప ఉంటుంది. నీరు లేకపోతే చేపలేదు. కాని నీరు వేరు, చేప వేరు. అలాగే సత్వములో పురుషుడు ఉన్నాడు. సత్వము లేకపోతే పురుషుడు లేడు. కాబట్టి సత్వమే పురుషుడు అనికూడా అనవచ్చు. ” అని పలికాడు బ్రహ్మ.

ఈ విధంగా బ్రహ్మగారు బోధించిన తరువాత ఆ మహాఋషులకు మరొక సందేహము వచ్చింది. ఆ సందేహమును ఇలా అడిగారు. “ఓ బ్రహ్మదేవా! ఈ లోకములో అనేకములైన ధర్మాలు ఉన్నాయి కదా! వాటిలో ఏది శ్రేష్టమైనది. ఎవరు ఏ ధర్మాన్ని పాటిస్తే వాడికి మేలుజరుగుతుంది. ఎందుకంటే ఈ ధర్మాలు అన్నీ ఒకదానికి ఒకటి వ్యతిరేకభావాలు కలిగి ఉన్నాయి. కొందరు శరీరం పడిపోయిన తరువాత ఆత్మ మిగిలి ఉంటుంది అని అంటారు. మరి కొందరు శరీరం పడి పోగానే ఆత్మకూడా పరమాత్మలో కలుస్తుంది. ఏమీ మిగలదు అని అంటారు. మరి కొందరు ఆత్మజీవాత్మగా మారి మరో జన్మ కు కారణం అవుతుంది అని అంటారు. మరి కొందరు ఈ ఆత్మ గురించి ఎటువంటి సందేహములు పెట్టుకోకుండా మోక్షం కొరకు ప్రయత్నం చేస్తుంటారు. మరి కొందరు ఆత్మకూడా నిత్యము, అవ్యయము కాదు అని అంటారు. ఇంకా మరి కొందరు పరమాత్మ ఉన్నాడు అంటారు.

కొందరు పరమాత్మ అంటూ ఎవరూ లేరు అని అంటారు. కొందరు పరమాత్మ ఒక్కడే అని అంటారు. మరి కొందరు ఆత్మ, పరమాత్మ వేరు వేరు అని అంటారు. ఇంకా కొందరు. పరమాత్మ ఆత్మస్వరూపుడుగా అన్ని జీవరాసులలో ఉన్నాడు అని అంటారు. మహా ఋషులు, జ్ఞానులు పరమాత్మ ఒక్కడే రెండు కాదు (ఏకం ఇవ అద్వితీయం బ్రహ్మ) అని అంటారు. వారితో మరి కొందరు ఏకీభవించరు. పరమాత్మ రెండు అంటే వ్యక్తము, అవ్యక్తము అని అంటారు. ఇంకా మరి కొందరు పరమాత్మ అనేకము అని అంటారు. ఇది ఇలా ఉంటే, కొందరు కాలము, ఆకాశము(టైమ్ ఎండ్ స్పేస్) ఉన్నాయి అని అంటారు. మరి కొందరు ఆకాశము శూన్యము కాలము అంటే ఏమీ లేదు, కాలము అవిచ్ఛిన్నము అని అంటారు.

కొంత మంది సన్యాసులు జుట్టు ముడి వేసుకొని జింకచర్మము ధరిస్తారు. మరి కొందరు గుండు గీసుకొని, దిగంబరంగా ఉంటారు. కొందరు విభూతి పూసుకొని దానినే విభూతి స్నానం అంటారు. మరి కొందరు మూడు పూట్లా నదిలో కానీ జలాశయములలో స్నానం చేస్తారు. అంతే కాదు దేవతా మూర్తులలో కూడా ఎన్నో విభేదాలు ఉన్నాయి. అలాగే దేవతలను అర్చించే బ్రాహ్మణులలో కూడా ఎన్నో విభేదాలు ఉన్నాయి. అంతే కాదు బ్రహ్మజ్ఞానులు కూడా ఒకరితో ఒకరు విభేదిస్తుంటారు. కొందమంది ఆహారం తీసుకుంటారు, మరి కొంత మంది ఉపవాసాలు చేస్తారు. కొంత మంది దేవతామూర్తులకు పూజలు, వ్రతాలు చేస్తారు. యజ్ఞములు యాగములు చేస్తారు. మరి కొంత మంది మౌనంగా శాంతంగా మనో నిగ్రహము, ఇంద్రియ నిగ్రహము పాటిస్తారు. కొంతమంది నివృత్తి మార్గంలో మోక్షం కొరకు ప్రయత్నిస్తే మరి కొందరు ప్రవృత్తి మార్గంలో ప్రాపంచిక సుఖముల కొరకు పాకులాడుతుంటారు. కొంత మంది ధనము, సంపదలు, అధికారము, హెూదాలతో ఆనందిస్తుంటే మరి కొందరు కటిక పేదరికంతో బాధపడుతుంటారు. కొంత మంది అహింసామార్గమును అవలంబిస్తే మరి కొందరు హింసయే పరమావధిగా బతుకుతుంటారు. కొంత మందికి ప్రతిభ, పాటవము, సంస్కారము ఉంటే మరి కొందరిలో అవి మచ్చుకైనా కనిపించవు. కొంతమంది నిశ్చయాత్మక బుద్ధితో విరాజిల్లుతుంటే మరి కొందరు అదా, ఇదా, ఏది అనే సందేహాలతో సతమతమౌతుంటారు. కొంత మంది సుఖపడుతుంటే మరి కొందరు దు:ఖపడుతుంటారు.

కొంత మంది ధ్యానయోగం మంచిది అంటే మరి కొందరు కర్మయోగము మంచిది అంటారు. మరి కొందరు దాన,ధర్మాలు చేయడం మంచిది అని అంటారు. కొంత మంది యజ్ఞయాగములు చేయడం మంచిది అంటే మరి కొందరు శాస్త్ర అధ్యయనము మంచిది అని అంటారు. కొంత మంది జ్ఞానము ద్వారా మోక్షము వస్తుంది అని అంటే మరి కొందరు ప్రకృతి దేవతలను పంచభూతములను పూజించాలి, దాని వలననే పుణ్యం వస్తుంది అని అంటారు. కొంతమంది దేవతలను పూజిస్తూ, స్తోత్రములు చేస్తుంటే మరి కొందరు విగ్రహారాధనకు వ్యతిరేకులు.

ఈ లోకంలో ఇంత మంది ఇన్నిధర్మాలు పాటిస్తూ, అనుసరిస్తూ ఉండటం వలన మానవులు అందరూ చాలా అయోమయస్థితిలో ఉన్నారు. ఏది మంచిది, ఏది మంచిది కాదు అని తెలుసుకోలేకపోతున్నారు. ఎవరికి వారు తాము అనుసరించే ధర్మమే మంచిది అనే భావనలో ఉన్నారు. ఆ మాటకొస్తే మాకు కూడా అన్నీ మంచివి అని తోస్తున్నాయి. మాకు ఒక నిశ్చయమైన జ్ఞానం లేకుండా ఉన్నాము. మా మనసంతా వికలమై ఉంది. మీరు సర్వజ్ఞులు. మేము, మానవులు అనుష్ఠించతగిన ధర్మం, పద్ధతి ఇదీ అనిమీరు మాకు నిశ్చయంగా బోధించండి. శరీరమునకు, శరీరములో ఉండే ఆత్మకు ఉండే సంబంధము భేదము మాకు తెలపండి. ప్రకృతి పురుషుల గురించి మాకు బోధించండి." అని అడిగారు. ఆ మాటలు విన్న బ్రహ్మగారు చిరునవ్వునవ్వి వారు అడిగిన సందేహములను ఈ విధంగా నివృత్తి చేసాడు.

"ఓ మహాఋషులారా! మీ సందేహములు అన్నీ సరి అయినవే. మీ సందేహములు అన్నీ నేను నివృత్తి చేస్తాను. లోకములో ఎన్ని ధర్మములు ఉన్నా ప్రతి మానవుడు అనుసరించవలసిన ధర్మము ఒకటే. అహింసా పరమో ధర్మ:. అహింసను పాటిస్తే అన్ని ధర్మాలు పాటించినట్టే. శారీరకంగా కానీ, మానసికంగా కానీ, వాక్కుతో గానీ, ఎవరినీ ఏ జీవినీ హింసించకూడదు. అలా చేస్తే మనస్సు పవిత్రంగా, ప్రశాంతంగా ఉంటుంది. ఎటువంటి అలజడికి లోనుకాదు.

తత్వదర్శినులు అయిన మన పూర్వీకులు అన్నిటి కంటే జ్ఞానమే గొప్పది. జ్ఞానము వలన మోక్షము వస్తుంది అని అన్నారు. పరిశుద్ధమైన శాస్త్రజ్ఞానము చేతనే అన్ని పాపములు ప్రక్షాళన అవుతాయి అని వారి నిశ్చయము. ఎవరైతే లోభత్వంతో, మోహంలో పడి ఉంటారో వారు హింసామార్గములో ప్రయాణం చేస్తారు. తమ సుఖసంతోషాల కొరకు ఇతరులను హింసిస్తారు. తద్వారా వారు నరకాన్ని పొందుతారు. ఎవరైతే జీవితమంతా అలసత్వంతో, సోమరిగా ఉంటారో, అటువంటి వారు తమోగుణముచేత ప్రేరేపింపబడి, ఆశాపాశములలో చిక్కుకొని, జన్మవెంట జన్మ ఎత్తుతూ సుఖదు:ఖములను అనుభవిస్తూ ఉంటారు. అలాకాకుండా, తెలివైనవారు, జ్ఞానులు ఎల్లప్పుడూ జాగరూకతతో ఉండి, ఆశాపాశములలో చిక్కుపడక, తమ మనస్సును పరమాత్మమీద లగ్నం చేసి, సత్వగుణ సంపన్నులై, పరమానందమును పొందుతారు.

మీకు ఇప్పుడు ప్రకృతి పురుషుల యొక్క సంయోగ వియోగముల గురించి చెబుతాను. శ్రద్ధగా వినండి. ప్రకృతి పురుషుల మధ్య సంబంధము భోక్త భోజ్యము మధ్య ఉన్న సంబంధము వంటిది. పురుషుడు భోక్త అయితే ప్రకృతి భోజ్యము. ఇది వరకు చెప్పినట్టు వీరి సంబంధము తామరాకు మీది నీటి బొట్టు వంటిది. ఎలాగంటే పురుషుడు ప్రకృతిలో ఉన్నా ఏమీ అంటకుండా ఉంటాడు. ప్రకృతిలో ఉన్న వాటిని అనుభవిస్తూ ఉన్నా వాటికి అంటుకోడు. జ్ఞాని అయిన వాడు మాత్రమే ఈ సత్యమును గ్రహించగలడు. ఈ ప్రకృతి అంతా సుఖదు:ఖములు మొదలగు ద్వంద్వములతో కూడుకొని ఉన్నది. ప్రకృతిలో ఉన్న విషయములను భోక్తగా అనుభవిస్తున్న పురుషుడు

ఈ ద్వంద్వములకు అంటుకోకుండా, అతీతంగా ఉంటాడు. పురుషుడు ఈ ప్రకృతిని తామరాకు మీద నీటి బొట్టు మాదిరి అనుభవిస్తుంటాడు. ఈ శరీరములో ఉండి ఆర్జించిన జ్ఞానము చేత పురుషుడు ప్రకృతిలో ఉన్న సత్వ,రజో, తమోగుణములకు వశుడు కాడు. వాటికి అతీతంగా ఉంటాడు. దీని వలన తెలిసింది ఏమిటంటే ప్రకృతి పురుషుని లో నుండి ఉద్భవించింది. కానీ ప్రకృతి తనలో ఉన్న గుణములతోపురుషుని ప్రభావితం చేయలేదు. కాబట్టి మోక్షమును కావాలనుకునే సాధకుడు ముందు ప్రకృతిలో ఉన్న గుణములను జయించాలి. గుణాతీత స్థితికి చేరుకోవాలి.

ప్రకృతి వ్యక్తము అయితే పురుషుడు అవ్యక్తము. ఈ విషయం గురించి ఇంకొంచెం వివరంగా చెబుతాను. శ్రద్ధగా వినండి. ఎవరైతే మూఢుడిగా ఉంటాడో, వాడు ఎన్ని విద్యలు నేర్చినా, ఈ ప్రకృతి పురుషుల సంబంధము గురించిన జ్ఞానము అలవడదు. కొస్తంత తెలివిగా ఆలోచిస్తే, ఏ మాత్రం శాస్త్రజ్ఞానము లేని వాడు కూడా ఈ ప్రకృతి పురుషుల సంబంధము గురించి చక్కగా తెలుసుకోగలడు. కాబట్టి ఉపాయంతోనే పరమాత్మను చేరుకోవచ్చు కానీ వేదములను శాస్త్రములను వల్లె వేయడం వలన రాదు. ఎలాగంటే దూరప్రయాణము చేసే వాడు, తెలివికల వాడైతే, తనతో తనకు కావలసిన ఆహార పదార్థములు తీసుకొని వెళతాడు. తన ప్రయాణం సుఖంగా సాగించి క్షేమంగా గమ్యం చేరుకుంటాడు. అన్నీ నాకు తెలుసు అని అనుకునేవాడు, ఏమీ తీసుకుపోకుండా, తన ప్రయాణంలో కష్టాలు పడతాడు. గమ్యం కూడా చేరుకోలేడు.

కాబట్టి సుఖంగా మోక్షం అనే గమ్యం చేరుకోవాలంటే సాధన, సాధనము ముఖ్యము. కాబట్టి మానవుడు శాస్త్ర విధులను గురించి తెలుసుకోవాలి. ఏది చెయ్యాలో ఏది చెయ్యకూడదో గ్రహించాలి. (వాటినే విధి నిషేధములు అని అంటారు.) వాటి గురించి బాగా తెలిసిన వాడు సులభంగా మోక్షమును పొందగలడు. ఈ విధి నిషేధముల గురించి ఏమీ తెలియని వాడు, మూర్ఖంగా నాకు అన్నీ తెలుసు అని అనుకునేవాడు, ఏ ప్రయాణ సాధనము లేకుండా దారి వెంట ప్రయాణం చేస్తున్న వాడితో సమానము. తెలివి గలవాడు విధి నిషేధముల గురించి తెలుసుకొని చేయవలసిన కర్మలు మాత్రమే చేస్తూ, చేయకూడని కర్మల వంక చూడకుండా, చక్కని గుర్రములు కట్టిన బండి మీద ప్రయాణం చేస్తున్న వాడి మాదిరి, తన జీవన యాత్ర సుఖంగా సాగిస్తాడు. త్వరగా గమ్యం చేరుకుంటాడు.

అలాగే తెలివైన వాడు, తాను ప్రయాణం చేసే రహదారి బాగా ఉంటేనే, బండి మీద ప్రయాణం చేస్తాడు. గతుకులుగా ఉన్న రహదారి కనపడగానే, బండి దిగి కాలి నడకన ప్రయాణం సాగిస్తాడు. కాని తెలివిలేని మూర్ఖుడు, ఆ గతుకుల రహదారిలో బండి నడుపుతూ నానా అవస్థ పడతాడు. కాబట్టి గుర్రములు కట్టిన బండి సాధనమే కాని అదే గమ్యం కాదు. అలాగే ఈ శాస్త్ర జ్ఞానము, వేద అధ్యయనము, ధ్యానము, యోగము, ఇవన్నీ ముక్తికి సాధనములే కాని, అవే గమ్యం

కాదు. కాబట్టి తెలివైన వాడు శాస్త్రజ్ఞానమును, యోగ మార్గమును ఎంతవరకు అవసరమో అంతవరకు ఉపయోగించుకొని, మోక్షమార్గములో ప్రయాణం చేస్తాడు. అవసరం ఉన్న వాటిని ఉపయోగించుకుంటూ, ఉపయోగం లేని వాటిని వదిలేస్తూ, గమ్యం చేరుకుంటాడు.

వెడల్పైన నదిని దాటాలంటే పడవ కావాలి. తెడ్డు కావాలి. తెలివి లేని మూర్ఖుడు, తన రెండు చేతులతో ఈదుకుంటూ ఆవల ఒడ్డుకు చేరుకోవాలని ప్రయత్నించి, మధ్యలోనే అలసట వచ్చి, మునిగి పోతాడు. అదే తెలివి కలవాడు, ఒక పడవలో సుఖంగా కూర్చుని తెడ్డు వేసుకుంటూ నదిని దాటుతాడు. తనను నదిని దాటించి కదా అని ఆ పడవ మీద తెడ్డు మీద మమకారము పెంచుకోడు. పడవను తెడ్డును వదిలి తన ప్రయాణం కొనసాగిస్తాడు. అలాగే మోక్షమార్గములో ప్రయాణం చేసే వ్యక్తి మమత, మమకారము లను వదిలిపెట్టి, దేనిని ఎంతవరకు ఉపయోగించుకోవాలో అంత వరకే ఉపయోగించుకొని, తరువాత వాటిని వదిలేసి తన గమ్యం వైపుకు నడవాలి. అలా కాకుండా కనపడేదంతా సత్యము అనే భ్రమలో ఉన్న వాడు, అన్నిటి మీదా మమత మమకారము పెంచుకునేవాడు, గంగానదిని పడవ సాయంతో దాటుతూ ఆ పడవ తన సర్వస్వం అనుకుంటాడు. ఆ పడవ మీద తెడ్డు మీద మమకారం పెంచుకుంటాడు.

నీటి లో ఉన్నంత వరకే పడవ ఉపయోగము, రహదారి మీద దాని ఉపయోగము లేదు అని గ్రహించలేడు. రహదారి మీద ప్రయాణం చేయడానికి రథం కావాలి. నీటి మీద ప్రయాణం చేయడానికి పడవ కావాలి. గతుకుల రహదారి మీద ప్రయాణం చేయడానికి నడక మంచి సాధనము. నీటి మీద బండి, రహదారి మీద పడవ ప్రయాణానికి పనికిరావని గ్రహించాలి. వీటిని తెలుసుకున్న వాడే అసలైన జ్ఞాని. అలాగే మోక్షసాధనకు వేదాధ్యయనము, శాస్త్ర పరిజ్ఞానము ఎంత వరకు ఉపయోగమో అంతవరకే ఉపయోగించుకోవాలి. వేదములు, శాస్త్రములు చదువుకున్నాను కదా అని వాటి వలననే మోక్షం వస్తుంది అని అనుకోవడం పొరపాటు. అవి కేవలం మోక్షసాధనములు మాత్రమే. వాటిని ఒక దాని వెంట ఒకటి వదిలేస్తూ మోక్షమార్గంలో ప్రయాణం చేసేవాడే తెలివికలవాడు.

వివిధములైన లక్షణములు కలిగిన మానవులకు వివిధములైన కర్మలు ఉద్దేశింపబడ్డాయి. ఏ మానవుడు ఏ కర్మను ఆచరిస్తే, ఆ కర్మకు తగ్గఫలమే అతనికి దక్కుతుంది. ప్రధానము అనబడే ఈ ప్రకృతి అవ్యక్తము. ఈ అవ్యక్తము లోనుండి మహత్తత్వము పుట్టింది. మహత్ తత్వము లోనుండి అహంకారము ఆవిర్భవించింది. ఈ అహంకారములోనుండి పంచ మహో తత్వములు ఆవిర్భవించాయి. అవే శబ్ద, స్పర్శ,రస,రూప,గంధములు. ఈ అహంకారము మూడు విధములుగా ఉంటుంది. సాత్విక అహంకారము, రాజస అహంకారము, తామస అహంకారము. ఈ ఐదు తత్వములు, అహంకారముతో కలిసి ఒకదాని నుండి ఒకటిగా పంచభూతములు ఆవిర్భవించాయి. పంచ భూతములలోనుండి పది ఇంద్రియములు పుట్టాయి. కాబట్టి ఈ ప్రపంచం

అంతా అవ్యక్తములోనుండి పుట్టింది. సృష్టి ఇలా ఆరంభం అయింది. ఈ అవ్యక్తము పరమాత్మనుండి ఆవిర్భవించింది. కాబట్టి ఈ సృష్టికి మూలము, బీజము పరమాత్మ. పరమాత్మ కారణము అయితే అవ్యక్తము కార్యము. పరమాత్మకు వేరే కారణము అంటూ లేదు. అలాగే ప్రకృతి కారణము అయితే అహంకారము కార్యము. ఈ అహంకారము వివిధ రీతులలో అభివృద్ధి చెందింది. పంచ మహాతత్వములు, పది ఇంద్రియములు, మనస్సు బుద్ధి అహంకారములు కలిపి చిత్తము అని అంటారు. పంచభూతములు ఒక్కొక్క లక్షణమును కలిగి ఉన్నాయి.

ఆకాశం.... శబ్దము;

వాయువు....శబ్దము, స్పర్శ;

అగ్ని .....శబ్దము, స్పర్శ, రూపము;

జలము..... శబ్దము, స్పర్శ, రూపము, రసము అంటే రుచి;

పృథివి.......శబ్దము, స్పర్శ, రూపము, రసము మరియు గంధము అంటే వాసన.

ఈ విధంగా పంచ మహాతత్వములనుండి పంచభూతములు ఆయా లక్షణములు కలిగి ఉన్నాయి. ఈ పంచభూతములలో ఆకాశం గొప్పది. ఆకాశం కంటే అహంకారము గొప్పది. అహంకారము కంటే జ్ఞానము గొప్పది. జ్ఞానము వలననే పరమాత్మను తెలుసుకోగలము.

జ్ఞానులు అయిన వారు పంచ మహా తత్వములు, పంచభూతములు, వాటి లక్షణముల గురించి బాగా తెలుసుకొని వాటి ప్రభావంలో పడకుండా జీవన యానం సాగిస్తారు. మోక్షమార్గంలో ప్రయాణం చేస్తారు. తుదకు మోక్షమును పొందుతారు.

శరీరము పంచభూతాత్మకము. శరీరములోని ఇంద్రియములకు అధిపతి మనసు. మనసు చెప్పినట్టు, సంకల్పించినట్టు ఇంద్రియములు నడుచుకుంటాయి. ఇంద్రియములు కూడా ప్రకృతిలోని విషయములను మనసుకు చేరవేస్తుంటాయి. ఇంద్రియములను కట్టడి చేయాలంటే అది మనసుకే సాధ్యం అవుతుంది. మనసుకు బుద్ధి విచక్షణా శక్తిని ఇస్తుంది. ఏది మంచి ఏది చెడు అనే విషయాన్ని బుద్ధి విడమరిచి చెబుతుంది. ఇంద్రియములు అనే గుర్రములు కట్టిన శరీరము అనే రథంలో కూర్చున్న జీవాత్మ, మనో,బుద్ధుల సాయంతో రథాన్ని తన ఇష్టం వచ్చిన రీతులలో తిప్పుతూ, ప్రయాణం సాగిస్తాడు. ఈ విషయాలను గురించి ఎవరు తెలుసుకుంటారో, వారు తమ జీవన రథమును సక్రమమైన మార్గములో ప్రయాణింపజేసి, మాయను అధిగమించి, ప్రాపంచిక విషయములలో చిక్కుకొనకుండా, నివృత్తి మార్గంలో పయనించి, తుదకు మోక్షం పొందుతారు.

కాబట్టి ఈ ప్రకృతి అంతా అవ్యక్తములో నుండి వ్యక్తం అయి, ఈ స్థూల ప్రపంచంగా మనకు కనపడుతూ ఉంది. ఈ సృష్టి అంతా చరాచర జీవరాసులతో నిండి ఉంది. సూర్యుని నుండి, చంద్రుని నుండి, నక్షత్రముల నుండి, గ్రహముల నుండి మనము వేడి వెలుగు

పొందుతున్నాము. పంచభూతములలో ఆఖరుది అయిన భూమి మీద పర్వతములు, వృక్షములు, నదులు, సముద్రములు ఉన్నాయి. భూమి మీద జీవరాసులు జీవించడానికి సూర్య,చంద్రులు, నక్షత్రములు, భూమి మీద ఉన్న పర్వతములు, నదులు ఆధారములు. అనగా ఈ ప్రకృతి భూమి మీద ఉన్న సకల జీవరాసుల ఉనికికి కారణం అయింది. ఈ జీవరాసులు అన్నింటిలో పరమాత్మ ఆత్మస్వరూపుడుగా ఆయా జీవరాసులకు చైతన్యం కలిగిస్తున్నాడు. కాని ఈ ప్రకృతిలో కంటికి కనపడే ప్రతి వస్తువు, జీవము, వృక్షరాసి, మానవులు అన్నీ కూడా ఒకనాటికి నశించిపోయేవే లేక మార్పుచెందేవే. ఏదీ శాశ్వతము కాదు అంటే అదే రూపంలో ఉండదు. రూపాలు, ఆకారాలు మార్చుకుంటూ ఉంటుంది. నిరంతరం మార్పుకు లోనవుతూ ఉంటుంది. చివరకు పంచభూతములలో కలిసి పోతాయి. ఆ పంచభూతములు కూడా ఒకదానితో ఒకటి కలిసి పోయి చివరకు వ్యక్త ప్రపంచం అవ్యక్తములో కలిసిపోతుంది.

సృష్టి క్రమం ఈ విధంగా నడుస్తూ ఉంటుంది. సముద్రంలో అలలు పుట్టి పైకి ఎగిసి, చివరకు ఆ సముద్రజలములలోనే లీనం అయినట్టు ఈ సమస్త సృష్టి అంతా అంటే దేవతలు, మానవులు, పక్షులు, జంతువులు, పర్వతములు మొదలగు చరాచర జగత్తు, అవ్యక్తం నుండి పుట్టి, చివరకు ఆ అవ్యక్తములోనేలీనం అవుతుంది. ఈ సృష్టి అంతా అవ్యయుడు అయిన ఆ పరమాత్మ నుండి పుట్టినదే. ఈ రహస్యాన్ని తెలుసుకున్న జ్ఞానులు, ప్రాపంచిక విషయ వాంఛల మోహంలో పడరు.. అప్పటికే ఉన్న ప్రాపంచిక విషయ వాంఛల బంధనముల నుండి విముక్తి పొందుతారు.

ఇది సాకారం అవాలంటే తపస్సు ఒకటే సాధనం. తపస్సు సాయం లేనిదే సాధకుడు మోక్షమార్గములో ప్రయాణం చెయ్యలేడు. ఎవరైతే స్థితప్రజ్ఞుడు అవుతాడో, ఎవరైతే ఆశ, మోహములను వదిలిపెడతాడో, ఎవరైతే కందమూలములు ఫలములు తింటూ శరీరపోషణ చేస్తుంటాడో, అటువంటి సాధకుడు తపస్సు అనే సాధనముతో మోక్షమార్గము చేరుకోగలడు. ఈ తపస్సు వలన శారీరక రుగ్మతలు అన్నీ నశించి పోతాయి. మనసు, శరీరం నిర్మలంగా ఉంటుంది. శాస్త్రజ్ఞానము సంపాదించాలన్నా, సిద్ధులు పొందాలన్నా, ఈ ప్రాపంచిక వస్తువులు ఏది పొందాలన్నా, అవి అన్నీ కూడా ఏకాగ్రత, తపస్సు వీటి వలననే పొందగలడు. కాబట్టి ఏ పని చేసినా ఒకతపస్సులాగా ఏకాగ్రతతో చేయాలి కానీ నిర్లక్ష్యంగా, ఏదో చేసామంటే చేసామని చేయకూడదు.

మానవుడు జీవితంలో ఎన్నో పాపాలు చేసినప్పటికీ, జీవిత చరమాంకంలో పశ్చాత్తాప పడి, ఏకాగ్రతతో తపస్సు చేస్తే అతడు చేసిన పాపములు అన్నీ అతడు తపస్సు వలన సంపాదించిన జ్ఞానము అనే అగ్నిలో పడి భస్మం అయి పోతాయి. దేవతలు, రాక్షసులు, అసురులు కూడా తపస్సు వలననే ఉత్తమలోకాలు పొందగలిగారు. ఎటువంటి ఫలితం ఆశించకుండా, నిష్కామంగా కర్మలు చేయడం, ఆ కర్మలను ఏకాగ్రతతో చేయడం, తాను చేసిన కర్మలకు వచ్చిన ఫలితములను పరమాత్మకు అర్పించడం, అహంకార మమకారములను వదిలిపెట్టి కర్మలు ఏకాగ్రతతో చేయడం,

అష్టాంగ యోగములను అనుసరించడం,  ఈ భౌతిక ప్రపంచంలో తామరాకు మీద నీటి బొట్టు మాదిరి అంటుకోకుండా సంచరించడం ఇవన్నీ తపస్సు కిందికే వస్తాయి.

సాధారణంగా మానవులు బయట ప్రపంచంలో ఉన్న మనుషుల గురించి వస్తువుల గురించి తెలుసుకోడానికి ఇష్టపడతారు కానీ తన గురించి తాను తెలుసుకోలేడు. తన గురించి తాను తెలుసుకున్న వాడు ఆత్మతత్వమును బాగా తెలుసుకున్నవాడు అవుతాడు. అటువంటి సాధకుడికి మనసు ఎల్లప్పుడు ఆనందంగా ఉంటుంది. అతడు తనలో తానే రమిస్తుంటాడు.  అతడికి తప్పకుండా ఉత్తమ గతులు కలుగుతాయి.  ఇటువంటి సాధకుడు కర్మవశాత్తు పునర్జన్మ ఎత్తినా, ఆ జన్మలో కూడా అహంకార మమకారములకు దూరంగా ఉంటూ, లోభము, కోపము, మోహము వదిలిపెట్టి, ధ్యాన,యోగ,తపస్సుల ద్వారా ఉత్తమగతులు పొందుతాడు. అనంత విశ్వం అంతా ఆ పరమాత్మ నుండి ఆవిర్భవించింది. తిరిగా ఆ పరమాత్మలోనే లీనం అయిపోతుంది. ఈ విషయం తెలుసుకున్న సాధకుడు, తనలో ఉన్న క్షేత్రజ్ఞుడి గురించి కూడా క్షుణ్ణంగా తెలుసుకుంటాడు.

వేదాంతము అంటే ఉపనిషత్తులు. ఉపనిషత్తుల రహస్యమే పరమాత్మ తత్వము. ఈ పరమాత్మ తత్వము గురించి తెలుసుకునే జ్ఞానమే తపస్సు. ఈ తపస్సు వలన సాధకుడు ఆత్మను గురించి తెలుసుకుంటాడు.  ఈ విధంగా తెలుసుకున్న సాధకుడు తిరిగి మోహములో పడడు. నిర్వికారంగా ఉంటాడు. నిర్గుణత్వము పొందుతాడు. అతనిలో ఉన్న తమస్సు రజస్సులోనూ, రజస్సు సత్వములోనూ కలిసి పోతుంది. తుదకు సత్వము కూడా నశించి నిర్గుణత్వము పొంది, నిర్గుణుడు అయిన పరమాత్మలో కలిసిపోతాడు.

యోగవిద్యలో ఉత్తమ రహస్యం గురించి చెబుతాను వినండి. మనస్సు, బుద్ధి ఎల్లప్పుడూ ఏదో ఒక పని చేస్తూ ఉంటాయి. ఇంద్రియములు  మనసు చెప్పిన కార్యములు చేస్తుంటాయి. కాని లోపల ఉన్న క్షేత్రజ్ఞుడు ఇవన్నీ కేవలం సాక్షిగా చూస్తుంటాడు. ఆ కార్యములలో లీనం అయినట్టు భ్రమకలిగిస్తాడు కానీ దేనితోనూ అంటుకోడు. ఈ విషయం తెలుసుకున్న సాధకుడు ఆ నిర్మలమైన క్షేత్రజ్ఞుడి గురించి తెలుసుకోడానికి నిరంతర ప్రయత్నం చేస్తుంటాడు. ఉన్నది ఉన్నట్టు తెలుసుకోవడం విద్య. లేనిది ఉన్నట్టుగా భ్రమలో పడటం అవిద్య. (రజ్జు సర్ప భ్రాంతి:) మానవుడు తనలో ఉన్న అవిద్య వలన ఎన్నో కార్యములు చేసి, వాటి ఫలములు అనుభవిస్తూ కర్మబంధనములలో చిక్కుకుంటాడు.

అహంకార, మమకారములతో చేసిన ఏ కార్యమైనా అది బంధహేతువు అవుతుంది. అహంకార, మమకారములను వీడి, కర్తృత్వభావన లేకుడా చేసే పని అమృతత్వము సంతరించు కుంటుంది. కొంత మంది కర్మ చేయడం ముఖ్యం అంటారు. వారిని కర్మయోగులు అంటారు.

మరి కొంత మంది శాస్త్రములు చదివి జ్ఞానం సంపాదించాలంటారు. వారిని జ్ఞానయోగులు అంటారు. మోక్షము పొందడానికి జ్ఞానమే ముఖ్యము అని వీరి వాదన.

కర్మయోగులు సగుణోపాసన చేస్తారు. ఒక మూర్తిని ఎదురుగా పెట్టుకొని అందులో పరమాత్మ తత్వమును ప్రతిష్టించజేసి, ఆ మూర్తిని పూజిస్తారు. కాని జ్ఞానయోగులు నిత్యము, సత్యము, అనంతము, అవికారము, నిర్గుణము అయిన పరమాత్మ తత్వమును కాంతి స్వరూపుడుగా మనసులో నిలుపుకొని ధ్యానిస్తారు. ఈ పద్ధతులు వారి వారి సహజ గుణములను బట్టి ప్రవర్తిల్లుతుంటాయి. రెండూ ఉత్తమమే. ఈ విషయం తెలుసుకున్న సాధకుడు, జ్ఞాన, కర్మయోగములను ఆచరిస్తూ, అన్ని కోరికలను, లోభము, కోపము, మోహము వదిలిపెట్టి, అహంకార మమకారములను వదిలిపెట్టి, తుదకు తపస్సు ఆధారంగా ముక్తిని పొందుతాడు. ఈ మార్గాన్ని పూర్వపుఋషులు అనుసరించి ముక్తిని పొందారు. ఈ ముక్తి మార్గంలో నడవాలంటే ముందు కోరికలను వదిలిపెట్టాలి. సంగము వదిలిపెట్టాలి. నిశ్చయాత్మక బుద్ధి కలిగి ఉండాలి. అన్నిజీవరాసుల ఎడల సమభావన కలిగి ఉండాలి. అటువంటి వారే ఈ మోక్షమార్గములో నడవడానికి అర్హులు.

ఓ ఋషులారా, మీకు అన్ని మార్గములను ఉపదేశించాను. ఈ పద్ధతిలో మీరు అన్ని కార్యములను నిర్వర్తించండి. లోభమోహములకు, అహంకార, మమకారములకు లోనుకాకండి. ఇది మీ అందరికీ ఆమోదయోగ్యమైన విధానము. దీనిని ఆచరించి మీరందరూ మోక్షమును పొందండి." అని బ్రహ్మదేవుడు ఋషులకు పరమాత్మ తత్వమును ఉపదేశించాడు. అని గురువు గారు తన శిష్యుడికి చెప్పి "ఓ శిష్యా! నీవు పైన చెప్పబడిన బ్రహ్మ, ఋషుల సంవాదమును మనసులో ఉంచుకొని, బ్రహ్మ వాక్కులను మనసులో స్థిరంగా నిలుపుకో. నీవు కూడా పరబ్రహ్మ తత్వమును సాధించగలవు. నీకు మోక్షప్రాప్తి కలుగుతుంది" అని ఆ గురువుగారు తన శిష్యునికి తత్వోపదేశం చేసాడు.

గురువు గారు చెప్పిన తత్వోపదేశమును మనసుకు పట్టించుకున్న ఆ శిష్యుడు ఉత్తమ మార్గంలో ప్రయాణం చేసి తుదకు మోక్షమును పొందాడు" అని శ్రీకృష్ణుడు అర్జునుడికి (మరలా ఒక సారి గీతోపదేశం చేసినట్టు) చెప్పాడు.

ఇదంతా విన్న అర్జునుడికి ఒక సందేహం కలిగింది. "కృష్ణా! ఇదంతా బాగానే ఉంది. కానీ ఇంతకూ ఆ గురువు, శిష్యులు ఎవరు. వారి పేర్లు ఏమిటి?" అని అడిగాడు అర్జునుడు. ఆ మాటలకు కృష్ణుడు నవ్వి "అర్జునా! మంచి ప్రశ్నవేసావు. ఆ గురువు ఎవరో కాదు. నాలో ఉన్న ఆత్మస్వరూపమే. ఆ శిష్యుడు నా మనస్సు. వారిరువురి సంవాదమే, నీ మీద ఉన్న వాత్సల్యంతో నీకు మరలా బోధించాను. ఈ మోక్షపదప్రాప్తి అనే యోగము ఇతరులకు సాధ్యం కాదు. పైగా ఇది అతి రహస్యం. ఎవరికీ ఓ పట్టాన అర్థంకాదు. నీవు అర్థం చేసుకుంటావని నీకు చెప్పాను. నేను చెప్పిన

విషయాలను జాగ్రత్తగా అనుసరించు నీ మనస్సును ఎల్లప్పుడూ స్థిరంగా, నిర్మలంగా ఉంచుకో. శ్రద్ధ, భక్తి కలిగి ఉండు. నీ మనస్సును ప్రాపంచిక విషయముల నుండి లాగి, ఆత్మవైపు మళ్లించు. నీ చిత్తమును ఆత్మతో అనుసంధానం చెయ్యి. నీ పాపాలు నశించిపోతాయి. నీకు ఉత్తమ గతులు కలుగుతాయి.

నేను పైన చెప్పిన విషయాలన్నీ యుద్ధం ఆరంభం కాకముందు, నీకు నేను బోధించాను. మరలా అవే విషయాలు మరలా నీకు బోధించాను. వీటిని ఆచరించి, నిరంతర ఆనందంతో వర్ధిల్లు." అని శ్రీకృష్ణుడు అర్జునుడికి బోధించడంతో ఈ అనుగీత సంపూర్ణం అయింది.

వ్యాసవిరచితమైన మహాభారత ఇతిహాసంలో,
అశ్వమేధపర్వంలో, మొదటి రెండు అధ్యాయాలలో చెప్పబడిన
"అనుగీత" అనే ఆధ్యాత్మిక సంవాదము సంపూర్ణము.
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్.